


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com




visit us @ http://epaper.suryaa.com

సంపుటి 17 | సంచిక 244

శుక్రవారం | 2 ఆగస్టు 2024 | విజయవాడ

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi


అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - శిశిర ఋతువు, ఆషాఢమాసం బహుళ దశమి రా.6.48, కృత్తిక మ.1.24, వర్జ్యం తె.4.52
రాహుకాలం మ.3.00 నుంచి 4.30 వరకు దుర్ముహూర్తం ఉ.8.11 నుంచి 9.03 వరకు తిరిగి రా.10.59 నుంచి 11.43 వరకు

## నం.1 రాష్ట్రంగా
# తీర్చిదిద్దుతాం

### పేదరికంలేని సమాజాన్ని ఏర్పాటు చేసుకోవాలి

- నీళ్లుంటే సంపద సృష్టించవచ్చు, సంపద వల్ల ప్రభుత్వానికి ఆదాయం తద్వారా పేదరిక నిర్మూలన
- పేదరికంలేని సమాజాన్ని ఏర్పాటు చేసుకోవాలి
- అభివృద్ధి చేస్తాం.. సంక్షేమం అందిస్తాం.. ఆదాయం పెంచుతాం
- పెంచిన ఆదాయం పేదలకు పంచే బాధ్యత మాది
- శ్రీశైలాన్ని ఒక దివ్యక్షేత్రంగా తయారుచేసే బాధ్యత మాది
- సామాజిక న్యాయం కూటమి ప్రభుత్వ సిద్ధాంతం
- ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు

వివరాలు-2లో



నీరు సంపదను సృష్టిస్తుందని, తద్వారా పేదరిక నిర్మూలన జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. నంద్యాల జిల్లా సున్నిపెంట నీటి వినియోగదారుల సంఘం ప్రతినిధులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికంలేని సమాజాన్ని ఏర్పాటు చేసుకోవాలి.

## ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు
# సుప్రీం ఓకే

- వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉంది
- చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం తీర్పు
- రాజ్యాంగం అనుమతిస్తుందని తేల్చిన సుప్రీంకోర్టు
- జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించే అధికారం రాష్ట్రాలదే

మూడు దశాబ్ధాల పోరాటం ఫలించింది. ఎందరో నాయకుల ఆకాంక్ష నెరవేరింది. 30 ఏళ్ల పోరాటంలో ఎన్నో ఒడిదుడుకులు.. తమ హక్కుల కోసం పోరాటం.. తమ కళ నెరవేరిందనుకున్న సమయంలో న్యాయస్థానం రూపంలో అడ్డంకులు.. వెరసి.. మరో 20 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది.



6లో




## హైకోర్టులో పొన్నవోలుకు చుక్కెదురు

- తనకు పోలీసు భద్రత కల్పించాలని పిటిషన్
- పోలీసు భద్రత పొందేందుకు అనర్హుల్లన్న హైకోర్టు
- ప్రాణహాని లేదని సెక్యూరిటీ రివ్యూ కమిటీ తేల్చిందన్న ధర్మాసనం
- కమిటీ నివేదికపై అభ్యంతరాలుంటే సవాల్ చేసుకోవాలని సూచన

వివరాలు-7లో

## ఆమె ఇండియన్ అమెరికన్

- నల్లజాతీయురాలని కొన్నాళ్ల క్రితం వరకు నాకు తెలియదు: ట్రంప్
- తన జాతీయతను ప్రశ్నించిన ట్రంప్‌పై కమలా హారిస్ సీరియస్
- మళ్లీ పాత పాటే పాడుతున్నారంటూ కమల హారిస్ సెటైర్లు
- చర్చకు సిద్ధమా..! ట్రంప్‌కు సవాల్



6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని 2, 3 ఏళ్లలో పూర్తి చేసి
# రైతుల కళ్లల్లో ఆనందం చూస్తాం

- మల్లవల్లి పారిశ్రామిక వాడకు మళ్ళీ పూర్వవైభవం
- గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

చింతలపూడి ఎత్తిపోతల పథకంను త్వరలో పూర్తిచేసి నూజివీడు ప్రాంత రైతుల కళ్ళల్లో ఆనందం చూస్తామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు గృహ నిర్మాణం శాఖామంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామంలో గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఇంటింటికి వెళ్లి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిపి పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులపై గత ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో రాష్ట్రాన్ని నాశనం చేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన వాటిలో ప్రధానమైన అయిదు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు నిర్ణయించుకున్నారని, వాటిలో చింతలపూడి ఎత్తిపోతల పథకం కూడా ఒకటని మంత్రి చెప్పారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ఈ రోజు నుంచే మళ్లీ ప్రారంభిస్తున్నామని, నూజివీడు ప్రాంతంలో నాగార్జున సాగర్‌కు సంబంధించిన కాలువలు ఇప్పటికే ఉన్నందున చింతలపూడి ఎత్తిపోతల పథకం త్వరలో సాగునీరు అందించి నూజివీడు ప్రాంత రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం అందిస్తామని మంత్రి చెప్పారు.



7లో

## వయనాడ్ విషాదం



6లో

- 280 దాటిన మృతుల సంఖ్య
- అంతకంతకూ పెరుగుతున్న మృతుల సంఖ్య
- మట్టిదిబ్బల కింద ఇంకా 200 మంది
- వయనాడ్ వెళ్లి పరిస్థితిని సమీక్షించిన సీఎం విజయన్

## అంతా ఇంతే!



పింఛన్లకి పేరే కాదు కవర్ మీద అన్నగారి బొమ్మ వేయిద్దాం సార్

## కూటమి ప్రభుత్వంలో
# ప్రజలందరికీ మేలు

- ప్రజల ఆకాంక్షలన్నీ తీరుస్తాం
- ప్రాధాన్యతానుసారం సమస్యల పరిష్కారం
- తెనాలి నియోజకవర్గంలో సామాజిక పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- రోజంతా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో పర్యటన



2లో

తెనాలి నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగలా సాగింది. ఒకటో తేదీ కావడంతో గురువారం ఉదయమే పింఛన్లను పంపిణీ చేసేందుకు యంత్రాంగం సిద్ధమైంది.

## సుప్రీంకోర్టు తీర్పును
# అంగీకరించం


- పోరాటం ఖాయం
- అవసరమైతే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తా
- మాజీ ఎంపీ హర్షకుమార్ కీలక వ్యాఖ్యలు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ ఎంపీ హర్షకుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగీకరించే ప్రశ్నే లేదన్నారు. వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అంగీకరించడం లేదని రాజమండ్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రకటించారు.



2లో


## సరికొత్త
## గరిష్ఠాలకు సూచీలు



5లో

- సెన్సెక్స్ 126 పాయింట్లు
- నిఫ్టీ 59 పాయింట్లు చొప్పున లాభం

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సరికొత్త గరిష్ఠాల వద్ద ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మన సూచీలూ రాణించాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ షేర్లు సూచీలను ముందుకు నడిపించాయి. దీంతో ఇంట్రాడేలో సెన్సెక్స్ 82,129 పాయింట్ల వద్ద, నిఫ్టీ 25,078 వద్ద జీవనకాల గరిష్ఠాలను తాకాయి.



## మరో రెండు కొత్త రిజర్వాయర్లు నిర్మిస్తాం


అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించిన ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు.. అనంతపురం జిల్లాకు గుడ్ న్యూస్ వినిపించారు. మడకశిర ప్రాంతంలో మరో రెండు రిజర్వాయర్లు నిర్మిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. మడకశిరలో రింగు రోడ్డు నిర్మిస్తామని చంద్రబాబు ప్రకటించారు. అలాగే ఈ ప్రాంతంలో మరో రెండు రిజర్వాయర్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. డ్రిప్ ఇరిగేషన్ అందుబాటులోకి తేవడంతో పాటుగా పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. మడకశిర మండలం గుండుమలలో జరిగిన ప్రజావేదిక సభలో మాట్లాడిన చంద్రబాబు.. వైసీపీ ప్రభుత్వంపైనా విమర్శలు చేశారు. అన్ని వ్యవస్థలను వైసీపీ నాశనం చేసిందని మండిపడ్డారు.

**ప్రధానాంశాలు:**

సీఎం చంద్రబాబు ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనలో వరాల జల్లు కురిపించారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో పింఛన్లను పంపిణీ చేశారు. మడకశిర మండలం గుండుమల గ్రామంలో ప్రజావేదిక సభలో పాల్గొన్నారు. పింఛన్ లబ్ధిదారులతో చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానం ద్వారా.. అనంతపురం జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. బిందు సేద్యాన్ని ప్రోత్సహిస్తామని, జిల్లాలో డ్రిప్ ఇరిగేషన్ అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. అనంతపురం జిల్లాకు కియా పరిశ్రమను తీసుకువచ్చి ఉపాధి కల్పించామని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. ఇప్పుడు మరిన్ని పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్నారు. అలాగే పేదప్రజలు అందరికీ ఇల్లు కట్టిస్తామని.. ఇందుకోసం ఒక్కో ఇంటికి రూ.4 లక్షలు సాయం అందిస్తామని ప్రకటించారు.

# ఏపీని నం.1 స్టేట్‌గా తీర్చిదిద్దుతాం

- నీళ్లుంటే సంపద సృష్టించవచ్చు, సంపద వల్ల ప్రభుత్వానికి ఆదాయం.. తద్వారా పేదరిక నిర్మూలన
- పేదరికంలేని సమాజాన్ని ఏర్పాటు చేసుకోవాలి
- అభివృద్ధి చేస్తాం.. సంక్షేమం అందిస్తాం.. ఆదాయం పెంచుతాం
- పెంచిన ఆదాయం పేదలకు పంచే బాధ్యత మాది
- శ్రీశైలాన్ని ఒక దివ్యక్షేత్రంగా తయారుచేసే బాధ్యత మాది
- సామాజిక న్యాయం కూటమి ప్రభుత్వ సిద్ధాంతం
- ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : నీరు సంపదను సృష్టిస్తుందని, తద్వారా పేదరిక నిర్మూలన జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. నంద్యాల జిల్లా సున్నిపెంట నీటి వినియోగదారుల సంఘం ప్రతినిధులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికంలేని సమాజాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఒకపక్క సంక్షేమ కార్యక్రమాలు ఇవ్వాలి, ఇంకోపక్క అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఉన్నామని చెప్పారు. నిరుద్యోగులకు నైపుణ్యాన్ని నేర్పించడానికి స్కిల్ డెవలప్‌మెంట్ కోసం స్కిల్ సెన్సస్ పెట్టామని చెప్పారు. శ్రీశైలంలో ఉండే పిల్లలు అమెరికాలో ఉండే న్యూయార్క్ లో పనిచేసే శక్తిని మీకు ఇవ్వాలనేది నా అభిమతం. ఇప్పటికే 25 ఏళ్ల క్రిందట చేసిన పనులు మీరు చూశారు. హైదరాబాద్ నగరాన్ని మీరు చూశారు. ప్రపంచమంతా ఐటీ ప్రొఫెషన్స్ ను మీరు చూశారు. కానీ అప్పుడప్పుడు మీరు ఏం ఆలోచిస్తారంటే అన్ని పనులు అవుతా ఉంటే ఈసారి ఇంకొకడు వస్తున్నాడు కొత్త బిచ్చగాడు ఏదో చేస్తారని ఓట్లు వేసేస్తున్నారు. వాళ్లు వచ్చి అడవి పందుల మాదిరి మొత్తం చెడగొట్టి పోయారు. సర్వనాశనం చేసి వెళ్లారు.. భ్రష్టుపట్టించి వెళ్లారు.. విధ్వంసం చేసి వెళ్లిపోయారు. ఇప్పుడు అవన్నీ చేయాలంటే నాకొక ఐదు పదేళ్లు పట్టేలా ఉంది. కానీ నాకొక సంకల్పం ఉంది. మా కూటమిని మీరు చూస్తే.. నేను గానీ, పవన్ కళ్యాణ్ గానీ, నరేంద్ర మోదీ గానీ అందరం కూడా ఒక దృఢ సంకల్పంతో ఉన్నాం. మీకు ఏమాత్రం అనుమానం వద్దు. పరిగెత్తిస్తాం.. మళ్లీ రాబోయే రోజుల్లో నెం.1 స్టేట్‌గా తయారుచేసే బాధ్యత మాది అని మీకు హామీ ఇస్తున్నా. ఇక్కడికి వచ్చినప్పుడు.. ఈరోజే ఒక వార్త వచ్చిందని మీరు గుర్తుపెట్టుకోవాలి. సుప్రీంకోర్టు ఏదైతే ఉందో.. షెడ్యూల్ కులాల కోసం ఎ,బి,సి,డి కేటగిరైజేషన్ సబబు అని ఒక నిర్ణయం చేశారు. నేను ఈరోజు చెప్పడం కాదు. సామాజిక న్యాయం మా పార్టీ సిద్ధాంతం. ఒకరికి కాదు అందరికీ న్యాయం జరగాలి. అందుకే 1996-97లో రామచంద్రరావు కమిషన్ వేసి ఆర్థిక పరిస్థితులన్నీ అధ్యయనం చేసిన తర్వాత ఎ,బి,సి,డి కేటగిరైజేషన్ నేనే తీసుకొచ్చా. తర్వాత అది డిఫరెంట్ కోర్టుల్లో ఛాలెంజ్ కావడంతో ఇప్పటివరకు అనేక విధాలుగా ముందుకుపోయి ఈరోజు దాన్ని ఏడుగురు జడ్జిల బెంచ్ ధృవీకరించారు. దాన్ని కూడా ఆమోదించారు. జనాభా దామాషా ప్రకారం ప్రతి కులానికి, ప్రతి మతానికి, ప్రతి వర్గానికీ న్యాయం చేయడం మా పార్టీ సిద్ధాంతం. జరిగిన ఎన్నికల్లో సీట్లు కూడా.. శబరిని ఇక్కడ ఎంపీగా ఇస్తే పక్కన ఎంపీగా నాగరాజు ఒక కురుబ కమ్యూనిటీకి సంబంధించిన వ్యక్తికి ఇచ్చాం. అనంతపురంలో ఒక బోయ వాల్మీకి కమ్యూనిటీకి ఎంపీ ఇచ్చాం. నంద్యాలలో ఫరూక్ కు ఆరోజు ఎమ్మెల్యే గా ఇచ్చాం, ఈరోజు మంత్రిగా చేశాం. కర్నూలులో టీజీ భరత్ ను ఒక వైశ్య కులం నుంచి ఎమ్మెల్యేగా ఇచ్చి మంత్రిని చేశాం. సామాజిక న్యాయం జరగాలి. అన్ని వర్గాలకు న్యాయం జరగాలి. ఈ ప్రభుత్వం అందరిది. నేను మీ అందరివాడిగా ఉంటాను శాశ్వతంగా అదే చేస్తాను. ఎక్కడ పేదవాడు ఉంటే అక్కడ ఉంటాను, అందుకే జీరో పావర్టీ అన్నాను. మీ గ్రామంలో పేదవాళ్లు ఉంటే వాళ్లను పైకి తీసుకొచ్చే బాధ్యత పైకొచ్చినవాళ్లు తీసుకోవాలి. నేను ఒక ఫార్ములా మాట్లాడాను. పీ-3 (పబ్లిక్, ప్రైవేట్ పార్ట్ నర్ షిప్) మోడల్లో హైదరాబాద్ బాగుపడింది. హైదరాబాద్ లో రోడ్లు కానీ, టెలి కమ్యూనికేషన్ కానీ, కరెంట్ కానీ ఇవన్నీ కూడా వచ్చాయంటే ప్రైవేట్ వ్యక్తుల భాగస్వామ్యంతో వచ్చాయి. ఇప్పుడు నేను మాట్లాడేది ఎవరైతే బాగుపడ్డారో సమాజంలో వాళ్ల బాధ్యత పేదవాళ్లను పైకి తీసుకురావడం. పైనుండే పదిమంది కింద ఉండే 25 మందికి చేయూత ఇవ్వగలిగితే పేదరిక నిర్మూలన అసాధ్యం కాదు. అదే నా జీవితాశయం, నా సంకల్పం. తప్పకుండా ఈరోజు మల్లన్న సాక్షిగా చెబుతున్నా ఇది సాధించి తీరుతామని మీ అందరికీ హామీ ఇస్తున్నా. ఈరోజు రూ.33 వేల కోట్లు ఖర్చు పెట్టి పింఛన్లు ఇస్తున్నాం. నేను ఒకటే హామీ ఇస్తున్నా. సంపద సృష్టించడం తెలిసిన పార్టీ మనది. ఆ సంపద పేదవాళ్లకు పంచడం తెలిసిన పార్టీ మనది.. మొన్నటివరకు పరిపాలించిన పార్టీ దోచుకోవడం తెలిసిన పార్టీ. దాచుకోవడం, దోచుకోవడం, వ్యవస్థలను విధ్వంసం చేయడం, నిద్రలేస్తే అబద్ధాలు చెప్పడం. రెండు నెలలు కాలేదు నేను వచ్చి.. ఇప్పటికే నేను ఏమీ చేయలేదని మాట్లాడుతున్నారు. నేను ఏం చేశానో, చేయలేదో ఈ ప్రజలే సాక్ష్యమని విజ్ఞప్తి చేస్తున్నా. ఒక పక్క అభివృద్ధి చేస్తా, ఒక పక్క సంక్షేమానికి పెద్దపీట వేస్తా, ఇంకోపక్క ఆదాయం పెంచుతా. పెంచిన ఆదాయం ఈ పేదవాళ్లకు పంచే బాధ్యత నాది అని హామీ ఇస్తున్నా. నా జీవితంలో ఏదైతే ఒక ఆశయం.. ఒక్కసారి రిజర్వాయర్‌లోకి మంచి వర్షాలు పడితే ఐదేళ్లు కరువు లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే ఆరోజు ప్రాజెక్టుల కోసం రూ.68 వేల కోట్లు ఖర్చు పెట్టాం. మైక్రో ఇరిగేషన్ తీసుకొచ్చాను, డ్రిప్ ఇరిగేషన్ తీసుకొచ్చాను అనేక విధాలుగా ముందుకుపోయాం. కానీ వీళ్లు వచ్చిన తర్వాత అన్నీ ఆపేశారు. ఈరోజు వర్షాలు బ్రహ్మాండంగా పడ్డాయ్, దేవుడు కరుణించాడు. చాలా సంతోషం అదే సమయంలో నేను ఆలోచించేది అన్ని రిజర్వాయర్లలో నీళ్లు పెట్టి ఆ నీళ్లు కూడా పొదుపుగా వాడుకుని అక్కడ నుంచి మీకు సంపద సృష్టించే మార్గాలు, ఆదాయం పెంచే మార్గాలు ఎన్ని ఉన్నాయో అన్ని కూడా నేర్పించే బాధ్యత నాది, మాది. మీరు కూడా పూర్తిగా అనుసంధానమైతే మనకు మంచి జరుగుతుంది. రాష్ట్రానికి మంచి జరుగుతుంది. దీనికి పూర్తిగా ముందుకు రావాల్సిందిగా మరొక్కసారి కోరుకుంటున్నాను. మళ్లీ మళ్లీ వస్తా, ఈ శ్రీశైలాన్ని ఒక దివ్యక్షేత్రంగా తయారుచేసే బాధ్యత తీసుకుంటాం. ఇదొక పవిత్రమైన పుణ్యభూమి, ఇక్కడికి దేశంలోనే కాకుండా ప్రపంచం మొత్తం వచ్చే అవకాశాలు ఉన్నాయి. అలాంటప్పుడు దీన్ని ఏవిధంగా అభివృద్ధి చేయాలో చేయడం ఇప్పుడే మన రాజశేఖర్ రెడ్డి చెప్పినట్టు ఇక్కడ సమస్యలన్నీ పరిష్కారం చేస్తాం, శబరి చెప్పినట్టు నేషనల్ హైవే సిద్దేశ్వరం దగ్గర ఐకానిక్ బ్రిడ్జ్ కాకుండా దానికి నీళ్లన్నీ పెట్టడానికి ఏం చేయాలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియాతో చర్చించి ఐకానిక్ బ్రిడ్జ్ కాకుండా రిజర్వాయర్‌గా తయారు చేయడానికి ఏం చేయాలో చేస్తాం.. దానికి కూడా శ్రీకారం చుడతాం అంటూ సీఎం చంద్రబాబు తన ప్రసంగం ముగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, జల వనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, నంద్యాల పార్లమెంటు సభ్యులు బైరెడ్డి శబరి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి, డిఐజీ కే ప్రవీణ్ కుమార్, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో ప్రజలందరికీ మేలు

- ప్రజల ఆకాంక్షలన్నీ తీరుస్తాం
- ప్రాధాన్యతానుసారం సమస్యల పరిష్కారం
- తెనాలి నియోజకవర్గంలో సామాజిక పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- రోజంతా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో పర్యటన



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తెనాలి నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగలా సాగింది. ఒకటో తేదీ కావడంతో గురువారం ఉదయమే పింఛన్లను పంపిణీ చేసేందుకు యంత్రాంగం సిద్ధమైంది. ప్రతి ఇంటికీ వెళ్లి పింఛన్లు అందించే కార్యక్రమంలో రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి, తెనాలి నియోజకవర్గ ఎమ్మెల్యే, నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు చక్రాయపాలెంలో జరిగిన పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఆయన రోజంతా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో పర్యటిస్తూ పింఛన్ల పంపిణీ చేపట్టారు. పింఛన్ల పంపిణీ తీరును పర్యవేక్షించారు. అలాగే గ్రామాల్లోని సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలతో ముచ్చటిస్తూ... యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ శ్రీ మనోహర్ గారి పర్యటన సాగింది. గతంలో పెండింగ్ ఉండిపోయిన సమస్యలను తీర్చడంపై దృష్టిపెట్టామని, ప్రాధాన్యతానుసారం సమస్యలను పరిష్కరించుకుందామని చెప్పారు. పింఛన్లను అందుకున్న వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుంటూ, వారికి జాగ్రత్తలు చెప్పారు. ప్రజలు తెలిపిన ఇతర సమస్యలను విన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, సౌకర్యాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తుందని హామీ ఇచ్చారు. వృద్ధులు మనోహర్ గారిని చూసి మా పెద్ద కొడుకే ఇంటికి వచ్చినట్టుందయ్యా... అంటూ ఆప్యాయంగా పట్టుకొని పలకరిస్తూ మురిసిపోయారు. దారి మధ్యలో ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ... గ్రామస్తులకు అభివాదం చేస్తూ శ్రీ మనోహర్ గారు ఉత్సాహంగా ముందుకు కదిలారు.

**కూటమి పాలనలో ప్రజల ఆకాంక్షలన్నీ తీరుస్తాం :** ఉదయం చక్రాయపాలెంతో మొదలైన పింఛన్ల పంపిణీ తర్వాత జెముడుపాడు, దావులూరు, దంతులూరు, తూములూరు, కొల్లిపర, కొలకలూరు, గుడివాడ, కోపల్లె, అంగలకుదురు గ్రామాల్లో సాయంత్రం వరకు సాగింది. అన్ని కార్యక్రమాల్లో మనోహర్ గారు పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పింఛన్ల సొమ్మును అందజేశారు. గ్రామాల్లోని నాయకులతోనూ ప్రత్యేకంగా మాట్లాడారు.

ఈ సందర్భంగా శ్రీ మనోహర్ గారు మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో ఇచ్చిన అధికారాన్ని కూటమి ప్రభుత్వం బాధ్యతగా నిర్వర్తిస్తుంది. ప్రజల ఆకాంక్షలన్నీ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ గారికి తెలుసు. వారిరువురి నాయకత్వంలో ప్రజల ఆకాంక్షలన్నీ నెరవేర్చేలా కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు పనిచేస్తారు. అందరికీ మేలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

గ్రామాల్లోని సమస్యల పట్ల అవగాహన ఉంది. వాటిని ప్రాధాన్యత పరంగా పరిష్కరించుకుందాం. దీనికి ప్రజల సహకారం కూడా అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు తీర్పును అంగీకరించం

- పోరాటం ఖాయం
- అవసరమైతే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తా
- మాజీ ఎంపీ హర్షకుమార్ కీలక వ్యాఖ్యలు



అమలాపురం : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ ఎంపీ హర్షకుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగీకరించే ప్రశ్నే లేదన్నారు. వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అంగీకరించడం లేదని రాజమండ్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ మందకృష్ణ మాదిగను పావులా వాడుకుందని.. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగానికి లోబడకుండా ఇచ్చిందని ఆరోపించారు. ఆర్టికల్ 351 షెడ్యూల్ కులాలకు ఉద్దేశించబడినదని గుర్తు చేశారు. వర్గీకరణ చేయడానికి పార్లమెంటుకు కూడా అధికారం లేదని స్పష్టం చేశారు. రాష్ట్రపతికి, పార్లమెంటుకు లేని అధికారాలు సుప్రీంకోర్టుకు ఎక్కడివని ఆయన ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పును తాము అంగీకరించడం లేదని హర్షకుమార్ స్పష్టం చేసారు. ఈ తీర్పు మోడీ చంద్రబాబు కలిసి అడిన కుట్ర అన్నారు. సుప్రీంకోర్టు ఈ తీర్పును ఫిబ్రవరిలోనే రిజర్వ్ చేసి పెట్టిందని.. రామ్ జన్మభూమి, అయోధ్య, బాబ్రీ మసీదు తీర్పులలో జరిగిన కుట్రలో వర్గీకరణ విషయంలో కూడా జరిగిందని ఆరోపించారు. ఇది కాంగ్రెస్ పార్టీ నిర్ణయం అయితే... నేను కాంగ్రెస్ పార్టీలో ఉండనని ప్రకటించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఎలా తీర్మానం చేస్తారని హర్షకుమార్ ప్రశ్నించారు. ఈ తీర్పు ఇచ్చిన ధర్మాసనములో ఎస్సీ ఎస్టీ జడ్జిలు లేరని.. మాదిగల ఉద్యోగాలు సంపదలు మాలలు దోచుకుంటున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాయకులతో రాజమండ్రిలో సభ ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు ఇచ్చింది. వర్గీకరణకు రాష్ట్రాలకు అధికారం కల్పిస్తూ తీర్పు వెలువరించింది. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందని కోర్టు స్పష్టం చేసింది. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం వర్గీకరణ చేపట్టేందుకు లైన్ క్లియర్ చేసింది. చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ సహా ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెల్లడించింది. ఎస్సీ వర్గీకరణకు తాము అనుకూలమే అని ఇప్పటికే కోర్టుకి కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇవాళ కోర్టు తీర్పు వెలువరించింది. మొత్తం ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనంలో 6:1 మెజార్టీతో ఈ తీర్పు వెల్లడైంది. ఎస్సీ వర్గీకరణ చేయాలని మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే కాదు..దాదాపుగా అన్ని రాష్ట్రాల్లోనూ ఎస్సీ వర్గీకరణ డిమాండ్లు ఉన్నాయి. సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు ఉన్నాయి. వర్గీకరణ చేయాలని అన్న డిమాండ్ ఎంత ఉందో..వద్దన్న డిమాండ్ కూడా అంతే ఉంది. ఇప్పుడు ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా పోరాడతానని హర్షకుమార్ ప్రకటించడం సంచలనం సృష్టించే అవకాశం ఉంది.

# ఎక్సైజ్‌శాఖ ప్రక్షాళన

- సంస్థాగత మార్పులపై సర్కార్ ఫోకస్
- స్పెషల్ ఎన్ఫోర్సుమెంట్ బ్యూరో (సెబ్) రద్దు చేసే దిశలో అడుగులు
- 19 మంది సభ్యులతో అంతర్గత కమిటీని ఏర్పాటు చేసిన ఏపీ సర్కార్
- కమిటీలో డీసీ నుంచి కానిస్టేబుల్ వరకు సభ్యులు

అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ శాఖ పని తీరు మెరుగు పరిచే విషయమై కసరత్తు చేస్తుంది. స్పెషల్ ఎన్ ఫోర్సుమెంట్ బ్యూరో- సెబ్ రద్దు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఎక్సైజ్ శాఖలో సంస్థాగత మార్పులు చేసేలా చర్యలు చేపట్టింది. ఎక్సైజ్ శాఖలో సంస్థాగత మార్పులపై అధ్యయనం చేసేందుకు అంతర్గత కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు జీవో జారీ చేసింది. 19 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏపీ సర్కార్ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఎక్సైజ్ డీసీ నుంచి కానిస్టేబుల్ వరకు అందరిని సభ్యులుగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒకే గొడుగు కింద ఎక్సైజ్ శాఖను తెచ్చేలా ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. 2020లో ఎక్సైజ్ శాఖను రెండు ముక్కలు గత వైసీపీ ప్రభుత్వం చేసింది. ఎక్సైజ్, సెబ్ విభాగాలుగా చేసి కార్యకలాపాలు నిర్వహించింది.. సిబ్బంది కొరతతో పాటు ఇబ్బందులను సెబ్, ఎక్సైజ్ శాఖ ఎదుర్కొన్నాయి. ఇక, ఎక్సైజ్ శాఖలో సంస్థాగతంగా మార్పులు చేస్తామని శ్వేత పత్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రస్తావించింది. ఆగస్టు మూడో తేదీలోకా తుది నివేదిక ఇవ్వాలని కమిటీకి ఏపీ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

## రేపు అమరావతికి రానున్న ఐఐటీ నిపుణులు

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: రాజధానిలో అసంపూర్తిగా నిలిచిన కట్టడాల సామర్థ్యాన్ని అధ్యయనం చేసేందుకు ఐఐటి నిపుణులు రాష్ట్రానికి రానున్నారు.2019 కు ముందు నిర్మాణాలు ప్రారంభమై మధ్యలోనే నిలిచిపోయిన భవనాలు కొన్ని ఉండగా...మరికొన్ని ఫౌండేషన్ పనులు పూర్తి చేసుకుని అసంపూర్తిగా మిగిలిపోయాయి..అలాంటి నిర్మాణాల విషయంలో ఎలా ముందుకెళ్లాలని దానిపై ఐఐటి ఇంజినీర్లతో అధ్యయనం చేయిస్తుంది రాష్ట్ర ప్రభుత్వం. 2019 కు ముందు నిర్మాణాలు ప్రారంభమై మధ్యలో నిలిచిపోయిన వాటి స్థితిగతులను అధ్యయనం చేసేందుకు ఐఐటి నిపుణులు రాష్ట్రానికి రానున్నారు.ఆయా నిర్మాణాల పటిష్టత,ఇతర టెక్నికల్ అంశాలను ఐఐటి ఇంజినీర్లు పరిశీలించనున్నారు. సెక్రటేరియట్,హెచ్ వోడి కార్యాలయాల టవర్లతో పాటు హై కోర్టు భవనాన్ని ఐకానిక్ కట్టడాలుగా నిర్మించేలా నాటి టీడీపీ ప్రభుత్వం పనులు మొదలు పెట్టింది...దీనికోసం భారీ ఫౌండేషన్ లతో పునాదులు కూడా వేసింది..అయితే పునాదుల దశలోనే ఆయా నిర్మాణాలు నిలిచిపోయాయి...ఈ భవనల ఫౌండేషన్ సామర్థ్యాన్ని పరిశీలించే బాధ్యతను ఐఐటీ మద్రాస్‌కు అప్పగించింది..ఇక ఐఏఎస్ అధికారుల నివాసాలు,మంత్రులు,ఎమ్మెల్యే,ఎమ్మెల్సీల క్వార్టర్ల నాణ్యతను అంచనా వేసే బాధ్యతను హైదరాబాద్ ఐఐటీకి అప్పగించింది ప్రభుత్వం. ఐఐటీ మద్రాస్,ఐఐటీ హైదరాబాద్ ల నుంచి ఇద్దరేసి ఇంజినీర్ల బృందాలు రేపు(శుక్రవారం)అమరావతికి రానున్నాయి...రెండు బృందాలు రెండు రోజులపాటు అమరావతిలో పర్యటించి ఆయా కట్టడాల ను పరిశీలించి వాటి నాణ్యత,సామర్థ్యాన్ని అంచనా వేయనున్నాయి..అమరావతి పర్యటన లో భాగంగా సీఆర్డీయే అధికారులతో రెండు బృందాల్లోని ఇంజినీర్లు విడివిడిగా సమావేశం కానున్నారు.

## అలుపెరుగని అక్షరాయుధుడు

### ఏబీకే గ్రాంథావిష్కరణ - అంకితం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : 90 ఏళ్లకు చేరిన అక్షర దిగ్గజం సీనియర్ ఎడిటర్ ఏబీకే ప్రసాద్ గ్రంధావిష్కరణ గురువారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో జరిగింది. ఈ సందర్భంగా ఏపీకె ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్వ ప్రధానమంత్రి మీడియా సలహాదారు, ఫైనాన్షియల్ ఎక్స్ ప్రెస్ పూర్వ సంపాదకులు డాక్టర్ సంజయ్ బారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు జర్నలిస్టులు ఏబీకే ప్రసాద్ కు ఓ ప్రత్యేకత ఉందన్నారు. ఏబీకే ప్రసాద్ సామాజిక స్పృహ గల జర్నలిస్టుగా సమాజానికి ఎంతో సేవలు అందించాలని కొనియాడారు. అలుపెరుగని అక్షరాయుడు-ఏబికె అనే పేరుతో సంకలనం తీసుకురావడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షులు కే. శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీకే తన విధి నిర్వహణలో నిరంతరం సమాజానికి సేవలందించే జర్నలిస్టుగా పేరు తెచ్చుకున్నారని సీనియర్ ఎడిటర్ గా ఏబీకే తనకు తానే సాటి అని నిరూపించుకున్నారన్నారు. అక్షరాయుడు ఏబికె పుస్తకం భావితరాల జర్నలిస్టులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్షులు దాసు కేశవరావు వ్యవహరించారు. ఆత్మీయ అతిథులుగా డాక్టర్ కే రామచంద్రమూర్తి, ఆంధ్రజ్యోతి ఎడిటర్ డాక్టర్ కే శ్రీనివాస్, విశాలాంధ్ర ఎడిటర్ ఆర్ వి రామారావులు హాజరయ్యారు. కార్యక్రమంలో వయోధిక పాత్రికేయ సంఘం కార్యదర్శి కే లక్ష్మణరావు, సీనియర్ జర్నలిస్టులు మాడభూషి శ్రీధర్, వల్లీశ్వర్, భగీరథ, ములుగు రాజేశ్వరరావు, హేమ సుందర్, టి శ్రీనివాసన్, డాక్టర్ రామ మూర్తి, వాకాటి మధు, శ్రీనివాస్ రెడ్డి, తాడి ప్రకాష్, ఎన్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

పుట్టపర్తి, ఆగస్టు 1: సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. గురువారం శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి మడకశిర మండలంలోని గుండుమలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథక నగదును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారుల కుటుంబ ఆర్థిక పరిస్థితులపై ఆరా తీశారు.ముఖ్యమంత్రిగా తొలిసారి శ్రీ సత్యసాయి జిల్లా కు వచ్చిన నారా చంద్రబాబు నాయుడు కు గుండుమలలో కార్యకర్తలు,అభిమానులు, మహిళలు ఘనస్వాగతం పలికారు.ముందుగా గుండుమలలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణి కార్యక్రమంలో భాగంగా ఓబులమ్మ కు వితంతు పెన్షన్,పులమాసి రామన్న కు వృద్ధాప్య పెన్షన్ను స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారికి అందజేశారు.

1.వితంతు పెన్షన్ అందుకున్న ఓబులమ్మ మనోభావం : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కానుకతో.. మా కుటుంబం సంతోషంగా ఉంది. అవ్వ తాతలపై ఉన్న ప్రేమతో 4వేలు పింఛన్ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అందుకోవడం చాలా ఆనందంగా ఉంది.పెన్షన్ తో పాటు.. మా కుటుంబం ఇతర పతకల ద్వార కూడా లబ్ది పొందుతున్నాము. ఏ చీకుచింత లేకుండా జీవిస్తున్నాం. టిడిపి ప్రభుత్వంలో.. సుభిక్షంగా వుంటామన్నా నమ్మకం ఏర్పడింది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రభుత్వమే కొనసాగాలని దేవుణ్ణి కోరుకుంటున్నాం.

**లబ్ధిదారు ఓబులమ్మ వివరాలు :** షెడ్యూల్ కులం మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓబులమ్మ భర్త పది సంవత్సరాల క్రితం అనారోగ్య సమస్యలతో మరణించారు. ఓబులమ్మ కు ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరంతా వివాహమై విడివిడిగా నివసిస్తున్నారు. .ఆమె ఇద్దరు కుమారులు కోడలు బెంగళూరులోని ఓ గార్మెంట్ ఫ్యాక్టరీలో సహాయకులుగా పనిచేస్తున్నారు. ఆమె వ్యవసాయ కూలీగా పనిచేస్తూ, చుట్టుపక్కల ఇళ్లలో చిన్న చిన్న పనులు చేసుకుంటూ వుంది. ఆమె ప్రధానంగా ప్రభుత్వ మంజూరు చేసిన ఎన్టీఆర్ భరోసా వితంతు పెన్షన్ 4000 రూపాయలు అందుకోవడం ద్వారా జీవనం సాగిస్తోంది. 25 ఏళ్ల క్రితం సొంతంగా నిర్మించిన పాత ఇల్లు కూడా రూఫ్ దెబ్బతినింది పుట్టిన ఈ గ్రామంలో తన పిల్లలకు వ్యక్తిగత ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది.

***2.వృద్ధాప్య పెన్షన్ అందుకున్న పులమాసి రామన్న మనోభావం***

4 వేలు పెన్షన్ చేసిన ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు : జులై నుంచి రూ.4,000 పెన్షన్ మొత్తాన్ని అందజేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి ధన్యవాదాలు. ఇచ్చిన మాట ప్రకారం వృద్ధాప్య పెన్షన్ మూడు వేల నుంచి నాలుగు వేల కు పెంచిన ముఖ్యమంత్రి కి క జీవితాంతం రుణపడి ఉంటాం. ఎవరూ పట్టించుకోని మాలాంటి వృద్ధులకు ఈ పింఛన్ ఎంతో ఉపయోగపడుతుంది. గతంలో నెలనెలా పింఛన్ కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతూ.. పడిగాపులు కాసే వాళ్ళం. ఇప్పుడు సాక్షాత్తు ముఖ్యమంత్రి ఇంటికే పెన్షన్ డబ్బులిస్తుంటే చంద్రన్న పండుగలా వుందని సంతోషం వ్యక్తం చేశారు. లబ్ధిదారు పులమాసి రామన్న వివరాలు : వెనుకబడిన తరగతుల సంఘం వాల్మీకి బోయ సామాజిక వర్గానికి చెందిన 70 సంవత్సరాలు వయసు కలిగిన పులమాసి రామన్న వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నారు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు ఒక కూతురు ఉన్నారు. ముగ్గురికి వివాహమై విడివిడిగా నివసిస్తున్నారు. పెద్ద కుమారుడు మారుతి ఎంఏ, బీఈడీ పూర్తి చేసి వాటర్ వర్క్స్ విభాగంలో దినసరి కూలిగా పనిచేస్తున్నాడు. అలాగే ఆయన భార్య శ్రీమతి కామాక్షి బీఎస్సీ బీఈడీ చదివి ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. రెండో కుమారుడు ఏడవ తరగతి వరకు చదివి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయన భార్య పూల వ్యాపారం చేస్తూ రోజుకి 30 రూపాయలు సంపాదిస్తోంది. వీరి కుటుంబం క్రమం తప్పకుండా సత్సంగ్ భజన కార్యక్రమాలు చేస్తున్నారు. రామున్నకు జీవనోపాధికి ప్రధాన వనరు ప్రభుత్వం నుండి ప్రతినెలా అందుకుంటున్న వృద్ధాప్య ఫించన్ మాత్రమే.రామన్న స్వగ్రామంలో తన పిల్లలకు వ్యక్తిగత ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించడంతోపాటు బీఎస్సీ బీఈడీ చైర్మన్ తన పెద్ద కుమారుడు భార్యకు ఉపాధి కల్పించాలని కోరారు. పెన్షన్ దారుల కష్టాలు విన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రామన్న కు భూమితో పాట, వారి బిడ్డలకు ఉపాధి కూడా కల్పిస్తామని,ఓబులమ్మ కు ఇల్లు కూడా కట్టించి ఇస్తామని జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. గుండుమల గ్రామ ప్రజలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. అంతకుముందు గురువారం నంద్యాల జిల్లా పర్యటన ముగించుకొని శ్రీశైలం సున్నిపెంట నుంచి హెలికాప్టర్ లో బయలు దేరి మధ్యాహ్నం 3.45 గం..గుండుమల ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల హెలిపాడ్ చేరుకున్నారు.అక్కడ నుంచి రోడ్ మార్గాన గుండుమల గ్రామానికి చేరుకున్నారు. 4.05 గంటలకు గుండుమలలోని ఓబులమ్మ ఇంటి వద్ద కు చేరుకొని వితంతు పింఛను పంపిణి చేశారు. తదనంతరం పులమాసి రామన్న ఇంటికి వద్దకు చేరుకొని వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేసిన అనంతరం మల్బరి ప్లాంటేషన్ షెడ్ ను సందర్శించి పట్టు రైతుతో మాట్లాడారు.అనంతరం గుండుమలలో వడి సలమ్మ, కరియమ్మ దేవి దేవాలయాలను సందర్శించారు.గ్రామస్తులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కేరళలో కని విని ఎరుగని జల ప్రళయం

గత కొన్ని రోజులుగా కేరళ రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కొండ ప్రాంతమైన వయనాడ్ జిల్లా లో అయితే ఏకంగా ఓ మహా జల ప్రళయానికి కారణ భూతమైంది. దీంతో భారీ వర్షాలకు ఆ రాష్ట్రంలో వున్న కొండ ప్రాంతాలన్నీ తడిసీ తడిసీ వదులుగా మారిపోయిన నేపథ్యం లో చివరకు అర్ధరాత్రి వేళ కొండచరియలు అదుపు తప్పి విరుచుకుపడటంతో ఆ ప్రవాహం దాటికి కేరళ రాష్ట్రంలో ముండఖై,చూరల్మల,అత్తమల, నూల్పుజ తదితర గ్రామాలు పూర్తిగా సమాధి అయ్యాయి,నేలమట్టం అయ్యాయి అంటే పరిస్థితి ఎంతటి తీవ్ర స్థాయిలో పొడచూపిందో మనం ఇట్టే ఊహించవచ్చు. దీంతో భారీఎత్తున ప్రాణనష్టం సంభవించడంతో పాటు అయా గ్రామాలలోని రోడ్లు, బ్రిడ్జిలు వంటివన్నీ నామరూపాల్లేకుండా పోవడంతో పాటు ఏకంగా అయా ప్రాంతాలకు బాహ్య ప్రపంచంతో సైతం సంబంధాలు పూర్తిగా తెగిపోవడంతో పాటు సహాయక బృందాలు కూడా అక్కడకు కాలు పెట్టలేని పరిస్థితి సంభవించింది. అయిన ప్పటికీ బురదలో చిక్కుబడి ప్రాణాలతో వున్న పలువురిని సైన్యం, నేవీ సంయుక్త ఆపరేషన్ చేపట్టి తమ శక్తి వంచన లేకుండా కృషి సల్పి హెలికాప్టర్ల ద్వారా కాపాడగలిగారు. మరికొన్ని ప్రాంతాలలో అయితే బురద, మట్టి దిబ్బల కింద ప్రాణాలతో ఉన్నవారిని కాపాడేందుకు శాయశక్తుల ప్రయ త్నించడంలో భాగంగా వారి అనవాలు కనిపెట్టేందుకు డాగ్ స్క్వాడ్ ను కూడా రంగంలోకి దింపారు. ఇప్పటికే ఈ ఘోర విపత్తు దాటికి 123 మంది నిండు ప్రాణాలు ఇప్పటికే బలి అవ్వడంతో పాటు మరో 500 మంది జాడ తెలియకపోవడాన్ని బట్టి మరణాల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం వుంది. అంతేకాదు అత్యంత వేగంగా ఈ కొండచరియలు విరిగి పడటంతో ఏకంగా కేరళ రాష్ట్రంలో స్థానిక ఇరువలింజిపుజ నది రెండుగా చీలిపోయి, అక్కడి వెల్లరిమల ప్రభుత్వ పాఠశాల అయితే పూర్తిగా సమాధిఅయిపోవడాన్ని బట్టి ఈ జలప్రళయం ఎంతటి ప్రమాద పరిస్థితుల్లోకి ఆ రాష్ట్ర ప్రజలను నెట్టివేసిందో మనం ఇట్టే ఊహించవచ్చు.

ఏదిఏమైన కలలో కూడా ఎవ్వరూ ఊహించని విధంగా ఓ భీకరమైన తరహాలో ఉగ్రరూపం దాల్చిన ఈ ప్రకృతి చేసిన విధ్వంసం యొక్క దాటిని ఒక్కసారి మనం గమనిస్తే మనకు ఏమనిపిస్తుంది అంటే ' ఏ నిముషంలో ఏమి జరుగునో ఎవరికీ ఎరుక ' అనే సామెత ఖచ్చితంగా గుర్తుకు వచ్చి తీరుతుంది అంటే దీని అర్థం మృత్యువు అనేది ఏ వైపు నుంచి మనకు ముంచుకోస్తుందో ఏ ఒక్కరూ కూడా చెప్పలేరు అనే చేదు వాస్తవాన్ని మనమంతా తప్పక గ్రహించాలి. ఈ రోజున కేరళ రాష్ట్రంలో సంభవించిన ప్రకృతి విలయతాండవం రేపోద్దున మన రాష్ట్రం లోనో మరే ఇతర రాష్ట్రాలలో సైతం సంభవించదు అనే గ్యారంటీని ఎవరైనా ఇవ్వగలరా? అంటే అది దాదాపు అసంభవమే. ఏమైనా కేరళ రాష్ట్రంలోని వయనాడ్ జిల్లాలోని కొండ ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ ఘోర దుర్ఘటన ఓ హృదయవిదారకమైనది, మానవత్వం వున్న ప్రతి ఒక్కరిని కదిలించేదే అనే మాట సత్యదూరం కాదు. అన్నింటికిమించి కేరళ రాష్ట్రం,ఆ రాష్ట్రం లోని ప్రజలు ఈ సంకట, దిగ్భ్రాంతికరమైన, విషాదకరమైన పరిస్థితుల నుంచి, ఈ పెనువిపత్తు నుంచి, కడు దుఃఖభరితమైన పరిస్థితుల నుంచి వీలయినంతవరకు త్వరితగతిన వారంతా కోలుకోవాలని ఆ దేవ దేవుణ్ణి,ఆ సర్వేశ్వరుణ్ణి మనమంతా మనసా,వాచ, కర్మణ కోరుకుందాం. అయితే ప్రకృతికి,మానవాళికి సంభవించిన ఈ పెను ఉపద్రవం మాత్రం ఎప్పటికీ మరచిపోలేని ఓ చేదు అనుభవమే అనడంలో ఎలాంటి సందేహం లేదు!

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society
Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# వయనాడ్ విషాదాన్ని జాతీయ విపత్తుగా పరిగణించాలి

- వయనాడ్ ప్రాంతంలో అసాధారణమైన వర్షం
- జలవిలయంతో మరుభూమిగా మారిన వయనాడ్
- కొండ చరియలు విరిగిపడంతోబురదలో కూరుకు పోయిన ఊళ్ళకు ఊళ్ళు
- విపత్తు బాధితుల ఆర్తనాధాలతో ప్రతిధ్వనిస్తున్న వయనాడ్ కొండలు
- యుద్ధ ప్రాతపదిక సాగుతున్న సహాయక చర్యలు

డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్
9849328496



జులై 29-30 తేదీల్లో వయనాడ్ ప్రాంతంలో అసాధారణమైన వర్షం కురిసింది. 48 గంటల్లో 572 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ లెక్కతేల్చింది.ఈ వర్ష బీభత్సం సృష్టించిన జలవిలయంతో కేరళలోని వయనాడ్ జిల్లా అంతా మరుభూమిగా మారింది. కొండ చరియలు విరిగిపడంతో ఊళ్ళకు ఊళ్ళు బురదలో కూరుకుపోయాయి. ఇప్పటి వరకు 270 మంది మరణించారని ప్రభుత్వం చెపుతుంది. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని అంటున్నారు.

ప్రస్తుతం ఈ విపత్తు బాధితుల ఆర్తనాధాలతో వయనాడ్ కొండలు మొత్తం ప్రతిధ్వనిస్తున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో సంభవించిన ఈ విపత్తు నుండి ప్రజలను కాపాడేందుకు యుద్ధ ప్రాతపదికపై సహాయక చర్యలు సాగుతున్నాయి.స్థానిక ప్రభుత్వం రక్షణ సిబ్బందితోపాటు కేంద్ర ప్రభుత్వ డిజాస్టర్ మేనేజ్ మెంట్ రక్షక దళం,ఆరెస్సెస్,ఇతర స్వచ్ఛంద సంస్థల సహాయక బృందాలు రంగంలోకి దిగాయి.

**ఈ ఘోర విపత్తుకు కారణాలు:** ఇంతకు ప్రకృతి ప్రకోపించడమే వయనాడ్ ఘోరకలిగి కారణమా ?లేక ఇందులో మానవ తప్పిదం కూడా ఏమైనా ఉందా ? అనే ఆలోచన కూడా చేయాలి. కేరళ రాష్ట్రంలో జరిగిన అనేక ప్రకృతి విపత్తుల అనుభావాల ఆధారంగా కేరళ ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ తో పాటు,10 ఏళ్ల క్రితమే,కేంద్రం ప్రభుత్వం కూడా వేసిన పర్యావరణ కమిటీ విచారణ చేసి అనేక విలువైన సూచనలు,సలహాలతో నివేదికలను విడివిడిగా సమర్పించాయి.అందులో మొదటి కమిటీ కస్తూరి రంగన్,రెండోది పశ్చిమ కనుమల అధ్యయన కమిటీకి మాధవ్ గాడ్గిల్ చైర్మన్లుగా వహించారు.

కొన్ని గ్రామాలను పర్యావరణపరంగా సున్నితమైనవిగా ఈ రెండు కమిటీలు తమ, తమ నివేదికల్లో సూచించాయి. సున్నిత ప్రాంతాల్లో ప్రకృతి పరిరక్షణకు, ప్రజల సంరక్షణకు, జనజీవన కార్యకలాకులపై నియంత్రణలు విధించాలని రెండు కమిటీలు గట్టిగా హెచ్చరికలతో కూడిన సిఫారసులు చేశాయి.పశ్చిమ కనుమల్లోని 57వేల చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతం పర్యావరణ పరంగా సున్నితమైనదిగా నోటిఫికేషన్ విడుదల చేయాలని కూడా కేంద్రానికి గాడ్గిల్ కమిటీ సూచించింది. అయితే ప్రజల నుండి కూడా ఈ సిఫారసులకు వ్యతిరేకత వచ్చింది.

వాణిజ్యపంటలు,అభివృద్ధి ప్రాజెక్టులు, ప్రజల రోజువారీ అవసరాలకు విఘాతం కలుగుతుందనే నెపం మీద ఆ సిఫారసులను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బుట్ట దాఖలు చేసింది. కేరళ ప్రభుత్వం 2013లో కమిటీని నియమించగా 2014లో ఆ కమిటీ నివేదిక సమర్పించింది. దానిపై నోటిఫికేషన్ ఇంతవరకు విడుదల కాలేదు. ఈలోగా గనుల తవ్వకం, టూరిజం పేరట అటవీ ప్రాంతంలో నిర్మాణాలు జోరుగా చేపట్టారు, తేయాకు తోటలు పెంపకం వంటివి యధావిధిగా జరిగిపోయాయి.

కేరళ సహా పడమటి కనుమలు వ్యాపించిన ప్రాంతమంతా ఇలాంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయని కొన్నేళ్లుగా పర్యావరణ నిపుణులు హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు. 2011లోని కేంద్రం పడమటి కనుమల పరిరక్షణకై పర్యావరణ వేత్త మాధవ్ గాడ్గిల్ సారాధ్యంలో నిపుణుల కమిటీ వేసింది. అరుదైన జీవజాలానికి ఆవాసమైన దట్టమైన అరణ్యాలు ఉన్నందువల్ల గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, గోవా, కేరళకు విస్తరించిన పడమటి కనుమల్లో 75 శాతం విస్తరించిన ప్రాంతాన్ని పర్యావరణ రిత్యా సున్నితమైనదిగా ప్రకటించాలని కమిటీ సిఫారసు చేసింది.గాడ్గిల్ కమిటి నివేదిక ఇచ్చి 13 ఏళ్ళు దాటింది.కానీ ఈ రాష్ట్రాల ప్రభుత్వాలు వాణిజ్యపరంగా లాభాలను ఆశించి ఈసిఫారసులను పాటించలేదు. అదేమంటే సిఫారసులు కఠినంగా ఉన్నాయని అన్నారు.ఆర్థిక అభివృద్ధికి,ప్రజల జీవనోపాధికి నష్టం కలుగుతుందని సాకులు చెప్పాయి. పైగా అభివృద్ధి రేసులో పడి కొండలను తొలిచి టూరిస్టుల ఆకర్షణకు భారీగా ఎత్తైన హొటళ్ళు,లాడ్జ్ లు ఇతర నిర్మాణాలను చేపట్టాయి. జలవిద్యుత్ కేంద్రాలు చేపట్టాయి. కేరళలో టూరిస్ట్ రిసార్ట్స్ కల్చర్ భారీగా పెరిగింది.అక్రమ తవ్వకాలకు అంతే లేదు. సున్నిత పర్యావరణ ప్రాంతంలోని ఈ తప్పుడు అభివృద్ధి నమూనాను ఇకనైనా మార్చుకోకపోతే భవిష్యత్తు ఇంకా దుర్భరమవుతుంది. కేరళ, తమిళనాడు కర్ణాటక మూడు రాష్ట్రాలకు కూడలిలో వయనాడ్ అందమైన పర్యాటక ప్రాంతమన్నది నిజమే. దేశ దేశాల నుండి వచ్చే పర్యాటకులకు అనువుగా వసతులను పెంచి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలనీ, తద్వారా ఆర్థికాభివృద్ధి సాదించాలని భావించారు. ఈ ఆకాంక్ష కూడా సహజమే. కానీ, పర్యావరణ రిత్యా అత్యంత సున్నితమైన ప్రాంతంలో ఇష్టారీతిగా నిర్మాణాలు చేపట్టి,యదేచ్ఛగా ప్రకృతి విధ్వంసం సాగిస్తే అది మొదటికే మోసం అన్న ఇంగిత జ్ఞానం లేకుంటే ఎలా? ప్రకృతితో సహజీవనం మరచి ఇటు చట్టబద్ధంగానూ,అటు చట్టవిరుద్ధంగానూ గనుల తవ్వకాలకు అనుమతిస్తే అన్ని రకాలుగా విలయమే తప్ప వికాసం జరుగుతుందా? మనుషుల భద్రత కన్నా మాయదారి వ్యాపారం ఎక్కువా? అందుకే ఒక్క మాటలో వయనాడ్ విలయం కేవలం ప్రకృతి సృష్టించింది కాదు. మనుషుల దురాశకు ఫలితం. అభివృద్ధి పేరట మనం సాగిస్తున్న ప్రకృతి వినాశనం తాలూకు విపరీనాణామం. మనిషి తన పరిధి, పరిమితి గుర్తెరిగి ప్రవర్తించకపోతే మానవ మనగడకే ముప్పని చెప్పే నిష్ఠుర సత్యం. బాధితులు ఇకనైనా కళ్ళు తెరవాలి. ప్రకృతి పునర్జీవనానికి ఆగి ఆలోచించాలి. వాయనాడ్ నేర్పే గుణపాఠం అదే. పర్యావరణ పరిరక్షణకు అవసరమైన కఠిన చర్యలను ప్రభుత్వాలు చేపట్టకపోవడం వల్లనే... ఇప్పుడు వయనాడ్ మరు భూమిగా మిగిలింది.

**ఇప్పుడేం చేయాలి? :** ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో బీజేపీ,కేరళ ప్రభుత్వాలు పరస్పరం నిందించుకుంటున్నాయి. మీరు కారణం అంటే మీరు కారణం అంటూ వాద ప్రతివాదాలు మీడియాలో వినపడుతున్నాయి.రాజకీయాలకు ఇది తరుణం కాదు.ఇప్పుడు ఈ రెండు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కలిసి పనిచేయాలి. దేశంలో ఇతర రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాలు ఉమ్మడిగా ఈ విపత్తును జాతీయ విపత్తుగా భావించి ఎదుర్కోవాలి. కేరళ రాష్ట్రానికి అన్ని విధాలా తక్షణ సహాయం అవసరం. దేశ విదేశీ సంస్థలు ఉదారంగా ,నీరు,ఆహారం, ఆర్థిక సహకారం, వైద్యం, పునరావాసం సహాయం వెనువెంటనే చేపట్టాలి. యువత సహాయ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలి.

# సరిహద్దు భద్రత పటిష్టతకు షిన్ కూన్ లా టన్నెల్

- సొరంగ మార్గాన్ని 2025 చివరి నాటికి పూర్తిచేయాలనే లక్ష్యం
- మొదటి కొండను రిమోట్ తో పేల్చి శంఖుస్థాపన చేసిన మోడీ
- సైన్యం భారీ యంత్రాలు, సరుకు రవాణా సులభతరం
- నిఘా కక్ష్య పరిధిలోకి రాకుండా శత్రు దేశాలకి సుదూరం
- రూ.1,681.50 కోట్ల భారీ వ్యయంతో మనాలి - లేహ్ మార్గం

యేచన్ చంద్ర శేఖర్
8885050822



"షిన్కున్ లా" ("షింగో లా" అని కూడా పిలుస్తారు) భారతదేశంలో లడఖ్ మరియు హిమాచల్ ప్రదేశ్ మధ్య రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఒక పర్వత మార్గం. ఇది హిమాచల్ ప్రదేశ్లోని లాహౌల్ ప్రాంతాన్ని లడఖ్లోని జన్స్కర్ ప్రాంతంతో కలుపుతుంది. సముద్ర మట్టానికి 16,580 అడుగుల ఎత్తున ఉన్న "షిన్కున్ లా" పాస్ వద్ద నిము-పదమ్-దర్చా రహదారిని అనుసంధానిస్తూ నాలుగు వరుసలతో ఏక దిశలో రెండు గోళాకారపు సొరంగాలతో సముద్రమట్టానికి 15,800 అడుగుల ఎత్తున నిర్మితమవనున్న "షిన్కున్ లా" మోటారు సొరంగ మార్గాన్ని 2025 చివరి నాటికి పూర్తిచేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది భారత ప్రభుత్వం. ఏడాదికి ఐదు నుంచి ఏడు నెలల పాటు మంచు కారణంగా మూసుకుపోయే మనాలి-లేహ్ మరియు శ్రీనగర్-లేహ్ హైవేలకు మూడవ ప్రత్యామ్నాయ రహదారిగా దీనిని అందుబాటులోకి తీసుకురావాలన్నది మన ప్రభుత్వ సంకల్పం. జూలై 26న "విజయ్ దివస్" రజతోత్సవాలను పురస్కరించుకుని లడఖ్ లోని ద్రాస్ సెక్టార్లో గల "కార్గిల్ యుద్ధ వీరుల స్మారకాన్ని" సందర్శించి నివాళులు సమర్పించిన అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ మరియు కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ "షిన్కున్ లా టన్నెల్" ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా మొదటి కొండను రిమోట్ ద్వారా పేల్చి శంఖుస్థాపన చేసారు..

షిన్కున్ లా టన్నెల్ ప్రాజెక్ట్ లడఖ్ ప్రాంతంలో నైసర్గికంగా అత్యంత కఠినమైన భూభాగంలో తీవ్రమైన వాతావరణ పరిస్థితులతో విసిరే సవాళ్లను పరిష్కరించే లక్ష్యంతో సముద్ర మట్టానికి 16,580 అడుగుల ఎత్తులో ఉండే షిన్కున్ లా పాస్ కింద సొరంగం నిర్మించాలని భారత ప్రభుత్వం సంకల్పించడం ఒక వ్యూహాత్మక చొరవ అని చెప్పవచ్చు. చైనాతో కొనసాగుతున్న సైనిక ఉద్రిక్తతల నడుమ, ఈ నిర్ణయం సరిహద్దు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో భారతదేశం యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఏడాదికి ఐదు నుంచి ఏడు నెలల పాటు మంచు కారణంగా మూసుకుపోయే మనాలి-సర్చు-లేహ్ మరియు శ్రీనగర్-కార్గిల్-లేహ్ హైవేలకు ప్రత్యామ్నాయంగా ఇది మూడవ రహదారిగా అందుబాటులోకి రానుంది. ఇది కార్గిల్, సియాచిన్ మరియు నియంత్రణ రేఖ (ఎల్ ఓ సి) వంటి వ్యూహాత్మక ప్రదేశాలకు దూరం తగ్గించడంతో పాటు నిరంతరాయంగా భారత సైన్యం యొక్క భారీ యంత్రాలు, సరుకు రవాణాను సులభతరం చేయడంతో పాటు సైనికుల కదలికలను త్వరితగతం చేయడానికి దోహదపడుతుంది. లడఖ్, కార్గిల్, సియాచిన్ సెక్టర్లలో ఉండే భారత సైన్యానికి ఆహారం, ఆయుధాలు సరఫరా చేయడానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. అంతేకాదు ఈ సొరంగ మార్గం అత్యంత సురక్షితంగా మన సైనిక వాహనాల కదలికలు చైనా లేదా పాకిస్తాన్ల నిఘా కక్ష్య పరిధిలోకి రాకుండా ఉంచడంతో పాటు శత్రు దేశాల సుదూర ఫిరంగి లేదా క్షిపణి కాల్పులకు అందుబాటులో లేకుండా చేస్తుంది. దీనివల్ల భారత సాయుధ దళాలు మెరుగైన కార్యాచరణ సంసిద్ధతను సంతరించుకునేందుకు, శత్రు దేశం ద్వారా ఉత్పన్నమయ్యే ఎటువంటి ఊహించని పరిణామాలనైనా తట్టుకుని ధీటుగా తిప్పికొట్టేందుకు వెసులుబాటు కలుగుతుంది. మొత్తం 297 కిలోమీటర్ల పొడవు గల దర్చా-పదుమ్-నిము రోడ్డులో 100 కిలోమీటర్లు ఇప్పటికే రెండు వరుసల తారు రోడ్డుతో అందుబాటులో ఉంది. కొత్త రోడ్డు నిర్మాణం వల్ల మనాలీ-లేహ్ మధ్య దూరంలో మార్పు ఉండకపోయినప్పటికీ ఇది మంచు బారిన పడకుండా ఏడాది పొడవునా ప్రయాణించేందుకు వీలవుతుంది.

ఇప్పటి వరకు చైనా లోని 15,590 అడుగుల ఎత్తులో ఉన్న "మి లా టన్నెల్" ప్రపంచంలోనే ఎత్తైన సొరంగ మార్గం కాగా, పూర్తయిన తరువాత "షిన్కున్ లా" ప్రపంచంలోనే ఎత్తైన సొరంగం మార్గంగా రికార్డు సృష్టించనుంది. అంతే కాక ఇది భారతదేశ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో మైలురాయిగా, దేశ రక్షణ మరియు ఆర్థిక వ్యూహంలో కీలకమైన ఆస్తిగా మారనుంది. ఫిబ్రవరి 15, 2023న కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆమోదం పొందిన ఈ ప్రాజెక్టు పనులను ప్రభుత్వ ఆధీనంలోని బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బి ఆర్ ఓ) అనుబంధ సంస్థ "ప్రాజెక్ట్ యోజక్" చేపట్టనుంది. బడ్జెట్ కేటాయింపులు మరియు టెండర్ల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో, రూ.1,681.50 కోట్ల భారీ వ్యయంతో ఏడాది పొడవునా మనాలి - లేహ్ మార్గం అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రధాన లక్ష్యంతో, సముద్రమట్టానికి 15,800 అడుగుల ఎత్తున 4.10 కిలోమీటర్ల పొడవుతో నిర్మించబడుతున్న ఈ షిన్కున్ లా సొరంగం, పూర్తయిన తరువాత ప్రపంచం లోనే అత్యంత పొడవైన హైవే టన్నెల్ అవుతుంది. మనాలి నుండి లేహ్ మీదుగా కార్గిల్ చేరుకోవడానికి 700 కిలోమీటర్లు కాగా "షిన్కున్ లా టన్నెల్" అందుబాటులోకి వస్తే దర్చా-షిన్కున్ లా-పదమ్-నిము రహదారి మీదుగా ఆ దూరం 522 కిలోమీటర్లకు తగ్గుతుంది. షిన్కున్ లా టన్నెల్ విజయవంతంగా పూర్తయితే అది భవిష్యత్తులో చేపట్టబోయే ఎత్తైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణంలో భారతదేశ సమర్థతకు ఒక గీటురాయిగా నిలుస్తుంది. అంతేకాదు వ్యూహాత్మకంగా ముఖ్యమైన ఇతర ప్రాంతాలలో కూడా ఇలాంటి ప్రాజెక్టుల రూపకల్పనకు ఇది ఒక నమూనాగా ఉపయోగపడుతుంది. సైనిక కార్యకలాపాలకు మద్దతుగా వ్యూహాత్మక ప్రాజెక్టుల వేగవంతమైన అమలు యొక్క ఆవశ్యకత, పెరిగిన వ్యయం మరియు సాంకేతికాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం బిఆర్ఓ సంస్థకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి రక్షణ బడ్జెట్లో రూ.6,500 కోట్ల మూలధనం కేటాయించింది. ఇది 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన మొత్తం కంటే 30 శాతం మరియు 2021-22 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన మొత్తం కంటే 160 శాతం ఎక్కువ కావడం గమనార్హం.

**నిర్మాణ బాధ్యత బిఆర్ఓ కు అప్పగింత వెనుక అంతర్యం:** భారతదేశంలోని రహదారి నిర్మాణ కార్యనిర్వాహక దళం అయిన "బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్" లేదా 'బిఆర్ఓ' భారతదేశం యొక్క సరిహద్దులను సురక్షితంగా ఉంచడానికి మరియు దేశంలోని ఉత్తర మరియు ఈశాన్య రాష్ట్రాల లోని మారుమూల ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి మే 7, 1960న స్థాపించబడింది. సముద్ర మట్టానికి అధికఎత్తులో ఉండే పర్వత ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను నిర్మించడంలో ఏర్పడే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవడంలో బిఆర్ఓ సంస్థకు విశేష అనుభవం ఉండడం వలన ఆ సంస్థకు "షిన్కున్ లా టన్నెల్" నిర్మాణ పనుల బాధ్యత అప్పగించబడింది. షిన్కున్ లా పాస్ ప్రాంతం నైసర్గికంగా సముద్ర మట్టానికి వేల అడుగుల ఎత్తులో ఉండడంతో పాటు కఠినమైన వాతావరణ పరిస్థితులు నెలకొని ఉండడం కారణంగా టన్నెల్ నిర్మాణంలో గణనీయమైన భద్రతాపరమైన మరియు ఇతర సవాళ్లను అధిగమించాల్సి ఉంటుంది. సొరంగం నిర్మాణంలో క్లిష్టమైన, అధునాతన టన్నెల్-బోరింగ్ సాంకేతికత పరిజ్ఞానం మరియు భారీ యంత్ర సామాగ్రి అవసరమవుతుంది. బిఆర్ఓ గత మూడేళ్లలో రు.8,737 కోట్లతో 330 ప్రాజెక్టను పూర్తి చేయడమే కాక చైనాతో సరిహద్దు వెంబడి భారత సాయుధ దళాల వ్యూహాత్మక కదలికలను గణనీయంగా మెరుగుపరిచడంలో కీలక తోడ్పాటునందించింది. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసి) సమీపంలోని భారతదేశం యొక్క ఉత్తరాన ఉన్న సైనిక స్థావరం అయిన దౌలత్ బేగ్ ఓల్డి (డిబిఓ)కి అత్యంత కీలకమైన ప్రత్యామ్నాయ మార్గాన్ని అందించడానికి ఈ సంస్థ నేతృత్వంలో కొనసాగుతున్న ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ పనులు చివరి ఘట్టానికి చేరుకున్నాయి. బిఆర్ఓ భారతదేశ సరిహద్దు ప్రాంతాలు మరియు స్నేహపూర్వక పొరుగు దేశాలలో రహదారి నెట్వర్క్లను అభివృద్ధి చేయడంతో పాటు వాటి నిర్వహణను పర్యవేక్షిస్తుంది. బిఆర్ఓ 21 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంతో పాటు పొరుగున ఉన్న మన మిత్రు దేశాలైన ఆఫ్ఘనిస్తాన్, భూటాన్, మయన్మార్, తజికిస్తాన్ మరియు శ్రీలంకలలో మౌలిక సదుపాయాల కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ సంస్థ దేశంలోని 32,885 కిలోమీటర్ల రహదార్లను మరియు 12,200 మీటర్ల శాశ్వత వంతెనల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తోంది. బిఆర్ఓ కూడా "ఆర్డర్ ఆఫ్ బాటిల్ ఆఫ్ ది ఆర్మ్డ్ ఫోర్సెస్"లో అంతర్భాగం.

సరిహద్దుల వద్ద పేలవమైన నిఘా ఏర్పాట్లు మరియు లోపభూయిష్టమైన మౌలిక సదుపాయాలను తరచుగా స్మగ్లర్లు, మాదకద్రవ్యాల వ్యాపారులు మరియు ఉగ్రవాదులు తమ కార్యకలాపాల నిర్వహణకు అనుకూలంగా మలచుకోవడం సర్వసాధారణం. దేశ భద్రతను, సమగ్రతను భంగపరిచే ఇలాంటి విద్రోహుల చర్యలను సమర్థవంతంగా నిరోధించడానికి అవలంబించే బహుముఖ విధానాలలో భాగంగా సరిహద్దు నియంత్రణ రేఖ మరియు వాస్తవాధీన నియంత్రణ రేఖల వద్ద మెరుగైన రహదార్లు, వంతెనలు మరియు సొరంగ మార్గాల ఏర్పాటు అత్యంతావశ్యకం. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం చేపడుతున్న "షిన్కున్ లా టన్నెల్" టన్నెల్ నిర్మాణం స్వాగతించ దగ్గ పరిణామం.

# వాగ్దానాలు తుంగలో తొక్కి రైతులను నిండా ముంచిన ప్రభుత్వం

మన్నవ సుబ్బారావు
9949777727

ఏరు దాటే దాకా ఓడ మల్లన్న ఏరు దాటాక బోడి మల్లన్న, రోజుకో వాగ్దానాల మృత శిశువుని ప్రసవించే ప్రభుత్వానికి మంత్రులే...మంత్రసానులు ముప్పై సంవత్సరాల కిందట అలిశెట్టి ప్రభాకర్ హెచ్చరించినట్లే ఇప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్షర రూపం దాలుస్తుంది. ఎన్నికల వాగ్దానాలను తుంగలో తొక్కేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాధారణ బడ్జెట్ను ప్రవేశపెట్టకుండా తప్పించుకుంటున్నారు. 12 నెలల బడ్జెట్ను ప్రవేశపెట్టే ధైర్యం నాయుడుకు లేదు,



ఎందుకంటే ఇది అమలుకాని ఎన్నికల వాగ్దానాలను బహిర్గతం చేస్తుంది. అతను సాధారణ బడ్జెట్ను సమర్పిస్తే, అతను ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను సాధారణ బడ్జెట్లో చూపించాలి. ఆ సూపర్ సిక్స్ వాగ్దానాలు అమలుకు నోచుకోకుంటే ప్రజలు నోరు విప్పుతారని ఆయన అభిప్రాయపడ్డారు. సూపర్ సిక్స్ పథకంలో అనేక వాగ్దానాలు ఉన్నాయి: 19 నుండి 50 సంవత్సరాల వయస్సు గల మహిళలకు 1500 నెలవారీ పెన్షన్, యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా నెలవారీ 3000 నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. ప్రతి ఇంటికి సంవత్సరానికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు, పాఠశాలకు వెళ్లే ప్రతి బిడ్డకు సంవత్సరానికి రూ. 15000, ప్రతి రైతుకు రూ. 20000 వార్షిక ఆర్థిక సహాయం ఈ పథకం వాగ్దానం చేస్తుంది. ఈ హామీలు నెరవేరుతాయో లేదోనని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు, నిరసనలను అడ్డుకునేందుకు ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయని సీఎం భావిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా రాష్ట్ర బడ్జెట్ సమర్పణ రెండు నెలలు ఆలస్యమవుతుందని ఇటీవల అసెంబ్లీలో సీఎం ప్రకటించారు. గత ప్రభుత్వం 8 జూలై 2023న విడుదల చేసిన ఖరీఫ్ 2022 రూ. 1117.21 కోట్లతో సహా గత 4 సంవత్సరాలుగా 7802.05 కోట్లు మంజూరు చేసింది. "డా. వైఎస్ఆర్ ఉచిత పంట బీమా" 2019 ఖరీఫ్ నుండి నవరత్నాలు పథకం కింద. కేవలం ఇ-క్రాప్ రిజిస్ట్రేషన్ ఆధారంగా నోటిఫైడ్ పంటల సార్వత్రిక కవరేజీని సాధించిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. నోటిఫైడ్ ప్రాంతాలలో నోటిఫైడ్ పంటలు పండించే రైతులందరూ, ఇ-క్రాప్ ద్వారా సంగ్రహించిన పంట వివరాలు మరియు విజయవంతమైన ఇ-కెవైసి తర్వాత పంట బీమా పథకం కింద కవరేజీకి అర్హులు. ఆంధ్రలోని రైతులు ఎలాంటి అదనపు శ్రమ లేకుండా, కఠినమైన సమయపాలనలు మరియు చెల్లింపులు లేకుండా ఇ-క్రాప్ రిజిస్ట్రేషన్ అన్ని నోటిఫైడ్ పంటల ఆధారంగా స్వయంచాలకంగా పంట బీమా కింద కవర్ చేయబడతారు. ప్రస్తుత ప్రభుత్వనికి నిర్దిష్టమైన విధానం లేకపోవడంతో కాలయాపన చేస్తున్నారు, 2025లో ఉత్తమ పంటల బీమా పథకాన్ని తీసుకువస్తామని ఉత్తర ప్రగల్భాలు పలుకుతున్నారు. ప్రతి పాఠశాలకు వెళ్లే ప్రతి బిడ్డకు సంవత్సరానికి 15000 పథకం %-% తల్లికి వందనం కూడా వచ్చే ఏడాదికి వాయిదా వేయబడింది. దీనికి సరైన డేటా లేదని వచ్చే సంవత్సరానికి మంచి రోడ్ మ్యాప్ వేస్తామని బుకాయిస్తున్నారు. వాతావరణ చక్రంలో సుదీర్ఘ పొడి కాలం కారణంగా రాయలసీమ మొత్తం ప్రాంతాన్ని తీవ్రమైన కరువు పరిస్థితులు పట్టుకున్నందున రాయలసీమ అపూర్వమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. జూన్లో మినహా మరే నెలలోనూ సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడంతో పరిస్థితి మరింత తీవ్రమైంది. రాయలసీమలోని ఎనిమిది జిల్లాల్లో ఐదు జిల్లాల్లో 30-జూన్-2024 మరియు 30-జూలై-2024 మధ్య వర్షపాతం తక్కువగా నమోదైంది, ఇది తీవ్రమైన కరువు పరిస్థితులకు దారితీసింది. సాధారణ వర్షపాతం నమోదయ్యే మూడు జిల్లాలు కూడా ఇప్పుడు భూగర్భ జలాల నిల్వలు బాగా తగ్గిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాయి

సహజ వాతావరణ చక్రంలో సుదీర్ఘ పొడి కాలం కారణంగా దాదాపు మొత్తం ప్రాంతాన్ని తీవ్రమైన కరువు పరిస్థితులు ఉన్నందున రాయలసీమ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కరువు అనేది విపత్తు, అవపాతం లేకపోవడం వల్ల నీటి కొరత ఏర్పడుతుంది. ప్రస్తుత కరువు రైతులు, పశువులు బాధిత వర్గాల మొత్తం జీవనోపాధిని తీవ్రంగా ప్రభావితం చేసింది.

రాయలసీమ ఉత్తరాంధ్ర లో కరువు కాటకాలతో రైతులు అల్లాడిపోతున్నారు. ఈ జిల్లాలలో ప్రధాన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. జూన్లో కొద్దిపాటి వర్షాలు కురిసినా, ఆ తర్వాత వర్షాలు కురవకపోవడంతో పంట ఎండిపోయే ప్రమాదం ఉండడంతో రైతులు నిరాశకు లోనవుతున్నారు. రైతులు వ్యవసాయ కార్యకలాపాలకు రుతుపవనాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. సక్రమంగా లేదా సరిపోని వర్షపాతం వ్యవసాయ షెడ్యూల్లకు అంతరాయం కలిగిస్తుంది, పంట దిగుబడి ఆదాయాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. అదనంగా, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు యంత్రాల వంటి వ్యవసాయ ఇన్పుట్ల ఖర్చులు పెరగడం రైతులకు మరింత ఆర్థిక సవాళ్లను విసిరింది. ఈ విపత్కర పరిస్థితి పై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం బాధిత రైతులను ఆదుకునేందుకు సహాయక చర్యలు ప్రారంభించాలి. రైతులకు ఇన్పుట్ సబ్సిడీ, ఇంట్రెస్ట్ సబ్వెన్షన్, ప్రాంప్ట్ రీ పేమెంట్ ఇన్సెంటివ్ ఇచ్చి సత్వరమే పంట భీమా పైకం రైతుల ఖాతాలల్లోకి వేసి ఆదుకోవాలి. కరువు ప్రభావాన్ని తగ్గించడంలో మరియు బాధిత వర్గాల శ్రేయస్సును నిర్ధారించడంలో సమిష్టి కృషి చాలా కీలకం.

# సత్తా చాటిన యువ టీం ఇండియా జట్టు!


ఇటీవల శ్రీలంక గడ్డపై పల్లెకెలె వేదికగా జరిగిన టీ - 20 సిరీస్ లో సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో ని యువ టీం ఇండియా జట్టు శ్రీలంక జట్టును చిత్తు చిత్తుగా ఓడించి 3-0 తేడాతో టీ -20 సిరీస్ ను కైవసం చేసుకోవడం ఎంతైనా హర్షణీయం.అయితే ఈ సిరీస్ విజయం యువ టీం ఇండియా జట్టుకు అంత అలవోకగా ఏమి దక్కలేదు.యువకులతో కూడిన శ్రీలంక జట్టు సైతం తామేమి తక్కువ తినలేదు అన్నట్లుగా యువ టీం ఇండియా జట్టుకు గట్టి పోటీని ఇచ్చి మరీ గెలిచినంత పని చేసింది. కానీ సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని యువ టీం ఇండియా జట్టు శ్రీలంక జట్టు పెట్టిన కఠిన పరీక్షను సైతం అత్యంత సమర్థవంతంగా ఎదుర్కొని అసలు సిసలు ప్రొఫెషనల్ ఆటతీరు కనబరచడంతో మన వాళ్ళ దూకుడైన ఆటతీరు ముందు శ్రీలంక జట్టు పాచికలు,వారి గేమ్ ప్లాన్ ఏ మాత్రం పారలేదు. ఎందుకంటే అటు బ్యాటింగ్ లో, ఇటు బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలలో యువ టీం ఇండియా జట్టు ఆటగాళ్లు ప్రతి ఒక్కరూ కూడా తమ వంతుగా సమిష్టి ప్రదర్శన కనబరచడంతో టీం ఇండియా కు ఈ టీ -20 సిరీస్ విజయం నల్లేరు మీద నడకే అయ్యింది. ముఖ్యంగా ఓపెనర్లు యశస్వి జైస్వాల్,శుబ్ మన్ గిల్ మంచి శుభారంభం ఇవ్వగా,ఆ తర్వాత కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ తనకే సాధ్యమైన 30 డిగ్రీ షాట్ లతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడటం, రిషబ్ పంత్ సైతం అటు కీపర్ గా,ఇటు బ్యాట్స్ మ్యాన్ గా తన స్థానానికి సరిఅయిన న్యాయం చేయడం,శివం దూబె, రింకు సింగ్ సైతం అడపదడప మంచి ఇన్నింగ్స్ లు ఆడటం,ఇక అల్ రౌండర్ల పాత్రను వాషింగ్టన్ సుందర్,పరాగ్ లు చాలా చక్కగా పోషించడంతో పాటు, బౌలర్లు అర్షదీప్ సింగ్,రవి బిష్నోయ్ లు బౌలింగ్ విభాగంలో మంచి వాడి, వేడి ప్రదర్శించి ప్రత్యర్థి బ్యాట్స్ మ్యాన్ల దూకుడుకు కళ్లెం వేసి వారి వికెట్ల ను నేలకూల్చడం వెరసి టీం ఇండియా జట్టు ప్రత్యర్థి జట్టు శ్రీలంక పై పూర్తిగా పైచేయి సాధించినట్లయింది.ఇంకా చెప్పుకుంటూ పోతే గతంలో తీవ్ర ఒత్తిడికి లోనై గెలవాల్సిన మ్యాచ్ లను సైతం టీం ఇండియా పలు సందర్భాలలో కోల్పోయి కోట్లాది మంది అభిమానులను తీవ్ర నిరాశ, నిస్పృహలకు, అసంతృప్తికి గురి చేసేది అనే విషయం మనందరికి విధితమే.కానీ ఇప్పుడు టీం ఇండియా జట్టుకు తీవ్ర ఒత్తిడి,సంకట పరిస్థితి ఎదురైనా ఏ మాత్రం నిగ్రహం, ఆత్మ విశ్వాసం కోల్పోకుండా తమ సత్తా,ప్రతాపం చూపే పలువురు యువ ఆటగాళ్లు ఇప్పుడు అందుబాటులో ఉండటంతో టీం ఇండియా జట్టుకు ఇక తిరుగు, ఎదురులేకుండా పోయింది అనే మాట అక్షర సత్యం. ఏదిఏమైనా ఇటీవల సీనియర్లు అయినా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా వంటి కాకలుతీరిన ఉద్దండులైన ముగ్గురు టీం ఇండియా ఆటగాళ్లు టీ -20 ఫార్మాట్ కు గుడ్ బై చెప్పినప్పటికి సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని యువ టీం ఇండియా జట్టు ఆటగాళ్లు అదరక,బెదరక మంచి టీం స్పిరిట్ ను కనబరచి శ్రీలంక జట్టును వారి స్వంత గడ్డపై 3 - 0 తేడాతో క్లీన్ స్వీప్ చేసి టీ - 20 సిరీస్ ను కైవసం చేసుకోవడం ఎంతైనా ఓక గొప్ప శుభ పరిణామం. ఏమైనా 2007 లో మహేంద్ర సింగ్ ధోని సారథ్యంలో టీం ఇండియా టీ - 20 విశ్వ కప్ గెలిచిన తర్వాత మళ్ళీ దాదాపుగా 17 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం రోహిత్ శర్మ సారథ్యంలోని టీం ఇండియా 2024 టీ - 20 విశ్వ కప్ ను ఇటీవలే కైవసం చేసుకోవడంతో ఎక్కడలేని ఆత్మ స్థైర్యం,వెయ్యి ఏనుగుల బలం వచ్చి పడినట్లయింది టీం ఇండియా జట్టుకు. దీంతో ప్రస్తుతం ఎంతో పటిష్టంగా వున్న టీం ఇండియా జట్టును విదేశీ గడ్డపై సైతం ప్రత్యర్థి జట్లు ఎదుర్కోవడం అంత సులువు ఏ మాత్రం కాదని అందరికి తెలిసివచ్చినట్లయింది.జయ జయహో యువ టీం ఇండియా జట్టు!జైహింద్ !మేరా భారత్ మహాన్!

– బుగ్గన మధుసూదనరెడ్డి 9000369660

# సరికొత్త గరిష్ఠాలకు సూచీలు

## సెన్సెక్స్ 126 పాయింట్లు, నిఫ్టీ 59 పాయింట్లు చొప్పున లాభం

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సరికొత్త గరిష్ఠాల వద్ద ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మన సూచీలూ రాణించాయి. ముఖ్యంగా హెచ్డీఎఫ్సీ బ్యాంక్, రిలయన్స్ షేర్లు సూచీలను ముందుకు నడిపించాయి. దీంతో ఇంట్రాడేలో సెన్సెక్స్ 82,129 పాయింట్ల వద్ద, నిఫ్టీ 25,078 వద్ద జీవనకాల గరిష్ఠాలను తాకాయి. గరిష్ఠాల వద్ద అమ్మకాలతో సెన్సెక్స్ 82వేల దిగువకు చేరగా.. నిఫ్టీ మాత్రం తొలిసారి 25 వేల ఎగువన ముగియడం గమనార్హం. సెప్టెంబర్లో వడ్డీ రేట్లు తగ్గింపు ఉంటుందని అమెరికా ఫెడ్ చీఫ్ జెరోమ్ పావెల్ చేసిన వ్యాఖ్యలు ప్రపంచ మార్కెట్లలో జోష్కు కారణ మయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 81,949.68 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,741.34) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆరంభంలోనే సరికొత్త రికార్డులను నెలకొల్పుతూ 82వేల మార్కును దాటింది. ఇంట్రాడేలో 81,700.21- 82,129.49 మధ్య కదలాడిన సూచీ చివరికి 126 పాయింట్ల లాభపడి 81,867 వద్ద ముగిసింది. నిఫ్టీ 59.75 పాయింట్లు లాభపడి 25010 పాయింట్ల వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 82.89గా ఉంది. సెన్సెక్స్లో పవర్గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, నెస్లే ఇండియా, అదానీ పోర్ట్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, బజాజ్ ఫిన్సర్వ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టాటా మోటార్స్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 80.68 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ధర మరింత పెరిగి ఔన్సు 2,479 డాలర్ల స్థాయికి చేరింది.



### బాలు ఫోర్జ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్

## తొలి త్రైమాసికం ఆర్థిక ఫలితాలు

ముంబై, : బాలు ఫోర్జ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (బీఎఫ్ఐఎల్), ఒక ప్రముఖ ఖచ్చితత్వం ఇంజనీరింగ్ మరియు తయారీ కంపెనీ, 2024 జూన్ 30తో ముగిసిన త్రైమాసికం కోసం తన ఆడిటెడ్ కన్సాలిడేటెడ్ ఆర్థిక పరిశోధకులు 2024 జూలై 30న నిర్వహించిన తన బో తొలి త్రైమాసికం 25కి సంబంధించిన మా ఆర్థిక మరియు వ్యాపార పనితీరును పంచుకోవడం మా కోసం సంతోషంగా ఉంది. తొలి త్రైమాసికం24లో ?1,123.85 మిలియన్తో పోలిస్తే తొలి త్రైమాసికం25లో ఆపరేషన్ల ద్వారా వచ్చిన ఆదాయం ?1,753.09 మిలియన్గా నమోదవడంతో 55.99% మరింత ఆదాయ వృద్ధిని నమోదు చేసుకున్నాము, ఇది మా ఖాతాదారుల చేర్పుపై నిరంతర దృష్టి మరియు మా ప్రత్యేక ఇంజనీరింగ్ ఉత్పత్తుల నిరంతర డిమాండ్ వల్ల జరిగింది.

## 220 కోట్ల ఈక్విటీని సమీకరించిన క్లిక్స్ క్యాపిటల్

న్యూఢిల్లీ :దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మరియు లాభదాయ కమైన కొత్త-యుగం ఎన్బి ఎన్బిఎఫ్సి లలో ఒకటైనక్లిక్స్ క్యాపిటల్, నిధుల సేకరణ ప్రయాణంలో మరో మైలురాయిని చేరుకుంది, తాజా ఈక్విటీ మూలధనంలో రూ 220 కోట్లను పొందింది. ఈ పెట్టుబడి రౌండ్కు ఇప్పటికే ఉన్న పెట్టుబడిదారులు - అపోలో గ్లోబల్ మేనేజ్మెంట్, ప్రమోద్ భాసిన్ మరియు అనిల్ చావ్లా నాయకత్వం వహించారు. ఈ ఈక్విటీ ఇన్ఫ్యూ షన్పై క్లిక్స్ సిఈఓ రాకేష్ కౌల్ మాట్లాడుతూ "ఈ ఇన్ఫ్యూషన్ ద్వారా వాటాదారులు మాపై ఉంచిన విశ్వాసాన్ని చూసి సంతోషిస్తున్నాము. భారతదేశం అంతటా తక్కువ సేవలందించే ఎంఎస్ఎంఈ లకు సేవ చేయాలనే మా ఉద్దేశ్యాన్ని నెరవేర్చడంలో ఇది బృందాలకు మరింత శక్తినిస్తుంది. ఎంఎస్ఎంఈ రంగంపై ప్రభుత్వ ధాటికి మరియు విక్షిత్ భారత్ కోసం దాని దృష్టికి ఇది సరైన సమయంలో వస్తుందన్నారు. "క్లిక్స్ క్యాపిటల్లో మా పెట్టుబడి గణనీయమైన విలువ సృష్టిని చూసింది మరియు ఈ ఈక్విటీ రౌండ్లో పాల్గొన్నందుకు మేము సంతోషిస్తున్నాము. భారతదేశం యొక్క అభి వృద్ధి చెందుతున్న సెక్టార్లో దాని అడుగుజాడలను విస్తరిస్తున్నందున క్లిక్స్ క్యాపిటల్ వృద్ధికి పుష్కలం అని అపోలో గ్లోబల్ మేనేజ్మెంట్ భాగస్వామి మరియు ఇండియా ప్రైవేట్ ఈక్విటీ హెడ్ ఉత్సవ్ బైజల్ అన్నారు.

### ఐపీవో కోసం సెబీకి

## పారస్ హెల్త్ కేర్ డీఆర్హెచ్పీ

ఉత్తర భారతదేశం, బీహార్, జార?ండ్లో పడకల సంఖ్యాపరంగా అయిదో అతి పెద్ద హెల్త్కేర్ ప్రొవైడర్గా ఉన్న పారస్ హెల్త్కేర్ తన ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కి సంబంధించిన ముసాయిదా ప్రాస్పెక్టస్ను (డీఆర్హెచ్పీ) మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. 2024 మార్చి 31 నాటికి పారస్ హెల్త్కేర్కి ఎనిమిది ఆస్పత్రులు, 2,135 పడకలు ఉన్నాయి. ఈ ఇష్యూ కింద రూ. 400 కోట్ల వరకు విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, సెల్లింగ్ షేర్హోల్డర్లు 1,49,74,010 వరకు షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో విక్రయించనున్నారు. వీటి ముఖ విలువ రూ.1గా ఉంటుంది. ఓఎఫ్ఎస్ కింద ప్రమోటర్ సెల్లింగ్ షేర్హోల్డర్ ధర్మేందర్ కుమార్ నాగర్ 29,28,320 షేర్లను, ఇన్వెస్టర్ సెల్లింగ్ షేర్హోల్డర్ కామెలీనా లిమిటెడ్ 1,20,45,690 వరకు షేర్లను విక్రయించనున్నాయి. ఐపీవో ద్వారా నికరంగా సమీకరించిన నిధులను పారస్ హెల్త్కేర్ ఈ కింది విధంగా ఉపయోగించుకోనుంది. కంపెనీ తీసుకున్న నిర్దిష్ట రుణాలను ముందస్తుగా లేదా సకాలంలో చెల్లించేందుకు అనుబంధ సంస్థలు పారస్ హెల్త్కేర్ (రాంచీ), ప్లస్ మెడికేర్ హాస్పిటల్స్ తీసుకున్న రుణాల చెల్లింపు కోసం ఆయా సంస్థల్లో డెట్ లేదా ఈక్విటీ రూపంలో ఇన్వెస్ట్ చేయడం ఇతరత్రా కార్పొరేట్ అవసరాల కోసం సంస్థ వినియోగించుకోనుంది. ఐసీఐసీఐ సెక్యూరిటీస్, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్, మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్మెంట్ అడ్వైజర్స్ ఈ ఇష్యూకి బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తాయి.

### ఎస్బిఐ మ్యూచు వల్ ఫండ్ నుంచి

## ఎస్బిఐ ఇన్నోవేటివ్ ఆపర్చునిటీస్ ఫండ్

ముంబై : ఎస్బిఐ మ్యూచువల్ ఫండ్ ఇన్నోవేషన్ థీమ్ను అనుసరించి ఎస్బిఐ ఇన్నోవేటివ్ ఆపర్చునిటీస్ ఫండ్ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇది ఒక ఓపెన్-ఎండ్ ఈక్విటీ పథకం, వినూత్న వ్యూహాలు మరియు థీమ్ను అనుసరించడం ద్వారా ప్రయోజనం పొందాలనుకునే కంపెనీల ఈక్విటీ మరియు ఈక్విటీ సంబంధిత సాధనాల్లో పెట్టుబడి పెట్టడం ద్వారా పెట్టుబడిదారులకు దీర్ఘకాలిక మూలధన విలువ పెరుగుదలకు అవకాశాలను అందించడం ఈ పథకం పెట్టుబడి లక్ష్యం. అయినప్పటికీ, పథకం యొక్క పెట్టుబడి లక్ష్యం నెరవేరుతుందనే గ్యారెంటీ ఇవ్వకపోవచ్చు. మిస్టర్ షంషేర్ సింగ్, మేనేజింగ్ డైరెక్టర్ చీఫ్ ఎగ్జిక్యూ టివ్ ఆఫీసర్, ఎస్బిఐ ఫండ్స్ మేనేజ్మెంట్ లిమిటెడ్ మాట్లాడుతూ "ఈ రోజు మన దేశం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటి గా ఉంది మరియు విక్షిత్ భారత్కు ఆవిష్కరణ ప్రధాన అంశంగా ఉంది. స్టార్ట్ అప్ ఇండియా, అటల్ ఇన్నోవేషన్ మిషన్ మరియు ఇండియా స్టాక్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం పాఠశాల నుండి పరిశ్రమ వరకు ఆవిష్కరణల సంస్కృతిని సృష్టించే లక్ష్యంతో ఉంది. బలమైన డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, బలమైన స్టార్టప్ మరియు ఇన్వెస్ట్మెం ట్ ఎకోసిస్టమ్ మరియు గణనీయమైన వినియోగదారు మార్కెట్ మన దేశం తదుపరి గొప్ప ఆవిష్కర్తగా ఎదగడానికి అనుకూలమైన టెయిల్విండ్లను అందిస్తాయి. పోటీత త్వాన్ని పొందేందుకు ఇన్నోవేట్గా ఉన్న వ్యాపారాలలో డబ్బును పెట్టాలని చూస్తున్న పెట్టుబడిదారులు మరియు వారి ఉత్పత్తులలో విలువను మెరుగుపరచడానికి మేము అనుసరించే విధానాన్ని మార్చుకునే వారు ఎస్బిఐ ఇన్నోవేటివ్ ఆపర్చునిటీస్ ఫండ్ని పరిగణించవచ్చున్నారు.

## వండర్లాలో ఫ్రెండ్ షిప్ డే




హైదరాబాద్ : భారతదేశపు అతిపెద్ద అమ్యూజ్మెంట్ పార్క్ చైన్ , వండర్లా హాలిడేస్, తమ బెంగళూరు, హైదరాబాద్, భువనేశ్వర్ మరియు కొచ్చి పార్కులలో రాబోయే ఫ్రెండ్షిప్ డే వేడుక కోసం ప్రత్యేక ఆఫర్లు మరియు ఆకర్షణలను ప్రకటించింది. లైవ్ డీజే , స్పెషల్ ఈవినింగ్ జుంబా సెషన్లు, సరదా గేమ్లు మరియు బహుమతులు, ఉత్కంఠభరితమైన పార్క్ రైడ్లు , సౌకర్యాలకు మించి, వండర్లా మీ అత్యుత్తమ ఫ్రెండ్షిప్ డే గమ్యస్థానంగా ఉంటుంది. ఈ ఆఫర్స్ అన్నింటిలోనూ మిన్నగా వుండే అంశం ఏమిటంటే , అన్ని పార్క్ లూ ఎక్కువ సేపు తెరిచి ఉంటాయి, ప్రతి ఒక్కరూ ఉత్సవాల్లో మరింతగా ఆనందించడానికి సాయంత్రం అదనంగా మరో గంట పార్క్ లో గడిపేందుకు అనుమతిస్తారు. అసాధారణమైన విలువను అందించాలనే వండర్లా యొక్క నిబద్ధతలో భాగంగా, సందర్శకులు అనేక రకాల తగ్గింపులను పొందవచ్చు.

## ఆజాదీ మెగా సేల్ ప్రకటించిన ఈజీ మై ట్రిప్

న్యూఢిల్లీ : భారతదేశంలోని ప్రముఖ ఆన్లైన్ ట్రావెల్ టెక్ ప్లాట్ఫారమ్ ఈజీ మై ట్రిప్ రాబోయే స్వాతంత్ర్య దినోత్సవం కోసం ప్రత్యేక విక్రయం, ఆజాదీ మెగా సేల్ను ప్రకటించింది.

ఈ సేల్ వినియోగదారులకు అన్ని ప్రయాణ సేవలపై తగ్గింపుల శ్రేణిని అందిస్తుంది. ఈ సేల్ జూలై 30 నుండి ఆగస్టు 6,2024 వరకు విమానాలు, హోటల్లు, బస్సులు, క్యాబ్ బుకింగ్లు మరియు హాలిడే ప్యాకేజీలపై ఆకర్షణీయమైన తగ్గింపు లను అందించడం ద్వారా విభిన్న గమ్యస్థానాలను మరియు అనుభవాలను పొందడానికి ప్రయాణికులకు ఒక చక్కని అవకాశాన్ని కల్పిస్తుంది. హాలిడే ప్యాకేజీలు రూ 11,599/-తో ప్రారంభమవుతాయి.





ఈ అద్భుతమైన డిస్కౌంట్లను పొందడానికి, కస్టమర్లు ఈజీ మై ట్రిప్ యాప్ లేదా వెబ్సైట్ ద్వారా బుక్ చేస్తున్నప్పుడు 'ఈఎంటి ఆజాదీ ' అనే ప్రోమో కోడ్ని ఉపయోగించాలి. అంతేకాకుండా, కస్టమర్లు వరుసగా "ఈఎంటి ఆజాదీ ' మరియు 'అమెక్సెంట్ ' కోడ్లను ఉపయోగించి ఐసిఐసిఐ బ్యాంక్ మరియు అమెరికన్ ఎక్స్ప్రెస్ బ్యాంక్ కార్డ్లను ఉపయోగించి బుకింగ్ చేస్తే అదనపు తగ్గింపులను పొందటంతో పాటు వారి ప్రయాణ అనుభవాన్ని మరింత మెరుగుపరచుకోవచ్చు. సేల్ సమయంలో జరిగే ప్రతి లావాదేవీ కస్టమర్లకు నిర్దిష్ట బ్రాండ్ భాగస్వాముల నుండి బహుమతి కార్డ్లను గెలుచుకునే అవకాశాన్ని అందిస్తుంది, ఇది ఆఫర్ను మరింత ఆకర్షణీయంగా చేస్తుంది

. సేల్లో అత్యధికంగా వెచ్చించిన వారికి బెయర్డో మరియు కపివా నుండి థ్రిల్లింగ్ బహుమతులు, నాషర్ మైల్స్ నుండి కాంప్లిమెంటరీ క్యాబిన్ బ్యాగ్లు మరియు ఈజీడైనర్ నుండి ఉచిత సబ్స్క్రిప్షన్ గెలుచుకునే అవకాశం ఉంటుంది.

## స్పేస్నెట్ ఎంటర్ప్రైజెస్ - మోడరన్ ఫ్యూయల్ టెక్నాలజీస్ భాగస్వామ్యం

హైదరాబాద్-భారతదేశ వ్యాప్తంగా లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ ప్రాజెక్టులను చేపట్టడం కోసం ఎన్ఎస్ఈలో లిస్టెడ్ కంపెనీ అయిన స్పేస్నెట్ ఎంటర్ప్రైజెస్ ఇండియా లిమిటెడ్ మరియు ప్రముఖ రష్యన్ కంపెనీ మోడరన్ ఫ్యూయల్ టెక్నాలజీస్ భాగస్వామ్యం చేసుకున్నట్లు వెల్లడించాయి.ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారతదేశం ఆవిర్భవించిన వేళ, రాబోయే 10-15 ఏళ్లలో మూడు అగ్రగామి ఆర్థిక శక్తులలో ఒకటిగా భారతదేశం నిలువనుందని అంచనా. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఎల్ఎన్జి మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్ట్ లను అభివృద్ధి చేయటం ద్వారా అవకాశాలను ఒడిసి పట్టుకోవాలని ఇరు సంస్థలూ లక్ష్యంగా పెట్టుకున్నాయి. దీనిలో భాగంగా మొదటి దశ లో 20 ఎల్ఎన్జి గ్యాస్ స్టేషన్లు మరియు ఇంధన రిటైల్ అవుట్లెట్ల ఏర్పాటు చేయటంతో పాటుగా రెండవ దశ లో దేశవ్యాప్తంగా 180 ఎల్ఎన్జి గ్యాస్ స్టేషన్లు - ఇంధన రిటైల్ అవుట్లెట్ల విస్తరణ చేయనున్నారు. స్పేస్నెట్ ఎంటర్ప్రైజెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రకాష్ దాసిగి మరియు మోడరన్ గ్యాస్ టెక్నాలజీస్ జనరల్ డైరెక్టర్ అలెగ్జాండర్ సోరోకిన్ ఈ వెంచర్ పట్ల తమ ఆశావాదాన్ని వ్యక్తం చేశారు. "ఈ భాగస్వామ్యం భారతదేశం యొక్క ఎల్ఎన్జి మౌలిక సదుపాయాలను పెంపొందించడానికి - క్లీనర్ ఎనర్జీ సొల్యూషన్లను ప్రోత్సహించడానికి ఒక ముఖ్యమైన ముందడుగు అవుతుంది" అని దాసిగి అన్నారు. "తమ సంయుక్త నైపుణ్యం భారతదేశంలోని వివిధ రంగాలలో ఆధునిక ఎల్ఎన్జి పరిష్కారాలను అభివృద్ధి చేస్తుంది." అని సోరోకిన్

## 'ఇండియా చీర్స్ ఫర్ నీరజ్' ప్రారంభించిన శాంసంగ్



గురుగ్రామ్ : 'ఇండియా చీర్స్ ఫర్ నీరజ్' ప్రచారం ద్వారా నీరజ్ చోప్రాకు తమ శుభాకాంక్షలు తెలియ ఎజేయడానికి అభిమానులను ముందుకు రావాలని కోరుతున్నట్లు శాంసంగ్ ఈరోజు ప్రకటించింది. ఈ ప్రచారంతో, నీరజ్కు మద్దతు ఇవ్వడం మరియు శ్రేష్ఠత కోసం ప్రయత్నిస్తూ తన హద్దులు దాటి ముందుకు వెళ్లేలా ఆయనకు ప్రోత్సాహం అందించటం శాంసంగ్ ఇండియా లక్ష్యంగా చేసుకుంది. నీరజ్ చోప్రాకు అందిస్తున్న అభిమానుల మద్దతును పెంచడానికి, వినియోగదారుల ఉత్సాహాన్ని చానలైజ్ చేయడానికి -దేశం యొక్క సామూహిక ప్రోత్సా హాన్ని పెంపొందించడానికి, శాంసంగ్ ఇండియా ఒక చిత్రాన్ని ఆవిష్కరించింది. అనేక సవాళ్లతో పోరాడు తున్న ప్రసిద్ధ అథ్లెట్ యొక్క స్థిరత్వం మరియు సంక ల్ప స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ, ఈ చిత్రం శాంసంగ్ ఇటీవల విడుదల చేసిన గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6 స్మార్ట్ఫోన్ అతని ప్రయాణానికి ఎలా సహాయపడుతుందో హైలైట్ చేస్తుంది.

గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6 దాని శక్తివంతమైన గెలాక్సీ ఏఐ సాంకేతికతతో హద్దులను అధిగమిస్తుంది. వినియోగదారులకు అసమానమైన అనుభవాలను అందిస్తోంది. గెలాక్సీ ఏఐ శక్తివంతమైన , గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6 ఇంటర్ప్రెటర్ మరియు నోట్ అసిస్ట్ వంటి ఏఐ ఫీచర్లతో వస్తుంది, వినియోగదారులు మరింత ప్రభావవంతంగా కమ్యూనికేట్ చేయడానికి, వారి ఉత్పాదకతను పెంచడానికి మరియు వారు పని చేసే మరియు జీవించే విధానాన్ని మార్చడానికి అనుమతిస్తుంది."తమ పరిమితులను దాటి గొప్పతనాన్ని సాధించేలా వ్యక్తులను శక్తివంతం చేయాలని శాంసంగ్ విశ్వసిస్తుంది. శాంసంగ్ వద్ద గొప్పగా గౌరవించబడే శ్రేష్ఠత మరియు అపరిమిత అవకాశాలు , విలువలకు మూర్తీభవించిన నీరజ్ చోప్రా వెనుక మేము మా శక్తిని ఉంచుతున్నాము. 'ఇండియా చీర్స్ ఫర్ నీరజ్' ప్రచారంతో, దేశం యొక్క సామూహిక శక్తిని ఉపయోగించుకోవడం మరియు నీరజ్ను ఉత్సాహపరిచేందుకు 'అన్ఫోల్డ్ ది బెస్ట్' చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాము" అని శాంసంగ్ ఇండియా ఎంఎక్స్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ ఆదిత్య బబ్బర్ అన్నారు.

## 'ఇండియా చీర్స్ ఫర్ నీరజ్' ప్రారంభించిన శాంసంగ్

"డబ్బు ఎంత తక్కువగా ఐడిల్ గా ఉంటే, ప్రతిఫలం అంత ఎక్కువ అవుతుంది" అనేది బ్రిటిష్ ఆర్థికవేత్త వాల్టర్ బాగే హాట్ సూక్తి కాలానికి అతీతంగా మన కాలానికి చాలా సందర్భోచితమైనది. మీరు బ్యాంక్లో తక్షణం అవసరం లేని మొత్తాన్ని కలిగి ఉంటే మరియు తదుపరి 30 రోజులలో దాని అవసరం లేకుండా ఉంటే దాన్ని ఐడిల్ డబ్బుగా చెప్పవచ్చు. ఇది మీ జీవిత లక్ష్యాలకు చాలా తక్కువ విలువను జోడించి, కాలక్రమేణా మీ సంపదను నాశనం చేస్తుంది. ద్రవ్యోల్బణాన్ని అధిగమించడానికి, జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ఎక్కువ సంపాదించడం గురించి భారతదేశంలోని అధిక శ్రామిక జనాభాలో చర్చ తీవ్రమవుతున్నా, చాలా మంది తమ పొదుపు ఖాతాలో డ బ్బు సోమరిగా పడిఉండడాన్ని, 3-4% వడ్డీ రేటు మాత్రమే పొందడం అనే ప్రాథమిక వాస్తవాన్ని విస్మరిస్తార ఉంటుందని రిటైల్ లయబిలిటీస్ ప్రోడక్ట్ హెడ్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్, కోటక్ మహీంద్రా బ్యాంక్ రోహిత్ భాసిన్, అని అన్నారు.



. ఇప్పటికీ 5% ప్లస్ రిటైల్ ద్రవ్యోల్బణం వెనుకనే నడుస్తున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్యోల్బణాన్ని సుస్థిరమైన ద్రవ్య విధానానికి ముప్పుగా పరిగణిస్తున్నందున, మీరు మీ డబ్బును నిష్క్రియంగా ఉండనివ్వక పోతే మరింత సంపాదించే అవకాశాలు ఎల్లప్పుడూ ఎక్కువగానే ఉంటాయి.

నిష్క్రియ డబ్బు అనేది డెవిల్స్ ప్లేగ్రౌండ్: పొదుపు ఖాతాలో నిష్క్రియంగా డబ్బుతో ఉన్న సాధారణ సమస్య ఏమిటంటే, ఇది తరచుగా ఖాతాదారుని ప్రేరణ కొనుగోళ్లు లేదా ఖర్చులలో మునిగిపోయేలా చేస్తుంది. ఈ కష్టాలకు ఆదర్శవంతమైన పరిష్కారం స్వీప్-ఇన్ ఖాతాలు. ఇవి మీకు మరింత సంపాదించడమే కాకుండా ఊహించని సంఘటనల కోసం ప్లాన్ చేయడంలో మీకు సహాయపడతాయి. సాధారణంగా, అటువంటి ఖాతాలు మీకు సాధారణ పొదుపు ఖాతాల కంటే గణనీయంగా ఎక్కువ వడ్డీ రేట్లను అందించడం ద్వారా మంచి పెట్టుబడి సాధనాలుగా రెట్టింపు అవుతాయి కాబట్టి డిఫాల్ట్ గా పెద్ద కార్పస్ను సృష్టిస్తాయి. స్వీప్-ఇన్లు - సగటున గణనీయంగా 7% శాతం కంటే ఎక్కువ వడ్డీ రేటుతో - మంచి జీతం పొందుతున్నా, ఇంకా జీవితంలోని కీలక సంఘటనల కోసం ప్లాన్ చేయడంలో విఫలమవుతున్న వారికి ఎక్కువ ప్రయోజనం చేకూరుస్తోంది.

## కేరళ విపత్తు సహాయ నిధికి కళ్యాణ్ జ్యువెలర్స్ 5 కోట్ల విరాళం

త్రిసూర్ : కేరళలోని వాయనాడ్లో ఆకస్మిక వరదలు మరియు కొండచరియలు విరిగిపడటంతో విషాదాన్ని మిగిల్చిన విధ్వంసకరమైన ప్రకృతి విలయం పై స్పందించిన కళ్యాణ్ జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ టిఎస్ కళ్యాణరామన్ రూ. 5 కోట్లు ను కేరళ ముఖ్యమంత్రి విపత్తు సహాయ నిధికి అందించనున్నట్లు వెల్లడించారు. ఈ తోడ్పాటు వాయనాడ్లో రెస్క్యూ, రిలీఫ్ మరియు పునరావాస ప్రయత్నాలకు అవసరమైన సహాయాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

"కొండచరియలు విరిగి పడటం మరియు ఆకస్మిక వరదలు వంటి అనూహ్యమైన ప్రకృతి విలయ కారణంగా మన తోటి కేరళీయులు బాధపడడం, కేరళ మూలాలు కలిగిన కంపెనీగా చాలా కష్టంగా ఉంది . వాయనాడ్లో జరిగిన ఈ విధ్వంసం, అనేక మంది ప్రాణాలను బలిగొనడమే కాకుండా వందల కుటుంబాలను నిర్వాసితులను చేసింది, గృహాలను ధ్వంసం చేసింది మరియు జీవనోపాధికి తీవ్ర అంతరాయం కలిగించింది. ఈ క్లిష్ట సమయంలో ప్రభావితమైన వారి వెన్నంటి మా ఆలోచనలు మరియు ప్రార్థనలు ఉంటాయి" అని కళ్యాణరామన్ అన్నారు.



"కేరళ మా ఇల్లు . ఈ విపత్తు వేళ, మేము మా కుటుంబీకులకు అందిస్తున్న సహాయక చర్యలకు సహకరించడానికి కట్టుబడి ఉన్నాము. తక్షణ సహాయాన్ని అందించడానికి, మా సంఘీభావం ప్రకటించటానికి ఇది చిరు ప్రయత్నం మరియు అవసరమైతే మరింత చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాము "అని కళ్యాణరామన్ చెప్పారు.

## సరికొత్త శిఖరాలకు ప్రీతి జోడియాక్

వెర్సుని ఇండియా హౌస్కు చెందిన ప్రముఖ మిక్సర్ గ్రైండర్ బ్రాండ్ ప్రీతి కిచెన్ అప్లయెన్సెస్, నేడు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ మరియు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్లో దాని ఫ్లాగ్షిప్ మరియు పవర్-ప్యాక్డ్ మిక్సర్ గ్రైండర్ పేరును నమోదు చేసుకుంది. ప్రీతి జోడియాక్హోకు ఇది ఒక సరికొత్త మైలురాయి. దృఢమైన పదార్థాలను గ్రైండ్ చేయగల అత్యంత శక్తివంతమైన మిక్సర్ గ్రైండర్గా గుర్తింపుతో పాటు ఆవిష్కరణ, నాణ్యత మరియు పనితీరు పట్ల ప్రీతి అంకితభావానికి ఈ గుర్తింపు నిదర్శనం.

ప్రీతి జోడియాక్ ఆకట్టుకునే నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు, బ్రాండ్ నాలుగు ప్రధాన నగరాల్లో పరికరాన్ని అంతిమ పరీక్షలో ఉంచేందుకు వివిధ నేపథ్యాలకు చెందిన కొచ్చి, బెంగళూరు, చెన్నై మరియు హైదరాబాద్- నగరాల నుంచి 120 మంది ఇన్ఫ్లుయెన్సర్లనుతనతో చేర్చుకుంది. వీరు ఇటుకలు, కలపతో పాటు సుగంధ ద్రవ్యాలు మరియు మరెన్నో కఠినమైన పదార్థాలను పొడి చేసే సవాలును స్వీకరించారు. జోడియాక్ సామర్థ్యం ఈ ప్రదర్శన ద్వారా దాని అసాధారణమైన శక్తిని మరియు మన్నికను నిరూపణ చేయడమే కాకుండా విస్తృతస్థాయిలో ప్రశంసలను దక్కించుకుంది. ఈ గుర్తింపు పరికరం చూపించే అసమానమైన పనితీరును, విశ్వసనీయతను చాటిచెప్పింది. పోటీ మార్కెట్లో దానిని ఇతర ఉత్పత్తుల కన్నా ప్రత్యేకంగా నిలిపేలా చేసింది. ఈ సవాలును భారత్ మరియు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్కు చెందిన న్యాయనిర్ణేతలు వివేక్ ఆర్ నాయర్, సగాయరాజ్ ధ్రువీకరించారు.




ఈ విజయం గురించి వెర్సుని ఇండియా హౌమ్స్ సొల్యూషన్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గుల్బహార్ తౌరానీ మాట్లాడుతూ, "ప్రీతిలో, వినియోగదారుల పట్ల మా నిబద్ధత మాకే కాకుండా, మొత్తం వర్గానికి పరిపూర్ణతతో కూడిన కొలమానాన్ని నెలకొల్పేలా చేసింది. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ద్వారా అత్యంత శక్తివంతమైన మిక్సర్ గ్రైండర్గా గుర్తింపు పొందినందుకు మేము ఎంతో గర్విస్తున్నాము" అన్నారు.

## టైసన్ ఫుడ్స్ వాటాను కొనుగోలు చేసిన గోద్రెజ్ ఆగ్రోవెట్

హైదరాబాద్: దేశంలోని అతిపెద్ద డైవర్సిఫైడ్ ఫుడ్ అండ్ అగ్రి-బిజినెస్ సమ్మేళనాలలో ఒకటైన గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ , టైసన్ ఫుడ్స్, ఇంక్.కి అనుబంధంగా ఉన్న టైసన్ ఇండియా హోల్డింగ్స్ లిమిటెడ్తో కంపెనీ ఒక ఖచ్చితమైన ఒప్పందంపై సంతకం చేసినట్లు ఈ రోజు ప్రకటించింది. ద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన గోద్రెజ్ టైసన్ ఫుడ్స్ లిమిటెడ్ లో 49 శాతం వాటాను కొనుగోలు చేయండి. లావాదేవీ పూర్తయిన తర్వాత, ద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ ఇప్పుడుగోద్రెజ్ టైసన్ ఫుడ్స్ లిమిటెడ్ లో 100 శాతం వాటాను కలిగి ఉంటుంది, తద్వారా దాని వ్యాపారాన్ని మరింత పటిష్టం చేస్తుంది.2008లో, ప్రాసెస్ చేయబడిన పౌల్ట్రీ - శాఖాహార ఉత్పత్తులను తయారు చేయడానికి మరియు మార్కెట్ చేయడానికి గో ద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ టైసన్ ఫుడ్స్, ఇంక్. యొక్క అనుబంధ సంస్థతో జాయింట్ వెంచర్లోకి ప్రవేశించింది. 'రియల్ గుడ్ చికెన్' మరియు 'యమ్మీజ్' బ్రాండ్ల క్రింద ఉత్పత్తులను విక్రయిస్తూ, గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ మార్కెట్లో ప్రత్యక్ష పౌల్ట్రీ పక్షుల విక్రయంలో నిమగ్నమై ఉంది."టైసన్ ఫుడ్స్తో మా భాగస్వామ్యం చాలా సుసంపన్నమైంది. నిలువుగా సమీకృత పౌల్ట్రీ ప్రాసెసింగ్ మరియు ఉత్పత్తి అభివృద్ధిలో వారి సామర్థ్యాలను ఉపయోగించుకునేలా చేయడం ద్వారా, మన దేశంలో అధిక నాణ్యత గల పౌల్ట్రీ ఉత్పత్తులను అభివృద్ధి చేయడం, ఉత్పత్తి చేయడం -మ పంపిణీ చేయడం వంటి వాటిని ఆధునీకరించడానికి మాకు వీలు కల్పించింది, "అని గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్ సింగ్ యాదవ్ అన్నారు.

## ఇన్సూరెన్స్ దేఖో రీఇన్స్యూరెన్స్ బ్రోకింగ్

దేశంలోని అగ్రశ్రేణి ఇన్సర్టెక్ బ్రాండ్లలో బీమా ఇన్సూరెన్స్ దేఖో, యాక్సెసిబిలిటీ మరియు పంపిణీని మార్చే కంపెనీ లక్ష్యంలో ఒక ప్రధాన ముందడుగు, కాంపోజిట్ ఇన్సూరెన్స్ బ్రోకింగ్ లైసెన్స్తో రీఇన్స్యూరెన్స్ బ్రోకింగ్ మార్కెట్లోకి ప్రవేశించడానికి ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా నుండి ఆమోదం పొందింది. ఇన్సూరెన్స్ దేఖో బీమా కంపెనీ యొక్క బీమా రిస్కో కొంత భాగాన్ని రీఇన్స్యూరెన్స్ సంస్థకు కేటాయించడం ద్వారా మరియు బీమాదారులకు పోటీ ధరలను అందించడం ద్వారా, ఈ విభాగంలో విలువను జోడించాలని భావిస్తోంది. సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా మరియు రీఇన్స్యూరెన్స్ పరిశ్రమలో కొత్త ఆవిష్కరణలకు డేటా అనలిటిక్స్ని వర్తింపజేయడం ద్వారా దేశంలో బీమాను కలిగి ఉన్న వ్యక్తుల సంఖ్యను పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. వ్యవస్థాపకుడు, ఇన్సూరెన్స్ దేఖో , "భారతదేశం అంతటా బీమా వ్యాప్తి మరియు ప్రాప్యతను పెంచే మా లక్ష్యాన్ని సాధించడానికి ఒక ముఖ్యమైన వ్యూహాత్మక చర్య. మా క్లయింట్లు మరియు భాగస్వాములకు మెరుగైన విలువను తీసుకురావడానికి మా సాంకేతిక నైపుణ్యం మరియు లోతైన పరిశ్రమ నైపుణ్యాన్ని ఉపయోగించుకోవడం మా లక్ష్యం. ఈ విధానం బీమా ల్యాండ్స్కేప్ను మెరుగుపరచడమే కాకుండా మన మార్కెట్ స్థితిని కూడా బలోపేతం చేస్తుంది. మేము ఆచరణాత్మక వ్యాపార వ్యూహాలతో ఆవిష్కరణలను సమతుల్యం చేయడానికి కట్టుబడి ఉన్నాము, బీమా సంస్థలు మరియు వారు సేవలందిస్తున్న వ్యక్తుల అవసరాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తామన్నారు.

## కోటక్ - గోక్యూ స్మార్ట్ వైటల్ ప్లస్ స్మార్ట్ వాచ్ లాంచ్




ముంబై : కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ కోటక్ - గోక్యూ స్మార్ట్ వైటల్ ప్లస్ స్మార్ట్వాచ్ను విడుదల చేయడానికి గోక్యూ తో భాగస్వామ్యం చేసుకుంది, దీని ద్వారా కస్టమర్లు సులువుగా చెల్లింపులు చేయవచ్చు. గోక్యూ వ్యవస్థాపకుడు విశాల్ గొండాల్ మాట్లాడుతూ, "ఆరోగ్యమే మహాభాగ్యం అనేది అనాదిగా వస్తున్న సామెత.గోక్యూ వద్ద, మేము ఎల్లప్పుడూ నివారణ ఆరోగ్య సంరక్షణ మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిని నిర్వహించడం యొక్క ప్రాముఖ్యతను విశ్వసిస్తున్నాము. గోక్యూ అధునాతన ఆరోగ్య పర్యావరణ వ్యవస్థతో అనుసంధానించబడిన కాంటాక్ట్లెస్ చెల్లింపులను కస్టమర్లకు అందించడంలో భాగంగా కోటక్ మహీంద్రా బ్యాంక్తో భాగస్వామ్యం చేయడం దీనిని నిజం చేసే దిశగా ఒక అడుగు. ఈ ఏకీకరణ చాలా అవసరం, ఇది జీవితాన్ని సులభతరం చేస్తుంది, ఆరోగ్యం మరియు భద్రతకు మద్దతు ఇస్తుంది, సురక్షితమైన లావాదేవీలకు హామీ ఇస్తుంది మరియు రోజువారీ జీవితంలో సాంకేతికతను ఏకీకృతం చేసే పెరుగుతున్న ట్రెండ్తో సరిపోతుంది. అతుకులు లేని, సమర్థవంతమైన మరియు ఆరోగ్యకరమైన జీవనశైలి యొక్క లక్ష్యం ఈ సామర్థ్యం ద్వారా మద్దతు ఇస్తుంది, ఇది నేటి వేగవంతమైన ప్రపంచంలో చాలా ముఖ్యమైనదన్నారు.

చీఫ్ రిలేషన్షిప్ మేనేజ్మెంట్ రజిత్ పిళ్లై మాట్లాడుతూ, " ఎన్పిసిఐ వినూత్నరూపే ఆన్-ది-గో శ్రేణిలో కాంటాక్ట్లెస్ చెల్లింపుల కోసం స్మార్ట్ వైటల్ ప్లస్ స్మార్ట్వాచ్ను ప్రారంభించడం పట్ల మేము సంతోషిస్తున్నాము. ఈ భాగస్వామ్యంతో వినియోగదారులు వారి రోజువారీ లావాదేవీలను సులభంగా నిర్వహించగలిగే అవకాశాన్ని అందిస్తుంది. ప్రయాణంలో ఉన్నప్పుడు సౌకర్యవంతంగా మరియు సురక్షితంగా చెల్లింపు పరిష్కారాల కోసం వినూత్న ఫారమ్ కారకాలు చెల్లింపుల పర్యావరణ వ్యవస్థను మారుస్తున్నాయి, మెరుగైన వినియోగదారు అనుభవాన్ని అందిస్తాయి మరియు త్వరిత మరియు సజావు లావాదేవీలను సులభతరం చేస్తున్నాయి. యాక్సెప్టెన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వేగంగా పెరుగుతుండటంతో, టెక్-అవగాహన ఉన్న వినియోగదారుల నుండి కాంటాక్ట్లెస్ చెల్లింపు పరిష్కారాల కోసం డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నామన్నారు.

### ఫిలా టెక్స్ ఫ్యాషన్స్ లిమిటెడ్కు

## రూ.293 కోట్ల ఎగుమతి ఆర్డర్

హైదరాబాద్ : హైదరాబాద్ నగరానికి చెందిన ప్రముఖ సాక్స్, కాటన్ ఉత్పత్తుల తయారీ సంస్థ ఫిలాటెక్స్ ఫ్యాషన్స్ లిమిటెడ్ వారి సబ్సిడరీ సంస్థకు 2,97,388 మెట్రిక్ టన్నుల వైట్ మార్బుల్ సరఫరా చేసేందుకు రూ. 293 కోట్ల విలువైన ఎగుమతి ఆర్డర్ లభించింది. మైనింగ్ వ్యాపారంలో ఇదే కంపెనీ సబ్సిడరీ అయిన ఫిలాటెక్స్ మైన్స్ అండ్ మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్కు ఆఫ్రికాలో దాదాపు 54 ఆస్పత్రుల నిర్మాణం చేపట్టనున్న బ్లూమ్ ఫ్లోరా వెంచర్స్ లిమిటెడ్ అనే ఆస్పత్రి అభివృద్ధి సంస్థ నుంచి ఈ ఆర్డర్ లభించింది. ఏడేళ్ల కాలంలో వైట్ మార్బుల్ సరఫరా చేసేందుకు మొత్తం ఆర్డర్ విలువ 35 మిలియన్ల అమెరికన్ డాలర్లు. (భారతీయ కరెన్సీలో రూ.293 కోట్లు). కంపెనీ మైనింగ్ సబ్సిడరీకి ఇదే మొట్టమొదటి ఎగుమతి ఆర్డర్. 2024 జూలై 26న జరిగిన ఫిలాటెక్స్ ఫ్యాషన్స్ లిమిటెడ్ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విభాగంలో సునీల్ అగర్వాల్ను కంపెనీ అదనపు డైరెక్టర్, సీఈఓగా నియమించడానికి ఆమోదం తెలిపింది. ఈ నియామకం రాబోయే వార్షిక సర్వసభ్య సమావేశంలో వాటాదారుల ఆమోదానికి లోబడి ఉంటుంది. సునీల్ అగర్వాల్కు పదేళ్లకు పైగా విస్తృతమైన అనుభవం ఉంది. ఫైనాన్షియల్ సర్వీసెస్, అడ్వైజరీ, ఇన్వెస్ట్ మెంట్ అడ్వైజరీ, రిస్క్ మేనేజ్ మెంట్ కన్సల్టింగ్ లలో ఆయన అపార నైపుణ్యం కలిగి ఉన్నారు. కొన్ని ప్రముఖ కంపెనీల బోర్డులలో ఉన్నారు.



## పింఛన్ల పంపిణీ విజయవంతంగా సాగడం హర్షణీయం

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి పాలన ప్రారంభమయ్యాక పెంచిన సామాజిక పింఛన్లను రెండో నెలలోనూ విజయవంతంగా లబ్ధిదారులకు ఇంటి దగ్గరే పంపిణీ చేయడం పట్ల ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ హర్షం వ్యక్తం చేశారు. 64 లక్షల మందికిపైగా లబ్ధిదారులకు రూ.2737.4 కోట్ల మొత్తాన్ని గురువారం ఉదయం నుంచీ ఇంటింటికీ వెళ్ళి పెన్షన్లు అందించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు రూపొందించిన కార్యక్రమం ప్రజలకు చేరువైందన్నారు. అందరూ హర్షించేలా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రి గారికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియచేస్తున్నానని చెప్పారు.గత పాలకులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అతలాకుతలం చేసినా సంక్షేమ పథకాల అమలుకి ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఈ ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు.

## గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకట రెడ్డి సస్పెండ్

### ఏసీబీ విచారణకు ఆదేశాలు

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: గనుల శాఖ మాజీ డైరెక్టర్, ఏపిఎండీసి మాజీ వీసిఎండీ వెంకట రెడ్డిని ప్రభుత్వం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గనులు, ఇసుక తవ్వకాలు అంశాల్లో అక్రమాలు చేశారంటూ వెంకటరెడ్డి మీద అనేక అభియోగాలు. ఉన్నాయి. ఇసుక టెండర్లు, అగ్రిమెంట్లల్లో నిబంధనలు ఉల్లంఘించారని, సుప్రీం కోర్టు, ఎన్జీటీ ఆదేశాలను ఖాతరు చేయకుండా ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి ప్రైవేటు వ్యక్తులకు లబ్ది చేకూరేలా వెంకటరెడ్డి వ్యవహరించారని ప్రభుత్వం అభిప్రాయపడింది. ఈ మేరకు సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ కింద సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు.జారీ చేసిందిజ సస్పెన్షన్ సమయం లో ఆయన హెడ్ క్వార్టర్స్ ను విడిచి వెళ్ళకూడదంటూ ఆదేశాలు జారీచేసింది.

# ఆగస్టు 15 కార్యక్రమంపై సీఎస్ రివ్యూ

### 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయండి : సిఎస్



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఈనెల 15వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ఈవేడుకల నిర్వహణకు సంబంధించి ఆయా శాఖల పరంగా చేపట్టాల్సిన ఏర్పాట్లన్నీ పటిష్టంగా చేయాలని ఆదేశించారు.అదే విధంగా అదేరోజు సాయంత్రం రాజ్ భవన్ లో జరగనున్న ఎట్ హోం కార్యక్రమానికి సంబంధించి కూడా తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మొత్తం ఏర్పాట్లన్నిటినీ ప్రోటోకాల్ విభాగం,ఎన్టిఆర్ జిల్లా కలక్టర్ మరియు విజయవాడ మున్సిపల్ కమీషనర్లు సంబంధిత శాఖలను సమన్వయం చేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహనకు ఆయా శాఖల వారీగా ప్రత్యేక శకటాల ప్రదర్శనను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాజ్ భవన్,హైకోర్టు,అసెంబ్లీ,సచివాలయం సహా ఇతర ప్రముఖ కార్యాలయాలు, చారిత్రిక భవనాలను విద్యుత్ దీపాలంకరణతో అలంకరించాలని సిఎస్ ఆదేశించారు.వర్షాకాలమైనందున వర్షం వస్తే ఇబ్బంది కలగని రీతిలో తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈసమావేశంలో రాష్ట్ర సాధారణ పరిపాలన(పొలిటికల్)ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ ముందుగా మాట్లాడుతూ 15వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఉ.9గం.ల నుండి ఉ.10.30 గం.ల వరకు 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరగనున్నాయని తెలిపారు. ఈవేడుకలకు సంబంధించి వివిధ శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై ఇప్పటికె సర్కులర్ ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.స్వాతంత్ర్య దినోత్స వేడుకల అనంతరం అదే రోజు సాయంత్రం 5గం.లకు విజయవాడ రాజ్ భవన్ లో ఎట్ హోం కార్యక్రమం ఉంటుందని అందుకు కూడా తగిన ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేస్తున్నట్టు పేర్కొన్నారు.

అనంతరం వివిధ శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వర్చువల్ గా పాల్గొన్న శాంతి భద్రతల ఐజి శ్రీకాంత్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పోలీస్ శాఖ తరవును విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నట్టు వివరించారు. అదే విధంగా నగరంలో ట్రాఫిక్ నియంత్రణ ఇతర చర్యలు తీసుకుంటామని చెప్పారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వివిధ పోలీస్ కంటిన్జెంట్లచే సెరిమోనియల్ కవాతు తదితర అంశాలకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వర్చువల్ గా పాల్గొన్నఎన్టిఆర్ జిల్లా కలక్టర్ సృజన మాట్లాడుతూ రానున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్ల పనులు మొదలు పెట్టామని చెప్పారు. రీహార్సల్స్ నిర్వహించుకునేందుకు వీలుగా ఈనెల 5వ తేదీకి స్టేడియంను సిద్ధం చేసి అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు.ఇప్పటికే మున్సిపల్ కార్పొరేషన్ అధ్వర్యంలో స్టేడియంకు పెయింటింట్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా పెద్దఎత్తున పారిశుద్ధ్య పనుల నిర్వహణతో పాటు తాగునీటి సౌకర్యం వంటి ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు.రాష్ట్ర ప్రోటోకాల్ డైరెక్టర్ బాల సుబ్రహ్మణ్యం రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి ఆహ్వాన పత్రికలు,ఎట్ హోం కు సంబంధించి ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం ఆహ్వాన పత్రికలు ప్రముఖులందరికీ,అన్ని శాఖలకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈసమావేశంలో రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు పి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్స వేడుకల్లో రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహనకై సంబంధిత సంక్షేమ శాఖలకు చెందిన శకటాల ప్రదర్శనను ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు.ఈవేడుకలను ప్రజలంతా తిలకించేందుకు వీలుగా ప్రత్యేక వీడియో తెరలను ఏర్పాటు చేయడం తోపాటు ఆల్ ఇండియా రేడియో,దూరదర్శన్ సహా వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేయనున్నట్టు వివరించారు.అదే విధంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై ముఖ్యఅతిధి వారికి సందేశం సిద్ధం చేయడంతో పాటు పటిష్టమైన పబ్లిక్ అడ్రస్ సిస్టం వంటి ఇతర ఏర్పాట్లన్నీ చేయనున్నట్టు సిఎస్ కు వివరించారు. ఇంకా ఈసమావేశానికి వర్చువల్ గా పాల్గొన్న రాష్ట్ర అగ్నిమాపక విభాగం డైరెక్టర్ మురళి మాట్లాడుతూ వేడుకల వేదిక వద్ద అవసరమైన అగ్నిమాపక యంత్రాలను ఇతర పరికరాలను అందుబాటులో ఉంచుతామని వివరించారు.డిఎంఇ డా.నర్సింహం వైద్య ఆరోగ్య శాఖ పరంగా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై వివరించారు.అలాగే రవాణా శాఖ కమీషనర్,ఎండి సిపిడిసిఎల్,ఉద్యానవన శాఖ కమీషనర్,సిఇ ఆర్డ్అండ్బి, ఎన్సిసి గ్రూప్ కమాండర్,డిజి సైనిక్ వెల్ఫేర్ తదితర విభాగాల అధికారులు వర్చువల్‌గా పాల్గొని వారి శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లపై సిఎస్‌కు వివరించారు.

## హైకోర్టులో పొన్నవోలుకు చుక్కెదురు

- తనకు పోలీసు భద్రత కల్పించాలని పిటిషన్
- పోలీసు భద్రత పొందేందుకు అనర్హులన్న హైకోర్టు
- ప్రాణహాని లేదని సెక్యూరిటీ రివ్యూ కమిటీ తేల్చిందన్న ధర్మాసనం
- కమిటీ నివేదికపై అభ్యంతరాలుంటే సవాల్ చేసుకోవాలని సూచన



అమరావతి: పోలీసు భద్రత పొందేందుకు మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్రెడ్డి అనర్హులని ఏపీ హైకోర్టు తేల్చి చెప్పింది. తనకు భద్రత కల్పించాలని కోరుతూ పొన్నవోలు దాఖలు చేసిన పిటిషన్పై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. రాజ్యాంగ, చట్టబద్ధ పదవులు నిర్వహించినంతమాత్రాన పోలీసు భద్రతకు అర్హులు కాదని ఉన్నత న్యాయస్థానం పేర్కొంది. ప్రాణహాని లేదని సెక్యూరిటీ రివ్యూ కమిటీ ఇప్పటికే తేల్చిందని దర్మాసనం గుర్తు చేసింది. కమిటీ నివేదికపై అభ్యంతరాలుంటే సవాల్ చేసుకోవాలని సూచించింది. ప్రాణహాని ఉందని నిర్ధరణ జరిగి, ప్రభుత్వం భద్రత కల్పిస్తే ఆ ఖర్చు పొన్నవోలే భరించాలని హైకోర్టు స్పష్టం చేసింది.

## అలుపెరుగని అక్షరాయుధుడు-ఏబీకే పుస్తకం ఆవిష్కరణ

### హాజరైన తెలుగు సీనియర్ జర్నలిస్టులు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: 90 ఏళ్లకు చేరిన అక్షర దిగ్గజం సీనియర్ ఎడిటర్ ఏబీకే ప్రసాద్ గ్రంధావిష్కరణ గురువారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో జరిగింది. ఈ సందర్భంగా ఏపీకె ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్వ ప్రధానమంత్రి మీడియా సలహాదారు, ఫైనాన్షియల్ ఎక్స్ ప్రెస్ పూర్వ సంపాదకులు డాక్టర్ సంజయ్ బారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు జర్నలిస్టులు ఏబీకే ప్రసాద్ కు ఓ ప్రత్యేకత ఉందన్నారు. ఏబీకే ప్రసాద్ సామాజిక స్పృహ గల జర్నలిస్టుగా సమాజానికి ఎంతో సేవలు అందించాలని కొనియాడారు. అలుపెరుగని అక్షరాయుడు-ఏబికె అనే పేరుతో సంకలనం తీసుకురావడం అభినందనీయమన్నారు.విశిష్ట అతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షులు కే. శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీకే తన విధి నిర్వహణలో నిరంతరం సమాజానికి సేవలందించే జర్నలిస్టుగా పేరు తెచ్చుకున్నారని సీనియర్ ఎడిటర్ గా ఏబీకే తనకు తానే సాటి అని నిరూపించుకున్నారన్నారు. అక్షరాయుడు ఏబికె పుస్తకం భావితరాల జర్నలిస్టులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్షులు దాసు కేశవరావు వ్యవహరించారు. ఆత్మీయ అతిథులుగా డాక్టర్ కే రామచంద్ర మూర్తి, ఆంధ్రజ్యోతి ఎడిటర్ డాక్టర్ కే శ్రీనివాస్, విశాలాంధ్ర ఎడిటర్ ఆర్ వి రామారావు, లు హాజరయ్యారు. కార్యక్రమంలో వయోధిక పాత్రికేయ సంఘం కార్యదర్శి కే లక్ష్మణరావు, సీనియర్ జర్నలిస్టులు మాడభూషి శ్రీధర్, వల్లీశ్వర్, భగీరథ, ములుగు రాజేశ్వరరావు, హేమ సుందర్, టి శ్రీనివాసన్, డాక్టర్ రామ మూర్తి, వాకాటి మధు, శ్రీనివాస్ రెడ్డి, తాడి ప్రకాష్, ఎన్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌పై వైసీపీది అనవసర రాద్ధాంతం

- అవగాహనా రాహిత్యంతో విమర్శలు చేస్తున్నారు
- వైసీపీ ప్రభుత్వం ఆర్థిక అరాచకత్వానికి పాల్పడింది
- అందుకే ఆర్డినెన్స్ తీసుకురావాల్సి వచ్చింది
- టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు



అమరావతి: వైసీపీ నేతలు అవగాహనా రాహిత్యంతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆర్డినెన్స్పై విమర్శలు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్థిక అరాచకత్వం వల్లనే ఈ ఆర్డినెన్స్ తీసుకురావాల్సి వచ్చిందని చెప్పారు. ఐదేళ్ళ పన్నులు, ఛార్జీల రూపంలో ఒక్కో కుటుంబంపై రూ.7 లక్షల మేర భారం విధించి ప్రజల రక్తాన్ని వైసీపీ పాలకులు పీల్చి లక్షల కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. రూ.35 వేల కోట్ల విలువైన 1.75 లక్షల ఎకరాలను, సహజ వనరులను దోచేసి రూ.19 వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. 2014-19 మధ్య 13.5% కాగా, 2019-24 మధ్య అది 10.5%నికి పడిపోయింది. 2014-19తో పోలిస్తే మూలధన వ్యయం జగన్ పాలనలో 60% తగ్గిందని తెలిపారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం తెలంగాణతో పోలిస్తే ఏపీకి 3.66% అధికంగా ఉండేదని అన్నారు. అలాంటిది జగన్ రెడ్డి పరిపాలన వల్ల ఏపీ కంటే తెలంగాణాకు 31.65% పెరిగిందని చెప్పారు. బడ్జెట్లో లేని అప్పులు, పెండింగ్ బిల్లులు, కార్పొరేషన్ ద్వారా అప్పులు వంటి విషయాలను ప్రజలకు తెలియకుండా చేసింది వైసీపీ నేతలు కాదా..? అని ప్రశ్నించారు. లక్షల కోట్లు అప్పులు చేసి ఐదేళ్లలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా జగన్ ప్రభుత్వం పూర్తి చేయలేదని మండిపడ్డారు. ఎఫ్ఆర్బీఎం నిబంధనలను సైతం ఉల్లంఘించి యథేచ్ఛగా రూ.10 లక్షల కోట్లకు పైగా అప్పులు తెచ్చారని ఆరోపించారు. 2018-19లో రూ.35,465 కోట్లు ద్రవ్యలోటు ఉండగా, 2022-23 నాటికి రూ.52,508 కోట్లకు చేర్చారని మండిపడ్డారు. ప్రభుత్వ భూములు, కార్యాలయాలతో పాటు రాష్ట్ర సచివాలయాన్ని సైతం తాకట్టు పెట్టిన ఘనుడు జగన్ రెడ్డి అని విమర్శించారు. నాలుగు సార్లు భూముల రిజిస్ట్రేషన్ విలువను పెంచి, ఉచిత ఇసుకను రద్దు చేసి పేద, మధ్యతరగతి ప్రజలకు సొంత ఇంటి కలను జగన్ ప్రభుత్వం దూరం చేసిందని ఆరోపించారు. ప్రజల సొంత ఇంటి కలను తీర్చేందుకు రూ.4 లక్షలతో గృహ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం సాయం చేస్తోందని వివరించారు. 16,347 ఉద్యోగాలకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులకు అండగా నిలిచామని తెలిపారు. పింఛన్ను రూ.4 వేలకు పెంచడంతోపాటు అన్న క్యాంటీన్లను, రద్దు చేసిన పథకాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు.


**టీడీఆర్ వ్యవహారంలో అవకతవకలు: మంత్రి నారాయణ**

మరోవైపు పురసేవ కార్యక్రమం త్వరలో పునఃప్రారంభం చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్లో టీడీఆర్ వ్యవహారంలో చాలా అవకతవకలు జరిగాయని,, చర్యలు తప్పవని హెచ్చరించారు. టీడీఆర్ అవకతవకలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కార్పొరేషన్లో సంతకాల ఫోర్జరీ రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి తన దృష్టికి తీసుకొచ్చారని గుర్తుచేశారు. కార్పొరేషన్ కమిషనర్ల సంతకాలు ఫోర్జరీ వ్యవహారంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. 2014 నుంచి 2019 వరకు టిడ్కో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికందరికి ఇళ్లు అందిస్తామని మంత్రి నారాయణ హామీ ఇచ్చారు.

### చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని 2, 3 ఏళ్లలో పూర్తి చేసి

# రైతుల కళ్ళల్లో ఆనందం చూస్తాం

- మల్లవల్లి పారిశ్రామిక వాడకు మళ్ళీ పూర్వవైభవం
- గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి




ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: చింతలపూడి ఎత్తిపోతల పథకంను త్వరలో పూర్తిచేసి నూజివీడు ప్రాంత రైతుల కళ్ళల్లో ఆనందం చూస్తామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు గృహ నిర్మాణం శాఖామంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామంలో గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఇంటింటికి వెళ్లి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిపి పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులపై గత ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో రాష్ట్రాన్ని నాశనం చేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన వాటిలో ప్రధానమైన అయిదు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు నిర్ణయించుకున్నారని, వాటిలో చింతలపూడి ఎత్తిపోతల పథకం కూడా ఒకటని మంత్రి చెప్పారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ఈ రోజు నుంచే మళ్లీ ప్రారంభిస్తున్నామని, నూజివీడు ప్రాంతంలో నాగార్జునసాగర్‌కు సంబంధించిన కాలువలు ఇప్పటికే ఉన్నందున చింతలపూడి ఎత్తిపోతల పథకం త్వరలో సాగునీరు అందించి నూజివీడు ప్రాంత రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం అందిస్తామని మంత్రి చెప్పారు.

గతంలో తమ ప్రభుత్వ హయాంలో మల్లవల్లి లో పారిశ్రామికవాడ ఏర్పాటులో అశోక్ లేలాండ్ వంటి దిగ్గజ కంపెనీలు తమ పరిశ్రమలని ఏర్పాటు చేశాయని కానీ గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో అవి మన రాష్ట్రాన్ని వీడి వెళ్లిపోయాయి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో మళ్లీ మల్లవల్లిలో పరిశ్రమల ఏర్పాటుకు అంగీకరించాయి అన్నారు దీంతో ఈ ప్రాంత యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని మంత్రి చెప్పారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుకూలంగా పనిచేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో నిరంకుశ పాలన కారణంగా రాష్ట్రంలో అభివృద్ధి అనేదే జరగలేదని, బాధ్యత రాహిత్యమైన పాలనకు ఇది నిదర్శనం అన్నారు. గతంలో తమ ప్రభుత్వంలో పేదలకు ఇళ్ళు మంజూరు చేసిన వారి బిల్లులను గత ప్రభుత్వం చెల్లించలేదని, కొంతమందికి ప్రారంభ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను కూడా పూర్తి చేయలేదన్నారు.

ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, ఇళ్ల బిల్లులు చెల్లింపులు, ఇళ్ల నిర్మాణం ప్రారంభ దశలో ఉన్న వారికి కొత్త ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను మూడు నుండి నాలుగు వేలకి పెంచామన్నారు, అర్హత కలిగిన ప్రతి ఒక్కరిని గుర్తించి త్వరలో పెన్షన్ అందిస్తామని మంత్రి చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వృద్ధుల, పేదల ఆత్మగౌరాన్ని పెంచాయన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని తక్కువ సమయంలోనే పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో తాము అధికారం చేపట్టిన వెంటనే 16,700 పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించామని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపరిచేందుకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందిస్తున్నామని, అన్నా క్యాంటిన్లను ఆగస్టు 15వ తేదీ నుండి ప్రారంభిస్తున్నామని మంత్రి చెప్పారు. ముసునూరు మండలంలో డ్రైనేజీ రోడ్ల సమస్యను రెండు నెలల్లో పరిష్కరిస్తామన్నారు.ఈ సందర్భంగా ఆయిల్ పామ్ తోటలలో విద్యుత్ తీగల సమస్యలపై, గ్రామ ప్రజలు విద్యుత్ బిల్లుల సమస్యలపై మంత్రికి విన్నవించుకోగా వెంటనే పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మండలంలో లింక్ రోడ్లు, ఎస్.సి. కాలనీలో ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజ్ సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి చెప్పారు.మంత్రి వెంట జాయింట్ కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి, ఆర్డీఓ వై. భవానీశంకరి, తహసీల్దార్ ఎమిలీ కుమారి, డివిజినల్ పంచాయతీ అధికారి సుందరి, ఎంపిడిఓ పద్మావతి, ఈఓపి ఆర్డీ ఎస్.వి.శ్రీనివాసరావు, అర్ డబ్ల్యూఎస్ ఏ ఈ సత్యప్రసాద్, సర్పంచ్ జి. సుహాసిని, జెడ్పిటిసి ప్రతాప్, ప్రభృతులు పాల్గొన్నారు.

## ఏపీలో 96 మంది డీఎస్పీల బదిలీ

- వైసీపీతో అంటకాగిన వారంతా డీజీపీ ఆఫీసుకు అటాచ్
- పలువురు డీఎస్పీలకు నో పోస్టింగ్
- శాఖాపరమైన ఎంక్వైరీ చేయించాలంటున్న కూటమి నేతలు
- కొద్దిరోజుల్లో మరికొంత మంది బదిలీ చేసే ఛాన్స్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏకంగా 96 మంది డీఎస్పీలను బదిలీ చేసింది. ఈ మేరకు డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా గత ఐదేళ్లపాటు అరాచకానికి పాల్పడ్డ వైసీపీతో అంటకాగిన పలువురు డీఎస్పీలకు ప్రభుత్వం పోస్టింగ్లు ఇవ్వలేదు. వారందరినీ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని డీజీపీ ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్లో ఏర్పడిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలనపై దృష్టిసారించింది. అందులో భాగంగా అధికారుల స్థానచలనంపై దృష్టిసారించింది. అన్ని శాఖల్లో బదిలీలు చేపడుతున్న ప్రభుత్వం తాజాగా పోలీసు శాఖలో ఏకంగా 96 మంది డీఎస్పీలను బదిలీ చేసింది. అలాగే గత వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన పలువురు డీఎస్పీలపై బదిలీ వేటు పడింది. తాడిపత్రి, రాజంపేటలో వైసీపీ కోసం పనిచేసిన డీఎస్పీ చైతన్యను బదిలీ చేశారు. డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించిన అధికారుల జాబితాలో ఆయన పేరుంది. తాడిపత్రిలో జేసీ ప్రభాకర రెడ్డి, ఆయన అనుచరులను డీఎస్పీ చైతన్య తీవ్రంగా వేధించిన విషయం తెలిసిందే. రాజంపేటకు బదిలీ అయినా సరే తాడిపత్రికి వచ్చి జేసీ ప్రభాకర్ రెడ్డి అనుచరులపై దాడి చేశారని చైతన్యపై అభియోగాలు ఉన్నాయి. రాజంపేటలో కూడా వైసీపీ కోసం డీఎస్పీ చైతన్య పని చేశారని, తుళ్లూరు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ బదిలీ అయ్యారు. పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు తిరుమల తిరుపతి దేవస్థానం విజిలెన్స్ డీఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. కుప్పం డీఎస్పీ శ్రీనాథ్ను ఇంటెలిజెన్స్కు బదిలీ చేశారు. ఈ రోజు రేపటిలో భారీగా డీఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేయనుంది.


## ఎక్సైజ్‌శాఖ ప్రక్షాళన

- సంస్థాగత మార్పులపై సర్కార్ ఫోకస్
- స్పెషల్ ఎన్ఫోర్సుమెంట్ బ్యూరో (సెబ్) రద్దు చేసే దిశలో అడుగులు
- 19 మంది సభ్యులతో అంతర్గత కమిటీని ఏర్పాటు చేసిన ఏపీ సర్కార్
- కమిటీలో డీసీ నుంచి కానిస్టేబుల్ వరకు సభ్యులు

అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ శాఖ పని తీరు మెరుగు పరిచే విషయమై కసరత్తు చేస్తుంది. స్పెషల్ ఎన్ ఫోర్సుమెంట్ బ్యూరో- సెబ్ రద్దు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది.ఎక్సైజ్ శాఖలో సంస్థాగత మార్పులు చేసేలా చర్యలు చేపట్టింది. ఎక్సైజ్ శాఖలో సంస్థాగత మార్పులపై అధ్యయనం చేసేందుకు అంతర్గత కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు జీవో జారీ చేసింది. 19 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏపీ సర్కార్ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఎక్సైజ్ డీసీ నుంచి కానిస్టేబుల్ వరకు అందరిని సభ్యులుగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒకే గొడుగు కింద ఎక్సైజ్ శాఖను తెచ్చేలా ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. 2020లో ఎక్సైజ్ శాఖను రెండు ముక్కలు గత వైసీపీ ప్రభుత్వం చేసింది. ఎక్సైజ్, సెబ్ విభాగాలుగా చేసి కార్యకలాపాలు నిర్వహించింది.. సిబ్బంది కొరతతో పాటు ఇబ్బందులను సెబ్, ఎక్సైజ్ శాఖ ఎదుర్కొన్నాయి. ఇక, ఎక్సైజ్ శాఖలో సంస్థాగతంగా మార్పులు చేస్తామని శ్వేత పత్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రస్తావించింది. ఆగస్టు మూడో తేదీలోకా తుది నివేదిక ఇవ్వాలని కమిటీకి ఏపీ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

## టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ అధికారులకు పోస్టింగులు లేవు

- అమరావతికి ప్రపంచ బ్యాంక్ అప్పు ఇవ్వదు
- రెండు కుటుంబాల వల్ల రాష్ట్రం రెండుగా విడిపోయింది
- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ అధికారులకు పోస్టింగు లో తీవ్ర అన్యాయం జరిగిందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టరేటే ముందు ఎస్సీ కార్పొరేషన్ ప్రారంభించాలని చింతామోహన్ ఆధ్వర్యంలో ధర్నా. నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ సియంఒలో ఎస్సీ అధికారి లేడు. జిల్లా కలెక్టర్ పోస్టింగులలో కూడా ప్రాధాన్యం ఇవ్వలేదు. ఒక్కరంటే ఒక్కరూ కలెక్టర్ గా లేకుండా చేశారని తీవ్ర విమర్శలు చేశారు. . టిటిడి లో కూడా ఎస్సీ అధికాలులు లేకపోవడం చాలా బాధాకరమన్నారు. పక్క రాష్ట్రం తమిళ నాడులో సియంఒలో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్లే ఉన్నారని, త్వరలో తమిళనాడు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిగా ఎస్సీ కాబోతున్నారని వెల్లడించారు. కేంద్ర బడ్జెట్లో ఎన్డీఏ ప్రభుత్వం చంద్రబాబు చెవిలో మల్లెపూలు పెట్టిందని, కేంద్ర బడ్జెట్ లో గ్రాంటుగా అమరావతికి పోలవరానికి ఒక్క పైసా నిధులు రాలేదని తేల్చేశారు. అమరావతి నిర్మాణానికి 15 వేల కోట్లు అప్పు ఇప్పిస్తామని చెప్పడం ఆంధ్రప్రదేశ్ ను దగా చేయడమనని, అమరావతికి ప్రపంచ బ్యాంక్ అప్పు ఇవ్వదు. రాదన్నారు. అగ్రికల్చర్ ల్యాండ్ ఉన్నచోట అప్పు ఇవ్వరాదని వరల్డ్ బ్యాంక్ నిబంధన లో ఉందని వెల్లడించారు.. మూడేళ్లలో పోలవరం నిర్మాణం చేస్తామని చంద్రబాబు చెవ్తున్నారు. కానీ మరో 20 ఏళ్ల అయినా పోలవరం పూర్తి కాదన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, చంద్రబాబు నాయుడు పాలనలో పోలవరానికి ఎవరెవరు ఎంత ఖర్చు చేశారు? ఎవరికి కాంటాక్ట్ లు ఇచ్చారని ప్రశ్నించారు.

పోలవరం పై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రెండు కుటుంబాల వల్ల రాష్ట్రం రెండుగా విడిపోయిందని,ఆ రెండు కుటుంబాలకు అధికార దాహం ధన దాహం ఎక్కువ అన్నారు. ఆంధ్రాలో ఐదు కోట్లు మంది తెలుగు ప్రజలు, తెలంగాణలో నాలుగు కోట్ల తెలుగు ప్రజలు ఈరోజు అప్పుల్లో కష్టాల్లో ఉన్నారంటే ఆ రెండు కుటుంబాలే కారణమని మండి పడ్డారు. తెలంగాణలో ఒక కుటుంబం పదేళ్లు అధికారం లో ఉండి, వేల కోట్లు సంపాదించిందని, ఆంధ్రాలో మరో కుటుంబ ం పదేళ్లకు పైగా, కొన్ని రోజులు ఎక్కువగా అధికారాన్ని అనుభవించిందని చెప్పారు.

**ఏపీ అప్పుల్లో కూరుకుపోయింది..** ఆంధ్రప్రదేశ్ అప్పుల్లో కూరుకు పోయిందని, రాష్ట్ర అప్పులపై వైసీపీ టీడీపీ ఎవరికీ వారు సొంత లెక్కలు చెబుతున్నారన్నారు. జగన్ 7లక్షల కోట్లు అప్పు అని అంటాడు. కానీ పయ్యావుల కేశవ్ 13.5 లక్షల కోట్లు అప్పుల్లో ఉన్నదని అంటాడు. ఎవరు మాటల్లో! ఏది నిజమో, ఏది అబద్దమో అర్థం కావడం లేదన్నారు. . రాష్ట్ర అప్పులపై నిజ నిర్ధారణ కమిటీ వేయాలి. వాస్తవాలు ప్రజలకు తెలియాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కార్పొరేషన్లను వెంటనే ప్రారంభించాలని,. జగన్ హయాంలో తాళాలు వేసి, మూతపడ్డ కార్యాలయాలు తిరిగి తెరిపించి, రాజ్యాంగబద్ధంగా ఎస్సీలకు రావాల్సిన బడ్జెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమిళనాడు కర్ణాటక రాష్ట్రాలు నేను ఎస్సీ అని సర్టిఫికెట్ ఇచ్చిన ప్రతి ఎస్సీ కి లక్ష రూపాయలు ఉచితంగా ఇస్తున్నారని, .మన రాష్ట్రంలో కూడా ఎస్సీ కార్పొరేషన్లకు పూర్వ వైభవం తెచ్చి, దండిగా నిధులు ఇవ్వాలని చంద్రబాబును డిమాండ్ చేస్తున్నారన్నారు.

### 5,6 తేదీల్లో రెండు రోజుల పాటు

## కలక్టర్ల సమావేశం

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఈనెల 5,6 తేదీల్లో రెండు రోజుల పాటు రాష్ట్ర సచివాలయం 5వ భవనంలో కలక్టర్ల సమావేశాన్ని నిర్వహించనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పి సిసోడియా వెల్లండించారు. ఈమేరకు గురువారం రాష్ట్ర సచివాలయంలో సిసిఎల్ఏ జి.జయలక్ష్మితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సన్నాహక ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా సిసోడియా మాట్లాడుతూ ఈనెల 5,6 తేదీల్లో జిల్లా కలక్టర్ల సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని మొదటి రోజు కలక్టర్లతోను,రెండవ రోజు కలక్టర్లు,ఎస్పిలతో కలిసి సంయుక్త సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. 5వతేదీ ఉదయం 10నుంచి 11 వరకూ కలక్టర్ల సమావేశ ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.రెండు రోజుల్లోను ఉదయం 10 నుండి సాయంత్రం .6 వరకూ కలక్టర్ల సమావేశం ఉంటుందని స్పెషల్ సిఎస్ సిసోడియా పేర్కొన్నారు.జిల్లా కలక్టర్ల సమావేశానికి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులకు స్పెషల్ సిఎస్ ఆర్పి సిసోడియా ఆదేశాలు జారీ చేశారు. కలక్టర్ల సమావేశానికి సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు,ఉప ముఖ్యమంత్రి, మంత్రి వర్యులు,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి,ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు,ముఖ్య కార్యదర్శులు, శాఖాధిపతులకు ఆహ్వానాలు పంపే ఏర్పాట్లను సాధారణ పరిపాలన శాఖ చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పి సిసోడియా చెప్పారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఆడియో వీడియో సిస్టమ్,మీడియా కవరేజ్,మినిట్స్ రికార్డు వంటి అంశాలకు సంబంధించి ఐటి అండ్ సి,ప్రణాళిక,ఐ అండ్ పిఆర్,సిఆర్డిఏ విభాగాల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సిసోడియా ఆదేశించారు.

ఈసన్నాహక సమావేశంలో సిసిఎల్ఏ జి.జయలక్ష్మి,అదనవు సిసిఎల్ఏ ఎన్.ప్రభాకర్ రెడ్డి,గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి,గుంటూరు జిల్లా కలక్టర్ నాగలక్ష్మి,ఎన్టిఆర్ జిల్లా కలక్టర్ సృజన,ప్రణాళికా శాఖ డైరెక్టర్ ఆర్.రాంబాబు,సిఆర్డిఏ అదనవు కార్యదర్శి శివరామ కృష్ణ,జిఏడి డిప్యూటీ సెక్రటరీ రామసుబ్బయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.



# తెలుగు రాష్ట్రాలలో డిప్యూటీ సీఎంలు

# పవర్ ఫుల్

## గతంలో డమ్మీలు - నేడు వారిదే హవా

**ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో డిప్యూటీ సీఎంల హవా కొనసాగుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఉప ముఖ్యమంత్రి పదవులు ఉన్నప్పటికీ మంత్రులుగానే కొనసాగారు. కానీ రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా రెండు రాష్ట్రాలలో ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చినప్పటికీ పవర్ ఫుల్‌గా పనిచేసిన దాఖలాలు లేవు. అయితే ఇటీవల రెండు రాష్ట్రాలలో అధికార మార్పిడి జరగడం తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్‌లు మాత్రం తమదైన శైలిలో హవా కొనసాగిస్తున్నారు. ముఖ్యమంత్రి తర్వాత ముఖ్యమంత్రిలా వ్యవహరిస్తూ డిప్యూటీ సీఎం పదవికి వన్నెతెస్తున్నారు. గతంలో తెలుగు రాష్ట్రాల్లో డిప్యూటీ సీఎంలు కొనసాగినప్పటికీ వారు నామమాత్రంగానే పనిచేశారు. ప్రస్తుతం డిప్యూటీ సీఎంల పనితీరు చూస్తుంటే గతంలో పనిచేసిన డిప్యూటీ సీఎంలు డమ్మీలలా వ్యవహరించారనే విధంగా అందరిలో చర్చ సాగింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంలు తమ పదవులకు వన్నెతెచ్చారని చర్చ జరుగుతుంది.**



తెలుగునాట డిప్యూటీ సీఎం పదవికి ఎన్నడూ లేనంత గుర్తింపు, గౌరవం! ప్రభుత్వ కార్యాలయాలలో తన ఫోటో పక్కన పవన్ ఫోటో కూడా పెట్టాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఒక ఉప ముఖ్యమంత్రికి ఇంతకు మించిన గౌరవం ఎక్కడ దొరుకుతుంది. సాధారణంగా ఉపముఖ్యమంత్రి పదవి అంటే ఆరో వేలు అనే ఒక భావం ఉండేది గతంలో. అయితే ఆ పరిస్థితి ఇప్పుడు పూ ర్తిగా మారిపోయింది. సింగిల్ పార్టీ అధికారంలోకి వస్తే అంతర్గతంగా ఉండే అసమ్మతులను చల్లార్చటంకోసం, సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వివిధ పార్టీలలోని అసమ్మతులను చల్లార్చటంకోసం ప్రస్తుతం ఈ ఉప ముఖ్యమంత్రి పదవిని ఉపయోగిస్తున్నారు. ఇక రెండు తెలుగు రాష్ట్రాలలో అయితే దేశంలోనే మరెక్కడా లేనంతగా ఉపముఖ్య మంత్రులు కీలకపాత్ర పోషిస్తున్నారు, సీఎమ్లు కూడా వారికి అధిక ప్రాధాన్యత, గౌరవాన్ని ఇస్తున్నారు. ఇది ఒక కొత్త పరిణామం.

ఉప ముఖ్యమంత్రి పదవి రాజ్యాంగబద్ధం కాదు అంటూ ఆ మధ్య దాఖలైన పిటిషన్‌పై సుప్రీమ్ కోర్ట్ స్పందిస్తూ, ఆ పదవుల నియా మకాలలో తప్పేమీ లేదని తీర్పు ఇచ్చింది. ఇప్పుడు దేశంలోని 28 రాష్ట్రాలలో 14 రాష్ట్రాలలో ఉపముఖ్యమంత్రులు ఉన్నారు. బీజేపీ అయితే ఈ మధ్య తాము అధికారంలోకి వచ్చిన ప్రతిరాష్ట్రంలోనూ ఒక సీఎమ్, ఇద్దరు డిప్యూటీ సీఎంలు అనే ఫార్ములాను అనుసరిస్తోంది. యూపీలో మొదలైన ఈ సంప్రదాయాన్ని రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిషాలలో కూడా కొనసాగిస్తోంది. మహారాష్ట్ర, బీహార్, నాగాల్యాండ్, మేఘాలయ రాష్ట్రాలలో కూడా ఇద్దరు డిప్యూటీలు ఉన్నారు. త్వరలో తమిళనాడులో కూడా ఉపముఖ్యమంత్రి రాబోతున్నారని, ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్‌ను ఆ పదవిలో నియమిం చబోతున్నారని వార్తలు వస్తున్నాయి.

అయితే ఈ 14 రాష్ట్రాలలో కర్ణాటకలోని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు తప్పిస్తే, మిగిలినవారికి ఎవరికీ లేని ప్రత్యేక గుర్తింపు, గౌరవం ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో డిప్యూటీ సీఎంలుగా ఉన్న పవన్ కళ్యాణ్, మల్లు భట్టి విక్రమార్కలకు ఉన్నాయి. దీనికి మారిన రాజకీయ, సామాజిక సమీకరణాలు కారణమని చెప్పుకోవచ్చు. 2014లో విభజన తర్వాత ఏపీలో గెలిచిన చంద్రబాబునాయుడు కాపు సామాజికవర్గానికి చెందిన నిమ్మకాయల చినరాజప్పను, గౌడ సామాజికవర్గానికి చెందిన కేఈ కృష్ణమూర్తిని డిప్యూటీ సీఎంలుగా నియమించుకోగా, కేసీఆర్ ముగ్గురిని నియమించుకున్నారు ఒక ముస్లిమ్, ఇద్దరు ఎస్సీ మాదిగ. 2019లో జగన్మోహన్ రెడ్డి గెలిచిన తర్వాత ఈ ఉప ముఖ్యమంత్రుల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ ఒక రికార్డ్ సృష్టించింది ఏకంగా ఐదుగురు డిప్యూటీ సీఎంలతో. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని ఐదు ప్రధానవర్గాలైన ముస్లిమ్, కాపు, ఎస్సీ, ఎస్టీ, శెట్టిబలిజ(బీసీ)లకు ఉప ముఖ్యమంత్రి పదవులు కట్టబెట్టి సోషల్ ఇంజనీరింగ్ చేయటానికి ప్రయత్నించారు. అయితే ఆ సోషల్ ఇంజనీరింగ్ ఇటీవలి ఎన్నికల్లో ఏమీ ఫలితాలు ఇవ్వకపోవటం వేరే విషయం అనుకోండి.

ప్రస్తుతం మాత్రం రెండు తెలుగు రాష్ట్రాలలో ఒక్కొక్కరే ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఇప్పటివరకు ఈ ఉప ముఖ్యమంత్రి పదవుల్లో ఉన్నవారు కేవలం ఉత్సవ విగ్రహాలుగా ఉండేవారు. ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డిపై తెలుగుదేశం విమర్శలు కూడా గుప్పించేది. ప్రధానమంత్రి, రాష్ట్రపతి, గవర్నర్ వంటి పెద్దలను కలవటానికి వెళ్ళేటప్పుడు ఉప ముఖ్య మంత్రులను తీసుకెళ్ళలేదు అంటూ కేవలం ఆయా వర్గాలకు పెద్దపీట వేశామని డప్పులు కొట్టుకోవటమేగానీ, ఆ ఉప ముఖ్యమంత్రులను కీలక సమావేశాలకు తీసుకెళ్ళకపోవటం వారిని అవమానించటమేనని ఆరోపించేవారు. ఇక్కడ కేసీఆర్ కూడా అంతే. ఉప ముఖ్యమంత్రులకు ఇసుమంతైనా ప్రత్యేక గౌరవం ఉండేది కాదు. అయితే ఇప్పుడు రెండు రాష్ట్రాలలోనూ పరిస్థితి పూర్తిగా తల్లకిందులయింది. ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు తమ డిప్యూటీ సీఎంలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. కీలక సమావేశాలలో పక్కన కూర్చోబెట్టుకుంటున్నారు. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేముందు వారిని సంప్రదిస్తున్నారు.

### గత ప్రభుత్వ హాయంలో సైతం డిప్యూటీ సీఎంలు తెలుగు రాషాట్రల్లో కొనసాగారు

ఏపీలో తాను ముఖ్యమంత్రి పదవిని తిరిగి అలంకరించటానికి ప్రధాన కారణం పవన్ కళ్యాణ్ అని తెలుసు కనుక ఆయనకు చంద్రబాబు అంత ప్రాధాన్యత ఇస్తున్నారు. రాజమండ్రి జైలుకు వచ్చి తనను పరామర్శించి జావకారిపోయి ఉన్న తెలుగుదేశం శ్రేణులలో స్థైర్యం నింపటంవలనో, ఏమో నాటినుంచి చంద్రబాబు పవన్‌కు ప్రత్యేక గౌరవం ఇస్తూ వచ్చారు. అయితే, ఎన్నికల సమయంలో టిక్కెట్ల కేటాయింపు సందర్భంగా జనసేనకు టీడీపీ అత్యంత తక్కువ సీట్లు కేటాయించటంతో కాపులలో తీవ్రమైన అసంతృప్తి వ్యక్తమైనా కూడా, చంద్రబాబు పవన్‌కు ఇస్తున్న గౌరవం, వారిద్దరిమధ్య సుహృద్భావ బంధాన్ని చూసి కాపులు కూడా చల్లబడ్డారు. అందుకే కాపులనుంచి కూటమికి ఓట్ ట్రాన్స్‌ఫర్ పూర్తిస్థాయిలో జరిగి, కూటమి భారీ విజయాన్ని చేజిక్కించుకోగలిగింది. ఆ ఎన్నికల్లో జగన్ చేసిన సోషల్ ఇంజనీరింగ్ కంటే కూడా కూటమి అనుసరించిన కాపు+కమ్మ ఫార్ములాయే బలంగా నిలిచినందున దానిని అలాగే కొనసాగించాలని చంద్రబాబు భావిస్తున్నట్లుగా కనబడుతోంది. అందుకే పవన్కు అన్నిచోట్లా పెద్దపీట వేయటమే కాదు, ప్రభుత్వ కార్యాలయాలలో తన ఫోటో పక్కన పవన్ ఫోటో కూడా పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఒక ఉప ముఖ్యమంత్రికి ఇంతకు మించిన గౌరవం ఎక్కడ దొరుకుతుంది. తెలంగాణలో ఉప ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన మల్లు భట్టి విక్రమార్కకు కూడా సీఎమ్ రేవంత్ రెడ్డి మొదటినుంచీ చాలా గౌరవం ఇస్తూ వస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ ఫలితాలు వెలువడిన తర్వాత భట్టి కూడా ముఖ్యమంత్రి పదవి రేసులో ఉండటం, ఆయనకు పార్టీలో, బయట క్లీన్ ఇమేజ్ ఉండటం, తెలంగాణలోని బలమైన దళితవర్గానికి చెందిన నేత కావటం దీనికి కారణంగా చెప్పుకోవచ్చు. ప్రధానమంత్రిని కలవటానికి ఢిల్లీ వెళ్ళేటప్పుడు భట్టిని కూడా వెంటబెట్టుకుని వెళుతున్నారు. ఇటీవలి తెలంగాణ బడ్జెట్ సమయంలో కూడా బడ్జెట్ ప్రవేశపెట్టిన భట్టిని ఆయన సీటు వద్దకు వెళ్ళిమరీ రేవంత్ కౌగలించుకుని అభినందించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టినా, ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇస్తూ, గ్యారెంటీలు అమలు చేస్తున్నారని ప్రశంసించారు. రైతు రుణమాఫీ విజయవంతంగా చేసినందుకు కూడా భట్టిని రేవంత్ అభినందించారు. మొత్తంమీద వీరిద్దరి మధ్య ఉన్న సుహృద్భావ సంబంధం కూడా అందరినీ ఆకట్టుకుంటోంది. తెలుగు రాష్ట్రాలలో ఉపముఖ్యమంత్రులకు ఇంత గౌరవం, గుర్తింపు దక్కటం వెనక వారికున్న క్లీన్ ఇమేజ్‌తో పాటు, వారి సామాజికవర్గ బలం కూడా కారణం అని చెప్పుకోక తప్పదు. దీనిపై సీనియర్ జర్నలిస్ట్ సూరావజ్జల రాము మాట్లాడుతూ, గతంలో రెండు రాష్ట్రాలలో ఉప ముఖ్యమంత్రులు కేవలం డమ్మీలుగా మాత్రమే ఉండేవారని, ఇప్పుడు రెండు చోట్లా ఇద్దరు బలమైన నేతలు ఆ పదవులను అలంకరించటం ఆహ్వానించదగ్గ పరిణామంటూ సంతోషం వ్యక్తం చేశారు. దీనివలన ఏకపక్షమైన పాలన కాకుండా, సీఎమ్, డిప్యూటీ కలిసి చర్చించి మంచి నిర్ణయాలు తీసుకోవటానికి అవకాశం ఏర్పడుతుందని, తప్పులు తక్కువ జరుగుతాయని అన్నారు. భట్టి విక్రమార్క ఉన్నత చదువులు చదివిన విద్యావంతుడు అని, ఆయన బాగా పని చేస్తున్నారని ప్రశంశించారు. అయితే, ప్రస్తుతం రెండు రాష్ట్రాలలోనూ హనీమూన్ పీరియడ్ నడుస్తున్నందున ఆల్ ఈజ్ వెల్లాగా ఉందని, మున్ముందు రెండు అధికార కేంద్రాలు తయారయ్యే ప్రమాదం ఉందని అన్నారు.

**విద్య వెంకట్, తెలంగాణ బ్యూరో 9391618181.**

### కెసిఆర్ హయాంలో...

తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు తన మంత్రివర్గంలో ఇద్దరికీ ఉప ముఖ్యమంత్రి అవకాశం కల్పించారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్యకు మొదట విడత ఉప ముఖ్యమంత్రిగా అవకాశం ఇచ్చారు. కొద్ది నెలలకే ఆయనని తొలగించి ఎమ్మెల్సీగా ఉన్న కడియం శ్రీహరికి ఉప ముఖ్యమంత్రిగా ఇచ్చారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ ముస్లిం మైనార్టీకి చెందిన మహమూద్ అలీకి ఉప ముఖ్యమంత్రి అవకాశం కల్పించారు. ఆయన హోం మంత్రిగా కొనసాగినప్పటికీ డమ్మి డిప్యూటీ సీఎంగా కొనసాగారని విమర్శలు ఉన్నాయి.

### వైయస్ జగన్ మంత్రివర్గంలో...

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం స్వీకారం చేసిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఉప ముఖ్యమంత్రులుగా ఆరుగురికి అవకాశం కల్పించారు. ధర్మాన కృష్ణదాస్, అంజద్ భాష, పాముల పుష్ప శ్రీవాణి, కే నారాయణస్వామి, పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ళ నాని (కృష్ణ శ్రీనివాస్) లకు అవకాశం కల్పించారు. ఉప ముఖ్యమంత్రి హోదా ఉన్నప్పటికీ మంత్రులుగానే వ్యవహరించారు. అయితే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ను పనితీరును పరిగణలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలకంగా మారిన ఏపీ డిప్యూటీ సీఎం ముందు గతంలో డిప్యూటీ సీఎం గా చేసిన వారు దమ్మి డిప్యూటీ సీఎం గానే కొనసాగారనే చర్చ ఉంది.







# ఒలంపిక్స్‌లో సూపర్ ఉమన్

పారిస్: ఒలంపిక్స్ మహిళల రగ్బీ మ్యాచ్లో అరుదైన దృశ్యం చోటు చేసుకుంది. బ్రిటన్తో జరిగిన మ్యాచ్లో ఐర్లాండ్ స్టార్ ఎరిన్ కింగ్ సూపర్ హ్యూమన్ తరహాలో తన శక్తియుక్తులను ప్రదర్శించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. మరో ఐదు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా.. ప్రత్యర్థి బ్రిటన్ జట్టు క్రీడాకారిణులు బంతిని ఐర్లాండ్ జట్టు సభ్యురాలైన ఎమిలీ లేన్ లక్ష్యంగా విసిరేశారు. దీన్ని పసిగట్టిన ఎరిన్.. లిప్తపాటులో ఎమిలీని అమాంతం పైకి ఎత్తేయడం.. ఆమె బంతిని అందుకోవడం క్షణాల్లో జరిగిపోయాయి. అంతేకాదు, ఎంతబలంగా పైకి ఎత్తుకుందో అంతే చాకచక్యంగా ఎమిలీని గాయాలపాలవకుండా కిందకు దించిన ఎరిన్ సూపర్ ఉమన్‌ను అనిపించుకుంది. కాగా, ఈ మ్యాచ్లో బ్రిటన్ 28 -12తో ఐర్లాండ్పై గెలిచింది.

## పారిస్ ఒలంపిక్స్‌లో

# భారత్‌కు మరో పతకం



## షూటింగ్‌లో స్వప్నిల్‌కు కాంస్యం

- మెన్స్ 3 పొజిషన్ షూటింగ్ ఫైనల్లో మూడో స్థానం
- చైనాకు చెందిన లి యుకున్‌కు స్వర్ణం
- ఉక్రెయిన్ షూటర్ కులిష్ సెర్హియ్‌కు రజతం

పారిస్: ఒలంపిక్స్లో భారత్కు మరో పతకం వచ్చింది. యువ షూటర్ స్వప్నిల్ సత్తా చాటాడు. మెన్స్ 3 పొజిషన్ షూటింగ్ ఫైనల్లో మూడో స్థానంలో నిలిచాడు. దీంతో కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. కాస్త నెమ్మదిగా ప్రారంభించిన స్వప్నిల్.. కీలక సమయంలో పుంజుకొన్నాడు. ఒక దశలో నాలుగు, ఐదు స్థానాల మధ్య కొనసాగిన అతడు.. టాప్-3లోకి వచ్చాక మాత్రం వెనక్కి తిరిగిచూడలేదు. చివరికి 451.4 పాయింట్లను సాధించి కాంస్యం అందుకొన్నాడు. చైనాకు చెందిన లి యుకున్ (463.6) స్వర్ణం, ఉక్రెయిన్ షూటర్ కులిష్ సెర్హియ్ (461.3) రజతం కైవసం చేసుకున్నారు.

మూడు పొజిషన్లలో జరిగిన ఈ పోటీల్లో బోర్లా పడుకొని (ప్రోన్), మోకాళ్ల మీద (నీలింగ్), నిల్చొని(స్టాండింగ్) షూటింగ్ చేయాలి. స్వప్నిల్ మొత్తం 451.4 పాయింట్లు సాధించాడు. అందులో మోకాళ్లపై షూటింగ్లో 153.5 పాయింట్లు, ప్రోన్ విభాగంలో 156.8 పాయింట్లు, స్టాండింగ్లో 141.1 పాయింట్లను (స్టేజ్ 2 ఎలిమినేషన్తో కలిపి) సాధించాడు.

# క్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ ఓటమి

- క్వార్టర్స్ ఫైనల్స్‌లో ఆరోన్- సో వూయి (మలేసియా)
- పురుషుల వ్యక్తిగత విభాగంలో ముగిసిన భారత ఆర్చర్ల పోరాటం



పారిస్: ఒలంపిక్స్ బ్యాడ్మింటన్లో భారత్కు తొలి డబుల్స్ పతకాన్ని అందిస్తారని ఆశించిన సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జోడీ నిరాశపర్చింది. గురువారం జరిగిన క్వార్టర్స్ ఫైనల్లో ఈ జంట (21-13, 21-14, 21-16) ఆరోన్- సో వూయి (మలేసియా) చేతిలో ఓటమిపాలైంది. టోక్యో ఒలింపిక్స్లో కాంస్యం గెలిచిన మలేసియా జంటపై తొలి గేమ్లో సాత్విక్-చిరాగ్ ద్వయం ఆధిపత్యం ప్రదర్శించింది. ఆరంభం నుంచే దూకుడుగా ఆడి గేమ్ను సొంతం చేసుకుంది. రెండో గేమ్లో మలేసియా జోడీ అద్భుతంగా ఆడింది.

ఒకదశలో 4-0తో వెనకబడిన ఆరోన్- సో వూయి ద్వయం తర్వాత వేగంగా పుంజుకుని భారత జోడీపై ఎదురుదాడికి దిగి గేమ్ను వంశం చేసుకుంది. మూడో గేమ్లో 2-5తో వెనుకబడిన భారత ద్వయం జోరు పెంచి 5-5తో స్కోరును సమం చేసింది. తర్వాత గేమ్ హోరాహోరీగా సాగింది. ఒకదశలో 16-16తో స్కోర్లు సమం అయ్యాయి. అనంతరం భారత జోడీ తేలిపోయింది. మరో వైపు, ఈ ఒలింపిక్స్లో పురుషుల వ్యక్తిగత విభాగంలో భారత ఆర్చర్ల పోరాటం ముగిసింది. రౌండ్ ఆఫ్ 64లో ప్రవీణ్ జాదవ్ ఓటమిపాలయ్యాడు.

ప్రవీణ్పై 0-6 తేడాతో వెంచావో (చైనా) విజయం సాధించాడు. అథ్లెటిక్స్ పురుషుల 20 కి.మీ. నడకలో భారత అథ్లెట్లు వికాస్ సింగ్ 30వ స్థానం (1:22:36 నిమిషాలు), పరమ్జీత్ 37వ స్థానం (1:22:48 నిమిషాలు), ఆకాశ్దీప్ 50వ స్థానంలో నిలిచారు. మహిళల 20 కి.మీ. నడకను ప్రియాంక 1:39:55 నిమిషాల్లో పూర్తి చేసి 41వ స్థానంలో నిలిచింది. మహిళల 50మీ. రైఫిల్ 3 పొజిషన్స్ క్వాలిఫికేషన్లోనూ భారత్కు నిరాశే ఎదురైంది. అంజుమ్ 584 పాయింట్లతో 18వ స్థానంలో, సిఫ్త్ కౌర్ 575 పాయింట్లతో 31వ స్థానంలో నిలిచారు. అంజుమ్ మోకాళ్లపై కూర్చుని 196 పాయింట్లు (97,99), బోర్లా పడుకుని 194 పాయింట్లు (97, 97), నిలబడి 194 పాయింట్లు (97, 97) సాధించింది. సిఫ్త్ కౌర్ మోకాళ్లపై కూర్చుని 193 పాయింట్లు (96, 97), మోకాళ్లపై కూర్చుని 195 పాయింట్లు (99,96), నిలబడి 187 పాయింట్లు (93, 94) సాధించింది.

# బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు భారత్



పారిస్: ఒలంపిక్స్ బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్ ఆటగాడు లక్ష్యసేన్ క్వార్టర్ ఫైనల్స్లోకి ప్రవేశించాడు. పురుషుల, మహిళల సింగిల్స్లో భారత ఆటగాళ్లు అద్భుతంగా రాణిస్తున్నారు. పురుషుల డబుల్స్ టీమ్ క్వార్టర్ ఫైనల్స్లో పోరాడి ఓడగా.. పురుషుల సింగిల్స్లో లక్ష్యసేన్ క్వార్టర్ ఫైనల్స్కు చేరుకున్నాడు. పురుషుల సింగిల్స్లో లక్ష్యసేన్ వరుసగా నాలుగు మ్యాచుల్లో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్ చేరుకున్నాడు. క్వార్టర్ ఫైనల్స్లో గెలిస్తే లక్ష్యసేన్ సెమీ ఫైనల్స్కు చేరుకుంటాడు. గురువారం జరిగిన మ్యాచ్లో భారత్కు చెందిన ప్రణయ్ హెచ్ ఎస్పై 21-12, 21-6 తేడాతో వరుస రెండు సెట్లను గెలుచుకున్నాడు. ఇద్దరు భారత ఆటగాళ్లే ఫ్రీక్వార్టర్స్లో తలపడ్డారు.

**పతకంపై ఆశలు..**

బ్యాడ్మింటన్లో రెండు నుంచి మూడు పతకాలు వస్తాయని భారత్ ఆశలు పెట్టుకుంది. అయితే పురుషుల డబుల్స్ టీమ్ క్వార్టర్ ఫైనల్స్లో ఓడిపోవడంతో రెండు పతకాలపై ఆశలు పెట్టుకుంది. షూటింగ్లో ఇప్పటికే మూడు పతకాలు రాగా.. బ్యాడ్మింటన్లోనూ రెండు పతకాలు రావొచ్చని క్రీడారంగ నిపుణులు అంచనా వేస్తున్నరు. పురుషుల సింగిల్స్, మహిళల సింగిల్స్లో పతకాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

**గత ఒలింపిక్స్లో..**

గత టోక్యో ఒలింపిక్స్లో మహిళల సింగిల్స్లో భారత్ కాంస్య పతకం సాధించింది.

తెలుగు తేజం పీవీ సింధు సెమీస్లో ఓడిపోవడంతో కాంస్య పతకం సాధించింది. ఈసారి మాత్రం బ్యాడ్మింటన్లో రెండు పతకాలు వస్తాయని ఇండియా ఆశలు పెట్టుకుంది. రేపు సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్, ఎల్లుండి సెమీ ఫైనల్స్ మ్యాచ్లు జరగనున్నాయి.

# టర్కీ షూటర్ యూసఫ్ సంచలనం

- సాదాసీదాగా వచ్చి పతకం సాధించాడు
- కెరీర్ ఆఖర్లో ఇలాంటి ఫీట్‌పై పతకం



పారిస్: ఒలంపిక్స్లో భారత షూటింగ్ ద్వయం మను బాకర్-సరబ్జోత్ మిక్స్డ్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించిన సంగతి తెలిసిందే. అయితే, ఇదే కేటగిరీలో టర్కీ జోడీ యూసఫ్ డికెక్-సెవ్వల్ ఇలాదా తర్హాన్ రజతం దక్కించుకుంది. మరి ఇందులో ప్రత్యేక ఏముందంటారా? టర్కీ షూటర్ యూసఫ్ ఈ పోటీల్లో పాల్గొన్న తీరే అభిమానులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

సాధారణంగా షూటింగ్ ఈవెంట్లలో క్రీడాకారులు చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. మెరుగైన కచ్చితత్వం కోసం సన్గ్లాసెస్, బయట నుంచి వచ్చే శబ్దాల నుంచి రక్షణ కోసం ఇయర్ ప్రొటక్టర్లను వాడుతుంటారు. కానీ, 51 ఏళ్ల టర్కీ షూటర్ యూసఫ్ మాత్రం ఇవేవీ పెట్టుకోకుండానే ఎయిర్ పిస్తోల్ విభాగంలో పాల్గొన్నాడు. తన పార్టనర్ తర్హాన్తో కలిసి రెండో స్థానంలో నిలిచి రజతం సాధించాడు. దీంతో డికెక్పై సోషల్ మీడియా వేదికగా ప్రశంసలతోపాటు మీమ్స్ వెల్లువెత్తాయి. ప్రేక్షకుల్లో ఒకడిలా వచ్చి షూటింగ్లో పతకం కొట్టేయడం విచిత్రంగా ఉందని కొందరు వ్యాఖ్యానించారు. తొలిసారి 2008 బీజింగ్ ఒలింపిక్స్లో పోటీపడిన యూసఫ్కి ఇది ఐదో ఎడిషన్. కానీ, ఇదే అతడి మొదటి ఒలింపిక్ పతకం కావడం విశేషం. కెరీర్ ఆఖర్లో ఇలాంటి ఫీట్తో పతకం సాధించాడని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

**ఛాంపియన్ టీటీ బ్యాట్ను విరగొట్టిన ఫొటోగ్రాఫర్ :** టేబుల్ టెన్నిస్ ప్రపంచ నంబర్ వన్ ఆటగాడు వాంగ్ చుకిన్కు చేదు అనుభవం ఎదురైంది. చైనాకు చెందిన ఈ ఛాంపియన్ ఒలింపిక్స్లో వ్యక్తిగత విభాగంలో ఓడిపోయాడు. అయితే, దీనికి కారణం అతడి బ్యాట్ విరిగిపోవడమేనని కొందరు అభిమానులు చెబుతున్న మాట. అంతకుముందు మిక్స్డ్ డబుల్స్లో స్వర్ణం గెలిచిన జట్టులో వాంగ్ ఉన్నాడు. ఆ సమయంలో తన పార్టనర్తో కలిసి ప్రేక్షకులకు అభివాదం చేస్తున్నాడు. అప్పుడు భారీగా ఫొటోగ్రాఫర్లు తోసుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో ఓ ఫొటోగ్రాఫర్ బ్యాట్ను తొక్కడంతో అది విరిగిపోయింది. ఈ వీడియో నెట్టింట వైరల్గా మారిపోయింది. దీనివల్లే సింగిల్స్లో వాంగ్ ఓడిపోయాడనే చర్చా మొదలైంది.



# నిజమే చెబుతున్నా..ఏం చేస్కుంటారో చేస్కోండి

పారిస్: ఒలింపిక్ గేమ్స్లో భారత్కు పతకాలు ఎక్కువ రాకపోవడానికి గల కారణాలపై ఫుట్బాల్ మాజీ ప్లేయర్ సునీల్ ఛెత్రీ కీలక వ్యాఖ్యలు చేశాడు. అయితే, ప్రజలు తనను ఏమన్నా సరే భయపడేది లేదని పేర్కొన్నాడు. 150 కోట్ల మంది ఉన్నా పతకాలు గెలవకపోవడానికి కారణం టాలెంట్ను ప్రోత్సహించకపోవడమని స్పష్టం చేశాడు. గత టోక్యో ఒలింపిక్స్లో కేవలం 7 పతకాలనే సాధించిన భారత్.. ప్రస్తుతం ఇప్పటి వరకు 2 కాంస్యాలను మాత్రమే సాధించింది. ఈ క్రమంలో ఓ ఇంటర్వ్యూలో ఛెత్రీ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి.

మనం దాదాపు 150 కోట్ల వరకు జనాభా ఉన్నాం. కానీ, ఒలింపిక్స్లో మాత్రం ఎక్కువ పతకాలను సాధించలేకపోతున్నాం. ఇది సరైంది కాదనేది నా భావన. భారీ జనాభాలో మంచి టాలెంట్ కలిగిన క్రీడాకారులను కనిపెట్టలేకపోవడం బాధ కలిగిస్తోంది. చైనా, జర్మనీ, జపాన్, ఆస్ట్రేలియా, కెనడా.. తదితర దేశాలు ఒలింపిక్ క్రీడల్లో మెరుగైన ప్రదర్శన చేస్తున్నాయి. మన కంటే మైళ్ల దూరం ముందున్నాయి. మనదేశంలో టాలెంట్కు కొరత లేదు. కొంతమంది టాలెంట్కు ప్రోత్సాహం లేదు అంటుంటారు. అవును ఇది వందశాతం నిజం. ఓ ఐదేళ్ల వయసులో ఫుట్బాల్ లేదా జావెలిన్ త్రో లేదా క్రికెట్ ఏ ఆటైనా సరే పిల్లలకు తెలియకపోవచ్చు. ఒకటి లేదా రెండు సార్లు ప్రయత్నిస్తారు. కానీ, ప్రోత్సాహం లేకపోవడంతో మాయమైపోతున్నారు.

ఆ తర్వాత పెద్దయ్యాక ఏదొక జాబ్ వెతుక్కొని వెళ్లిపోతున్న పరిస్థితులను ఎన్నో చూశాం. సరైన సమయంలో టాలెంట్ను గుర్తించడమే కాకుండా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఆ విషయంలో మనం చాలా వెనుకబడిపోయాం. ఇలాంటి వ్యాఖ్యలు అన్నందుకు నన్ను ఏమైనా చేసినా భయపడను. ఇదే వాస్తవం అని ఛెత్రీ వ్యాఖ్యానించాడు.

## నిఖత్ జరీన్‌కు చైనా బాక్సర్ షాక్



పారిస్: ఒలంపిక్స్లో స్వర్ణంపై గురిపెట్టిన స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్కు షాక్. మహిళల 50 కేజీల ప్రి క్వార్టర్స్లో నిఖత్పై 0-5 తేడాతో వు హు (చైనా) విజయం సాధించింది. దీంతో ఒలింపిక్స్లో నిఖత్ పతక ఆశలు ఆవిరయ్యాయి. ప్రపంచ ఛాంపియన్ అయిన నిఖత్పై ప్రత్యర్థి తొలి రౌండ్లో పదునైన పంచ్లతో విరుచుకుపడింది. దీంతో మొదటి రౌండ్ని నిఖత్ 49-46తో చేజార్చుకుంది. రెండో రౌండ్లో నిఖత్ కొన్ని పంచులు బాగానే విసిరింది. చివరకు ఈ రౌండ్ను 48-47తో ముగించింది. చివరి రౌండ్లో చైనా బాక్సర్ రెచ్చిపోగా.. నిఖత్ రక్షణాత్మక ధోరణి కనబరిచి 45-50 తేడాతో ఓటమిపాలైంది. ఆఖరికి చైనా బాక్సర్ వు హు 30-27, 29-28, 29-28, 30-27తో విజయం సాధించింది.

## హాకీ జట్టుకు తొలి ఓటమి



పారిస్: ఒలింపిక్స్లో భారత పురుషుల హాకీ జట్టు తొలి ఓటమి చవిచూసింది. పూల్ బిలో బెల్జియంతో జరిగిన మ్యాచ్లో 1-2 తేడాతో భారత్ ఓడింది. తొలి క్వార్టర్లో రెండు జట్లు గోల్ చేయలేకపోయాయి. రెండో క్వార్టర్ ఆరంభంలో (18వ నిమిషం) అభిషేక్ గోల్ చేయడంతో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో క్వార్టర్ (33వ నిమిషం) థిబ్యూ స్టాక్రోబ్రోక్స్ గోల్ చేయడంతో 1-1 స్కోరుతో సమం అయింది. 44వ నిమిషంలో డోహ్మెన్ జాన్ జాన్ మరో గోల్ చేయడంతో బెల్జియం ఆధిక్యంలోకి వెళ్లింది. చివరి క్వార్టర్లో గోల్ చేసి మ్యాచ్ను డ్రా ముగించాలని భారత్ ప్రయత్నించినా సాధ్యం కాలేదు. అయితే, ఈ మ్యాచ్ కంటే ముందే క్వార్టర్ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకున్న భారత్ శుక్రవారం (ఆగస్టు 2న) సాయంత్రం 4: 45కు తన చివరి పూల్ బి మ్యాచ్లో ఆస్ట్రేలియాతో తలపడుతుంది.

## ఐపీఎల్ మెగా వేలం

**షారుఖ్, వాడియా మధ్య డైలాగ్ వార్**



ముంబయిః ఐపీఎల్ మెగా వేలం రాబోతున్న తరుణంలో.. ఫ్రాంచైజీ యజమానులు, ఐపీఎల్ పాలక మండలి మధ్య సమావేశం జరిగింది. ముంబై వేదికగా బుధవారం రాత్ర జరిగిన ఈ భేటీలో.. మెగా వేలం నిర్వహణ, రిటెన్షన్, ఇంపాక్ట్ రూల్పై ప్రధానంగా చర్చించారు. అయితే.. ఇది అసంపూర్తిగానే ముగిసిందని, ముఖ్యంగా మెగా వేలం నిర్వహణకు ఫ్రాంచైజీలు ఆసక్తి కనబరచలేదని తెలుస్తోంది. ఈ సందర్భంగానే.. కోల్కతా నైట్ రైడర్స్ యజమాని షారుఖ్ ఖాన్, పంజాబ్ కింగ్స్ యజమాని నెస్ వాడియా మధ్య వాగ్వాదం జరిగిందని సమాచారం.

**రిటెన్షన్ ఆటగాళ్ల పరిమితిని పెంచాలన్న షారుఖ్**

ఐపీఎల్-2025కు నిర్వహించబోయే మెగా వేలాన్ని షారుఖ్ ఖాన్ వ్యతిరేకిస్తూ.. రిటెన్షన్ ఆటగాళ్ల పరిమితిని పెంచాల్సిందిగా షారుఖ్ ఈ భేటీలో గొంతెత్తినట్టు తెలిసింది. కేవలం నలుగురిని మాత్రమే కాదు.. ఎక్కువ మందిని రిటైన్ చేసుకునే అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఫలితంగా.. భవిష్యత్తులో సూపర్స్టార్లు ఎదిగే ఆటగాళ్లకు మద్దతు ఇచ్చినట్లు అవుతుందన్న విషయాన్ని హైలైట్ చేశారట. అయితే.. నెస్ వాడియా మాత్రం రిటెన్షన్ సంఖ్యను పెంచాల్సిన అవసరం లేదని, నలుగురు మాత్రమే చాలని వాదించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే.. షారుఖ్, వాడియా మధ్య కాస్త వాగ్వాదం చోటు చేసుకుందని వార్తలొస్తున్నాయి. ఇదే సమయంలో షారుఖ్కు సన్రైజర్స్ యాజమాన్యం మద్దతు తెలిపిందని, కనీసం 8 మందిని రిటైన్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు.

**తర్వాత ఏంటి?**

బుధవారం రాత్ర జరిగిన ఈ సమావేశం అసంపూర్తిగా ముగిసింది కాబట్టి.. మరోసారి భేటీ జరగొచ్చని క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. మెగా వేలంపై ఇంకా ఏకాభిప్రాయానికి రావాల్సి ఉందని, అదే రిటెన్షన్ సంఖ్యను నిర్దేశించనుందని చెప్తున్నాయి. ఒకవేళ బీసీసీఐ మెగా వేలం నిర్వహించకూడదని భావిస్తే.. అప్పుడు రిటెన్షన్ అవసరమే ఉండకపోవచ్చని అంటున్నాయి. ఇంపాక్ట్ రూల్పై విమర్శలు వస్తున్నా.. దాని వల్ల కొత్త వారికి అవకాశం లభిస్తుందని కొన్ని ఫ్రాంచైజీలు అభిప్రాయపడినట్లు క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. అలాగే.. మెగా వేలం అంశంపై షారుఖ్, వాడియా మధ్య వాగ్వాదం జరిగిందని.. వేలం నిర్వహించొద్దని షారుఖ్ పేర్కొంటే, అందుకు వ్యతిరేకంగా వాడియా వాదించారని స్పష్టం చేశాయి. మరి.. మెగా వేలం నిర్వహిస్తారా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే.

**కావ్య మారన్ వాదన ఏంటి?**

ఒక జట్టును నిర్మించడానికి చాలా సమయం పడుతుందని, అలాగే యువ ఆటగాళ్లు పరిణతి చెందడానికి కూడా కొంత టైం పడుతుందని కావ్య మారన్ ఈ సమావేశంలో పేర్కొన్నారు. ఇందుకు అభిషేక్ శర్మ ప్రస్థానాన్ని ఉదహరించారు. అభిషేక్కు ఇప్పుడున్న స్థానానికి చేరుకోవడానికి మూడేళ్ల సమయం పట్టిందని, ఇతర జట్లలోనే ఇలాంటి ఆటగాళ్లు ఎందరో ఉన్నారన్న విషయాన్ని అందరూ అంగీకరించాల్సిందేనని అన్నారు.

సూర్య
cinema@suryaa.com
విజయవాడ
శుక్రవారం
2 ఆగస్ట్ 2024



సూర్య సినిమా

# ముత్యాల సుబ్బయ్య కొత్త చిత్రం



సమాజాన్ని జాగృతం చేసే కథలు, చక్కటి కుటుంబ ఇతివృత్తంతో యాభైకి పైగా సినిమాలను తీసిన ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య ఇప్పుడు నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు. ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిషోర్ నిర్మాతగా తొలిసారి సినీరంగంలోకి అడుగుపెట్టి తీస్తున్న చిత్రమిది. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై తెరకెక్కనున్న ఈ చిత్రంలో రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు ప్రధాన పాత్రధారులు. వి.శ్రీనివాస్ (సిప్పీ) దర్శకత్వం వహించనున్నారు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణా స్టూడియోలో ఆగష్టు 9న ఈ చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవం జరుపుకుంటుందని చిత్ర సమర్పకులు ముత్యాల సుబ్బయ్య వెల్లడించగా, దర్శకుడిగా ఎప్పటికీ గుర్తుంచుకునే అద్భుత చిత్రాలను అందించిన నాన్న సమర్పణలో ఈ చిత్రం ద్వారా నిర్మాతగా చిత్ర పరిశ్రమలోకి ప్రవేశిస్తుండటం ఆనందంగా ఉందని ముత్యాల అనంత కిషోర్ తెలిపారు. ఇతర విషయాలను చిత్రం ప్రారంభం రోజున వివరిస్తామని ఆయన చెప్పారు. దర్శకుడు వి.శ్రీనివాస్ మాట్లాడుతూ, ఓ వైవిధ్య భరిత , ఫామిలీ ఎంటర్ టైనర్ గా ప్రతీ ఒక్కరూ చూసి తీరాల్సిన చిత్రంగా దీనిని మలచనున్నామని చెప్పారు.

## "బడ్డీ" క్లాస్, మాస్ అందరినీ ఎంటర్‌టైన్ చేస్తుంది

అల్లు శిరీష్ హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ "బడ్డీ". గాయత్రి భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, అధన జ్ఞానవేల్ రాజా నిర్మించారు. శామ్ ఆంటోన్ దర్శకత్వం వహించారు. నేహ జ్ఞానవేల్ రాజా కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. అడ్వెంచరస్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా ఈ సినిమా తెరకెక్కింది. ఆగస్టు 2న "బడ్డీ" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో చిత్ర విశేషాలను తెలిపారు హీరో అల్లు శిరీష్. "బడ్డీ" మూవీని లాస్ట్ ఇయర్ మార్చి లో మొదలుపెట్టి జూలైలో సినిమా కంప్లీట్ చేశాం. డిసెంబర్ లోనే రిలీజ్ కు తీసుకురావాలని అనుకున్నాం. నా మూవీస్ కు గ్యాప్ వస్తోంది. ఫాస్ట్‌గా చేసి డిసెంబర్ 31 సక్సెస్ పార్టీ చేసుకోవాలని నేనూ నిర్మాత జ్ఞానవేల్ గారూ అనుకున్నాం. అయితే ఈ సినిమాలో 3 వేలకు పైగా సీజీ షాట్స్ ఉన్నాయి. బడ్డీ ఫేస్‌ను యానిమేట్ చేయాలి. వాటిని పర్ఫెక్ట్‌గా చేయాలంటే డబ్బుతో పాటు ఆర్టిస్టులకు టైమ్ ఇవ్వాలి. దాంతో లేట్ అయ్యింది. సమ్మర్ అనుకున్నది ఆగస్టుకు పోస్ట్ పోన్ అయ్యింది. బొమ్మకు ప్రాణం వస్తే ఎలా ఉంటుందనేకీ పాయింట్ మీదే సినిమా ఉంటుంది



కాబట్టి ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ కు తగ్గకుండా సీజీ వచ్చింది. డైరెక్టర్ శామ్ ఆంటోనీ ఈ కథతో నా దగ్గరకు వచ్చి టెడ్డీ బేర్ పాయింట్ తో ఉంటుందని చెప్పారు. టెడ్డీ మూవీ తమిళంలో వచ్చింది, అలాగే ఇంగ్లీష్ లోనూ ఇలాంటి సినిమా ఉందని చెప్పాను. మీరు కథ వినండి మీకు కొత్తగా అనిపిస్తుంది, స్టోరీ విన్నాక మళ్లీ ఓటీటీలో టెడ్డీ మూవీ చూడండి అన్నారు శామ్ ఆంటోనీ. అలా కథ విన్నాను. టెడ్డీ బేర్ కు ప్రాణం రావడం అనే ఒక్క పాయింట్ ను మాత్రమే దర్శకుడు టెడ్డీ సినిమా నుంచి తీసుకున్నాడు. మిగతాదంతా కొత్త కథ. హీరోయిన్‌కు విలన్‌కు ఉండే కాన్ ఫ్లిక్ట్, హీరో క్యారెక్టరైజేషన్, కథకు ఇచ్చిన జస్టిఫికేషన్స్ అన్నీ బాగా స్క్రిప్టింగ్ చేశాడు. "బడ్డీ" కథ వింటునప్పుడు కొత్తగా అనిపించింది.

## 'అలనాటి రామచంద్రుడు'కి ఆడియన్స్ థౌజెండ్ పెర్సెంట్ కనెక్ట్ అవుతారు

యంగ్ అండ్ ట్యాలెంటెడ్ కృష్ణ వంశీ, మోక్ష లీడ్ రోల్స్‌లో నటిస్తున్న లవ్ ఎంటర్‌టైనర్ 'అలనాటి రామచంద్రుడు'. చిలుకూరి ఆకాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని హైనివా క్రియేషన్స్ బ్యానర్ పై హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. టాప్ ప్రొడక్షన్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ చిత్రాన్ని ఆగస్ట్ 2న గ్రాండ్‌గా విడుదల చేయనుంది. ఈ నేపధ్యంలో హీరో కృష్ణవంశీ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. మాది కడప. చిన్నప్పటి నుంచి సినిమాలంటే పిచ్చి, పాషన్. ముఖ్యంగా మాస్ సినిమాలంటే చాలా ఇష్టం. బాలయ్యబాబుగారు, ఎన్టీఆర్‌గారు, ప్రభాస్‌గారి సినిమాలు.. ఇలా మాస్ సినిమా ఏదున్నా ఫస్ట్ డేనే చూసేవాడిని. కాలేజ్‌లో వున్నప్పుడు ఒక షార్ట్ ఫిల్మ్‌లో నటించాను. ఇంజినీరింగ్ చేశాను. క్యాంపస్ ప్లేస్‌మెంట్ వచ్చింది. అప్పటికీ సినిమా అంటే ఇంట్రస్ట్ పోలేదు. కోవిడ్ సమయంలో సత్యానంద్‌గారి దగ్గర నటనలో శిక్షణ తీసుకున్నాను. హైదరాబాద్ వచ్చి సినిమా ప్రయత్నాలు చేశాను. ఈ క్రమంలో డైరెక్టర్ ఆకాష్‌గారిని కలిశాను. నా ఆడిషన్ ఆయనకి నచ్చి ఈ సినిమా చేయడం జరిగింది. ఇది నా అదృష్టం. చాలా ఆనందంగా వుంది. మా తల్లితండ్రులు, గురువులు, ఫ్రెండ్స్ అందరూ ఎంతగానో సపోర్ట్ చేశారు. సినిమా రిలీజ్ కోసం చాలా ఎక్సయిటింగ్‌గా చూస్తున్నాను. డైరెక్టర్ ఆకాష్‌గారు చాలా అద్భుతమైన కథ



చెప్పారు. మ్యూజిక్, విజువల్స్ రెఫరెన్స్‌తో సహా చెప్పారు. ఆయన చెప్పినపుడే మంచి సినిమా చూసిన అనుభూతి కలిగింది. ఇందులో నా పాత్ర పేరు సిద్దు. తనది ఇంట్రో వర్ట్ క్యారెక్టర్. చాలా కాంప్లెక్స్ క్యారెక్టర్. చాలా సెటిల్‌గా పెర్ఫార్ చేసే రోల్. చేయడానికి నాకు ఛాలెంజింగ్‌గా వుంటుందనిపించింది. అలాగే ఈ కథలో మంచి ఎమోషనల్ జర్నీ వుంది. ఈ రెండు నాకు చాలా నచ్చాయి. ఇందులో నాది ఇంట్రోవర్ట్ క్యారెక్టర్. హాలీవుడ్‌లో ఓ రెండు సినిమాలు చూశాను. అవి చూసి కొన్ని నేర్చుకున్నాను. అలాగే ఈ పాత్రకు చాలా దగ్గరైన నా ఫ్రెండ్ వున్నాడు. వాడిని గుర్తు చేసుకున్నాను.

## "గద్దర్ అవార్డ్స్"కు 'తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్' తరుపున పూర్తి సహకారాన్ని అందిస్తాం

రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి శ్రీఎనుముల రేవంత్‌రెడ్డిగారు తలపెట్టిన గద్దర్ అవార్డ్స్ చేయాలని సినీ ప్రముఖులు అందరితో కలిసి గద్దర్ అవార్డ్స్‌ని చేయడానికి తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ముందుకు వస్తుందని తెలియజేస్తున్నాను. చాలా రోజుల తర్వాత చాలా రోజుల నుండి ప్రభుత్వం అవార్డ్స్ చేయలేదు కాబట్టి దీన్ని గమనించి సినీ పరిశ్రమలో ఉన్న ప్రొడ్యూసర్స్ కి క్యారెక్టర్స్ కి అలాగే 24 గ్రాఫ్స్ లో ఉన్న నిపుణులైన టెక్నీషియన్స్ అందరికీ ఈ గద్దర్ అవార్డు ఇయ్యాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం చాలా గొప్ప విషయం గద్దర్ లాంటి ఒక ప్రజానాయకుడు ప్రజా గాయకుడువారి పేరుపైన అవార్డు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం దీన్ని తప్పకుండా మా తెలంగాణ ఫిలిం ఛాంబర్ తరపున కూడా మేము సపోర్ట్ చేస్తూ అందర్నీ కలుపుకొని ఈ అవార్డు ఫంక్షన్ చేయడానికి మేము ముందుంటాం దీనికి శ్రీపద్మ విభూ షణ్ మెగాస్టార్ చిరంజీవిగారు, తమ్మారెడ్డి భరద్వాజగారు కూడా సంతోషాన్ని వ్యక్తపరిచారు ఇంత మంచి కార్యక్రమాన్ని రూపొం దించిన రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డిగారికి సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట రెడ్డి గారికి మా ధన్యవాదాలు చైర్మన్ డాక్టర్ ప్రతాని రామకృష్ణ గౌడ్,వైస్ చైర్మన్స్ జేవియర్, గురురాజ్,సెక్రటరీ సాగర్ అడ్వైజర్ ఏ ఎం రత్నం.



## ఆండీ క్యారెక్టర్ మనమంతా గర్వపడేలా ఉంటుంది - వరుణ్ సందేశ్

మహా మూవీస్ మరియు ఎమ్ 3 మీడియా పతాకంపై వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలో ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మించిన చిత్రం "విరాజి". ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మూవీ హైలైట్స్ ను లేటెస్ట్ ఇంటర్వ్యూలో తెలిపారు హీరో వరుణ్ సందేశ్. "విరాజి" మూవీలో నా లుక్ కొత్తగా ఉండేలా మా డైరెక్టర్ ఆద్యంత్ హర్ష డిజైన్ చేశారు. రెండు డిఫరెంట్ కలర్స్ లో వెరైటీగా హెయిర్ స్టైల్, ముక్కు పుడక, టాటూస్‌తో ఒక కొత్త మేకోవర్ చేయించారు. నాకు కథ కంటే ముందు నేను ఈ సినిమాలో చేసిన ఆండీ క్యారెక్టర్ లుక్ ఎలా ఉంటుందో డైరెక్టర్ వివరించారు. సినిమా కంప్లీట్ అయ్యాక ఇప్పుడు ప్రమోషన్ కోసం మళ్లీ ఆ లుక్ లోనే కనిపిస్తున్నా. మీకు త్వరగా రిజిస్టర్ అయ్యి రీచ్ అవ్వాలంటే కొత్తగా కనిపించాలి. "విరాజి" ఒక మంచి సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ. మెంటల్ ఆస్పత్రి దగ్గర కొద్ది మంది ఉంటారు. వారి దగ్గరకు ఆండీ వస్తాడు. అతను వచ్చాక గందరగోళం మొదల వుతుంది. అదేంటి అనేది తెరపై చూడాలి. ఈ కథలో అంతర్లీనంగా సోషల్ మెసేజ్ ఉంటుంది. ఈ సినిమాలో నా లుక్ చూసి రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా వస్తున్నాయి. కానీ వాటికి ఈ సినిమానే సమాధానం చెబుతుంది. "విరాజి" సినిమా చూశాక నేను ఎందుకు ఈ మేకోవర్‌లో ఉన్నాను అని తెలుసుకుంటారు. ఈ సినిమా చూశాక ఆండీ క్యారెక్టర్ పట్ల గర్వపడతారు. "విరాజి" కథలో చాలా టిస్టులు టర్న్ ఉంటాయి. ఒక మంచి మూవీ చేశామని మేమంతా కాన్ఫిడెంట్ గా ఉన్నాం. ఈ సినిమాలో వర్క్ చేస్తున్నప్పుడు మేకోవర్ కోసమే ఎక్కువ కష్టపడ్డాను. హెయిర్ కలరింగ్ కోసం 7 అవర్స్, అలాగే టాటూస్ కోసం దాదాపు గంట సమయం పట్టేది. ప్రతి రోజూ ఒక స్నేక్ టాటూ వేసేవాళ్లం. "విరాజి" సినిమా చూశాక ఎమోషనల్ అయ్యాను. చివరలో హార్ట్ టచింగ్‌గా అనిపించింది. నా వైఫ్ వితిక కూడా సినిమా చూసి అలాగే ఫీలయ్యింది. ఈ సినిమాలో సగం తెలుగు సగం ఇంగ్లీష్ మాట్లాడుతుంటా. ఇది నా బాడీ లాంగ్వేజ్ కు కంఫర్ట్‌గా అనిపించింది.



## పొట్టేల్ నుంచి అనన్య నాగళ్ల బర్త్ డే పోస్టర్

యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో సాహిత్ మోతూ?రి డైరెక్ట్ చేస్తున్న'పొట్టేల్' రూరల్ బ్యాక్ డ్రాప్ లో సాగే ఫ్రెష్ అండ్ హానెస్ట్ నొవల్ కాన్సెప్ట్ మూవీ. ఇప్పటివరకు విడుదలైన కంటెంట్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది.



ఈ సినిమాలోని ఇప్పటిదాకా విడుదలైన 4 పాటలు చార్ట్ బస్టర్ హిట్స్‌గా అలరిస్తున్నాయి. అనన్య నాగళ్ల బర్త్ డే సందర్భంగా మేకర్స్ స్పెషల్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో అనన్య రూరల్ ట్రెడిషనల్ లుక్‌లో చాలా నేచురల్‌గా కనిపించారు. ఇందులో పెర్ఫార్మెన్స్ కి స్కోప్ వున్న క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు. బుజ్జమ్మగా అనన్య క్యారెక్టర్ ఎక్స్ ట్రార్డినరీగా వుండబోతోంది. ఈ మూవీలో అజయ్ ఒక పవర్ ఫుల్ రోల్ లో నటిస్తున్నారు. ఆయన క్యారెక్టర్ టెర్రిఫిక్ గా ఉండబోతోంది. ఈ చిత్రాన్ని నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగే నిర్మిస్తున్నారు. శేఖర్ చంద్ర మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ మోనిష్ భూపతి రాజు, ఎడిటింగ్ కార్తీక శ్రీనివాస్, ఆర్ట్ డైరెక్షన్ నార్ని శ్రీనివాస్.

## అరుణశ్రీ ఎంటర్‌టైన్మెంట్స్ ప్రొడక్షన్ నెం.3లో హీరో అశ్విన్

డిఫరెంట్ సబ్జెక్ట్స్ తో ప్రేక్షకులని అలరిస్తున్న యంగ్ ట్యాలెంటెడ్ హీరో అశ్విన్ బాబు మరో ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ తో రాబోతున్నారు. మెడికో థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మామిడాల ఎం.ఆర్. కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. అరుణశ్రీ ఎంటర్టైన్మెంట్స్ ప్రొడక్షన్ నెంబర్ 3గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని నిర్మాత టి. గణపతి రెడ్డి లావిష్ గా నిర్మిస్తున్నారు. ఆగష్టు1, అశ్విన్ బాబు పుట్టిన రోజు సందర్భంగా, చిత్ర యూనిట్ అశ్విన్ బాబుకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియచేస్తూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేసింది. ఈ పోస్టర్ అదిరిపోయింది, సినిమాపై చాలా క్యురియాసిటీని పెంచింది.



ఈ చిత్రంలో అశ్విన్‌బాబుకి జోడిగా రియా సుమన్ నటిస్తుండగా అయేషా ఖాన్, మురళీ శర్మ, సచిన్ ఖేడేకర్, అజయ్,విటివి గణేష్, యెష్నా చౌదరి, సుదర్శన్, శకలక శంకర్, రాఘవ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం హైదరాబాద్, వైజాగ్, కొడయ్ కేనాల్‌ల్లో 75% షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సంవత్సరం చివరిలో ప్రేక్షకులు ముందుకి రాబోతుంది.

## కేరళ కొండచరియల సహాయ కార్యక్రమాలకు ఫండ్స్ డొనేట్

కేరళలోని వాయనాడ్ జిల్లా భారీ వర్షాలతో తీవ్రంగా దెబ్బతింది. ఆ ప్రాంతంలోని అనేక గ్రామాలలో కొండచరియలు విరిగిపడ్డాయి. కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఇప్పటి వరకు దాదాపు 280 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రకృతి విలయం యావత్ దేశాన్ని కలిచి వేసింది. ప్రస్తుతం ఎన్‌డి ఆర్‌ఎఫ్, ఆర్మీ, స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేరళ సహాయ కార్యక్రమాల్లో సహాయం చేయడానికి, యాక్టర్స్ సూర్య, జ్యోతిక కార్తీ రూ.50 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. కేరళల ప్రజలకు తమ సానుభూతిని తెలియజేశారు.



## "35-చిన్న కథ కాదు" లో లెక్కల మాస్టారుగా ప్రియదర్శి



నివేత థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్ లో నటించిన న్యూ ఏజ్ క్లీన్ ఎంటర్ టైనర్."35-చిన్న కథ కాదు. సురేష్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి నంద కిషోర్ ఈమాని రైటర్ డైరెక్టర్. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ లెక్కల మాస్టారు ఎమ్. చాణక్య వర్మ గా యాక్టర్ ప్రియదర్శిని పరిచయం చేస్తూ ఒక స్పెషల్ గ్లింప్స్ ని రిలీజ్ చేశారు. లెక్కలు మాస్టారు గా ప్రియదర్శి క్యారెక్టర్ చాలా ఇంట్రస్టింగా వుంది. లుక్, పెర్ఫార్మన్స్ చాలా నేచురల్‌గా వున్నాయి. ఈ గ్లింప్స్ ప్రియదర్శి క్యారెక్టర్, సినిమా క్యూరియాసిటీని పెంచింది.

## థియేటర్లో చూడాల్సిన 'యావరేజ్ స్టూడెంట్ నాని'



మెరిసే మెరిసే సినిమాతో దర్శకుడిగా పవన్ కుమార్ కొత్తూరి సక్సెస్ అందుకున్నారు. ఈ సారి 'యావరేజ్ స్టూడెంట్ నాని' అంటూ దర్శకుడిగా, హీరోగా ఆడియెన్స్ ముందుకు రాబోతున్నారు. శ్రీ నీలకంఠ మహదేవ ఎంటర్‌టైన్మెంట్స్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై పవన్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ఆగస్ట్2న విడుదల కాబోతోంది. పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఈ చిత్రం థియేటర్లోకి రానుంది. ఈ క్రమంలో బుధవారం నాడు హీరో, హీరోయిన్లు మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలివే.. పవన్ కుమార్ మాట్లాడుతూ..' మెరిసే మెరిసే సినిమా తరువాత ఓ కథ రాసుకున్నాను. ఇది స్టూడెంట్ లైఫ్ కథ. కాస్త ఫ్రెష్ మొహం ఉండాలని అనుకున్నా. హీరోయిన్స్ విషయంలో ముందే ఫిక్స్ అయ్యా. హీరో డీగ్లామర్‌గా ఉండాలని అనుకున్నా. అలా చివరకు నేనే హీరోగా చేయాలని ఫిక్స్ అయ్యాను. ఝాన్సీ గారిని ఒప్పించేందుకు చాలా టైం పట్టింది. కారెక్టర్ గురించి ఎన్నో డీటైల్స్ అడిగారు. షార్ట్ ఫిల్మ్స్ చేసే టైంలో హీరో, డైరెక్షన్ ఇలా అన్నీ క్రాఫ్ట్‌లను హ్యాండిల్ చేస్తాం. కానీ ఫీచర్ ఫిల్మ్స్ చేసే టైంలో ఇలా అన్ని డిపార్ట్మెంట్లు హ్యాండిల్ చేయడం చాలా కష్టంగా అనిపించింది. రొమాంటిక్ సీన్లు చేయడం చాలా కష్టంగా అనిపించింది. ఇది థియేటర్లో చూడాల్సిన మూవీ. విజిల్స్ వేస్తూ అల్లరి చేస్తూ చూడాల్సిన చిత్రం' అని అన్నారు.






PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185, SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.